

పూర్వం ఖడ్గవర్మ, జీవదత్తుడు అనే క్షత్రియయువకులిద్దరు దేశాటన చేస్తూ, ఒక రాత్రివేళ కుశపురనగర ప్రాంతాన గల అరణ్యం చేరారు. ఆ రాత్రి నిద్రించేందుకు అనువైన చోటు కోసం వెతుకుతూండగా, అప్పుడప్పుడే వాళ్ళకు అల్లంత దూరంలో మిణుకు మిణుకుమంటూ చిన్న వెలుగు కనిపించింది. ఆ వెలుగు కనిపించే చోట ఎవరో మనుషులున్నారన్న సంగతి తెలియగానే, వాళ్ళెవరై వుంటారన్న సంశయం వాళ్ళిద్దరికీ కలిగింది. అక్కడ ఏ కట్టెలు కొట్టేవాడో నివసిస్తూండవచ్చు, అలాకాక ఏ బందిపోటు దొంగలో, మంత్ర తంత్ర విద్యలు నేర్చిన దుష్టమాంత్రికులో వుండవచ్చు.

ఇద్దరికీ ఒకే విధమైన సంశయం కలగటంతో, ఆ యువకులిద్దరూ కొంచెం సేపు ఆ వెలుగు కేసి చూస్తూ మౌనంగా ఊరుకున్నారు. తరవాత జీవదత్తుడు ఏదో చెప్పబోయేంతలో, ఖడ్గవర్మ ముందుకు అడుగు వేయబోయాడు. జీవదత్తుడు అతడి భుజం పట్టుకు ఆపి, "ఏమి చేయబోతున్నావ్? అక్కడికి వెళదామంటావా? కావాలంటే యిక్కడ ఏ చెట్టు కిందనైనా స్థలం శుభ్రపరచుకుని, సుఖంగా తెల్లవార్లూ నిద్రపోవచ్చు," అన్నాడు.

"హాయిగా రాత్రి వెళ్ళబుచ్చటానికి ఇల్లేదో కనిపిస్తూండగా, చెట్లకింద పడుకునే అవసరం ఎందుకు? అక్కడ వున్నవాళ్ళు ఆహ్వానించినా, లేక ఎదురు తిరిగినా మన



కొచ్చే నష్టం ఏమీలేదు. ఆహ్వానిస్తే మిత్రుల్లా ఇంట ప్రవేశిస్తాం. ఎదురు తిరిగితే తరిమి కొట్టి ఇల్లాక్రమిస్తాం," అన్నాడు ఖడ్గవర్మ.

ధైర్య సాహసాల్లో, బల పరాక్రమాల్లో ఆ ఇద్దరు క్షత్రియయువకులూ సమ ఉజ్జీలు. కాని ఖడ్గవర్మది వేగిరపాటు తత్వం. జీవదత్తుడిది శాంతస్వభావం.

యువకులిద్దరూ నిశ్శబ్దంగా నడుస్తూ పోయి ఆ వెలుగు వస్తున్న చోటుచేరారు. అక్కడ వారి కొక చిన్న పూరి ఇల్లు కనిపించింది. ఆ ఇంటి కిటికీ లోంచి దీపపు కాంతి బయటికి వస్తున్నది. జీవదత్తుడు ఇంటి తలుపు దగ్గిరకు పోయి మెల్లిగా తోసి చూశాడు. దానికి లోపల గడియవేసి వున్నది. ఈ లోపల ఖడ్గవర్మ కిటికీ దగ్గిరకు పోయి లోపలికి తొంగి చూశాడు. లోపల వృద్ధు డొకడు నిద్రపోతున్నాడు.

ఖడ్గవర్మ, జీవదత్తుడి దగ్గిరకు తిరిగి వచ్చి చిన్న గొంతుతో, "లోపల వృద్ధు డెవడో నిద్రపోతున్నాడు. రాత్రి యింకా రెండు జాములైనా కాందే, తలుపు బిగించుకుని సుఖంగా నిద్రపోయే యితడెవరై వుంటాడు?" అన్నాడు.

"పరుల కెవరికీ హాని చేయనివాడూ, పగలల్లా కష్టపడి పనిచేసేవాడూ అయి వుంటాడు. సందేహం లేదు. నీ కత్తిని కొరలో పెట్టు; తలుపు తడదామా?" అన్నాడు జీవదత్తుడు.

"అంతకంటే మరిచేయగలిగిందేముంది!" అంటూ ఖడ్గవర్మ గట్టిగా తలుపు తట్టాడు.

ఆ ధ్వనికి లోపల నిద్రిస్తున్న వృద్ధుడు మేల్కొని తలుపు తెరిచాడు. ఖడ్గవర్మా, జీవదత్తుడూ అతడికి నమస్కరించారు. "అయ్యా, మేం బాటసారులం. ఈ రాత్రికి యిక్కడ పడుకునేందుకు అనుమతిస్తారా?" అని అడిగాడు జీవదత్తుడు.

వృద్ధుడు నవ్వుతూ యిద్దర్నీ లోపలికి ఆహ్వానించి, "ఈ రాత్రే కాదు, మరెన్ని


రాత్రులైనా మీ రిక్కడ నిద్రించవచ్చు. కాని మిమ్మల్ని చూడబోతే కలిమింటి బిడ్డల్లా వున్నారు. పడుకునేందుకు నా దగ్గిర గొంగళి తప్ప మరేం లేదు." అన్నాడు.

"ఆ గొంగళి యివ్వండి. మేం మా ప్రయాణాల్లో చెట్ల కింద, కొండకోనల్లో కటిక శిలల మీద పడుకుని నిద్రపోయిన రోజులున్నవి." అన్నాడు జీవదత్తుడు.

వృద్ధుడు వాళ్ళకు చెరొక గొంగళి యిచ్చాడు. వాళ్ళు వాటిని నేల మీద పరుచుకుని పడుకోబోయేంతలో అతడు, "ఇంత చిన్న వయసులో దేశాటనకు ఎందుకు బయలుదేరారు? ఇందులో మీరాశించిన ప్రయోజనం ఏమిటి? కీర్తా? ధనమా?" అని అడిగాడు.

"ఆ రెండూ ఒకదాన్నొకటి అంటి పెట్టుకుని వుంటవి. అందులో ఏ ఒకటి లభించినా, రెండవది సమకూరినట్టే. మా వూళ్ళో సుఖంగా జీవించే తెరువు లేక, దేశాటన ప్రారంభించాం. మా శక్తి సామర్థ్యాలు, ఈ ప్రాంతపు ఏలిక అయిన పద్మసేనమహారాజు దగ్గిర ప్రదర్శించాలని, పద్మపురం పోతున్నాం." అన్నాడు జీవదత్తుడు.

వృద్ధుడు ఆ మాటలకు సంతోషిస్తున్న వాడిలా నవ్వి, "నేను ఆ మహారాజుగారి



పశువుల కాపరిని. ఆయన రేపు, ఈ ప్రాంతాలకు వేటకు వస్తున్నారు. మీ మీ శక్తిసామర్థ్యాలను చూపేందుకు చాలా అనుకూలంగా వుంటుంది. కాని...." అంటూ జీవదత్తుణ్ణి నఖశిఖ పర్యంతం ఒకసారి పరీక్షగా చూసి, "నీ మిత్రుడు ఖడ్గధారి. నువ్వు చేత దండం పట్టుకుని, తల మీద శిఖతో క్షత్రియ లక్షణాలు లోపించినట్టు కనబడుతున్నావు. ఆ కొయ్యదండంతో మహారాజు ముందు నువ్వు వీరోచిత కార్యాలు చేయగలవు?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు జీవదత్తుడు జవాబేమీ యివ్వకుండా కొంచెంగా తల పక్కకు తిప్పి



కున్నారు. ఆ క్షణం వరకూ మౌనంగా వుండి ఆ సంభాషణ అంతా వింటున్న అర్జవర్మ, "ఔరా! నా మిత్రుడి బలగర్వాలను శంకించను. అతడు బుద్ధిబలంలోనూ, దేహబలంలోనూ కూడా నా కన్న మిన్న. అతడి వేషంలో క్షత్రియయువకుడి లక్షణాలు లోపించటానికి వేరే కారణం వున్నది." అని చెప్పాడు.

"అది తెలియనందువల్లే, ఏదో ప్రశ్నించాను, ఏమీ అనుకోకండి. యువరాణి పద్మావతి సంగతి నే చెప్పటం ఎందుకు? మీకే తెలుస్తుంది. సరే, మీకు తినడానికి పెట్టేందుకు యిప్పుడు రొట్టెముక్క కూడా లేదు....కాని, కావలసినన్ని పండ్లూ ఫలాలూ వున్నవి." అని వృద్ధుడు గదిలో ఒక మూల నున్న పెద్ద బుట్టలో నుంచి కొన్ని పళ్ళు తెచ్చి వారి ముందుంచాడు.

అర్జ, జీవదత్తులు వృద్ధుడికి తమ కృతజ్ఞత చెప్పకుని, ఆ ఫలాలు భుజించి గొంగళ్ళ మీద పడుకుని తెల్లవారు జాము వరకూ సుఖంగా నిద్రపోయారు. తూర్పు తెల్లనవుతూండగా వృద్ధుడు లేచాడు. అతడితోపాటు వాళ్ళిద్దరు కూడా లేచి కాల కృత్యాలు తీర్చుకుని, దాపుల నున్న కొలనులో స్నానం చేసి, దుస్తులు ధరించి, వృద్ధుడు పెట్టిన రొట్టెలు తిన్నారు.

ఒకటి రెండు జాముల పొద్దెక్కేసరికి దూరంగా అరణ్యంలో కలకలం బయలుదేరింది. వృద్ధుడు ఆ కలకలం వస్తున్న వైపుకు చేయి చూపి, "అదుగో, మహారాజు గారు వేటకు వెళుతున్నారు. ఆయన వేటాడబోయే ప్రాంతాన సింహాలకూ, పులులకూ కొదవలేదు. ఇది మీకు మంచి అవకాశం. ఇక, నా పని మీద నేను పోతున్నాను." అన్నాడు.

అర్జ, జీవదత్తులు వెంటనే కదిలి వచ్చి సేనమహారాజు పరివారం వెనకగా బయలుదేరారు. మహారాజు, మంత్రి, మరికొందరు

రాజోద్యోగులూ గుర్రాల మీద వున్నారు. ఆయన భటుల్లో కొందరు విల్లంబులూ, మరికొందరు ఈటెలూ ధరించి వున్నారు. మిట్టమధ్యాహ్నం వేళకు కొంచెం ముందుగా, అంతా ఒక కీకారణ్య ప్రాంతం చేరారు.

రాజు గుర్రం మీద వుండి తనకు కనిపించిన పులులనూ, అడవి పందులనూ తరిమి తన చేతిలో వున్న ఈటెతో కొట్టి సాగాడు. ఒకసారి ఏదైనా పులి గర్జిస్తూ ఎదురు తిరిగినప్పుడు ఆయన ఎక్కి వున్న గుర్రం బెదిరి పక్కకు పరిగెత్తేది. అలాంటి సమయాల్లో, మంత్రి సోమదేవుడు గాని, ఆయన వెన్నంటి వున్న రాజోద్యోగుల్లో ఎవరో ఒకరు గాని బాణం కొట్టి దాన్ని వధించేవాళ్ళు.

ఖడ్గవర్మా, జీవదత్తుడూ రాజపరివారంలో కలిసి, పారిపోయే పులులనూ, సింహాలనూ కాక, కోపంతో రెచ్చిపోయి తమ మీదికి దూకబోయే వాటిని మాత్రమే వేటాడ సాగారు. ఖడ్గవర్మ అవకాశం చిక్కినప్పుడు పులులా సింహాలా వెనక కాళ్ళను తన ఎడమచేత్తో పట్టుకుని, కుడిచేత వున్న కత్తితో వాటి తలలు నరికేవాడు. జీవదత్తుడు తన మీదికి దూకబోయే క్రూరమృగాలను చేత వున్న దండంతో గట్టిగా మోది చంపేవాడు.





ఈ ఇద్దరు అపరిచిత యువకుల ధైర్య సాహసాలూ, నైపుణ్యం రాజుగారి పరివారంలో చాలామందిని ఆశ్చర్యపరిచినై. కాని, వేట ఉత్సాహంలో ఎవరూ యీ సంగతి రాజుకు చెప్పలేదు. అందరికన్న ముందు పద్మసేనమహారాజూ, కొంచెం వెనగ్గా మంత్రి సోమదేవుడూ గుర్రాలను దూకిస్తూ ముందు పోతున్నారు. వారికి హఠాత్తుగా ఒక గుబురు పొదలోంచి సింహగర్జన వినిపించింది. సింహం పొద నుంచి బయటు పడుతుందన్న నమ్మకంతో రాజూ, మంత్రి ఈటెలను ఎత్తిపట్టుకుని సిద్ధంగా వున్నారు. కాని, వారనుకున్నట్టు ఆ పొదలోంచి ఒక సింహం కాక, రెండు సింహాలు ఒకేసారి వాళ్ళ గుర్రాల మీదికి లంఘించినై.

పద్మసేనరాజూ, సోమదేవుడూ ఈటెలను సింహాల కేసి విసిరే లోపల గుర్రాలు బెదిరి, వెనక్కు తిరగబోయి ఒకదాన్నొకటి ఢీ కొట్టుకున్నై. రాజూ, మంత్రి పట్టు తప్పి వాటి మీది నుంచి కిందికి పడిపోయారు. సింహాలు నోళ్ళు తెరిచి వాళ్ళ మీదికి దూకేంతలో వెనక నుంచి ఇద్ధవర్మా, జీవదత్తుడూ భయంకరంగా అరుస్తూ ముందు కురికి, వాటి వెనకకాళ్ళను పట్టుకుని చేత నున్న ఆయుధాలతో వాటి తలల మీద గట్టిగా కొట్టారు. సింహాలు రెండూ నేల మీద పడి గిలగిల తన్నుకోసాగినై.

పద్మసేనుడూ, మంత్రీ అంత సాహసంతో సింహాల నెదుర్కొన్న ఇద్ధ, జీవదత్తుల కేసి ఆనందాశ్చర్యాలతో చూశారు. పరివారం అంతా వాళ్ళ చుట్టూ మూగారు.

పద్మసేనమహారాజు యువకు లిద్దర్ని ఉద్దేశించి, "మీ ధైర్యసాహసాలే కాక, సింహాలను చంపటంలో మీరు కనబరిచిన నైపుణ్యం కూడా నన్నెంతగానో ఆనంద పరుస్తున్నది. నా రాజ్యంలో యింత గొప్ప వీరు లున్నారన్న సంగతి, ఈ నాటివరకూ నాకు తెలియదు." అన్నారు.

మంత్రి సోమదేవుడు రాజుతో సంప్రదించి, ఖడ్గ, జీవదత్తుల పేర్లు అడిగి తెలుసుకుని, వాళ్ళను నగరానికి ఆహ్వానించాడు. ఒక గంట కాలం అందరూ చెట్లనీడల్లో విశ్రాంతి తీసుకుని, భోజనాలు ముగించిన తరవాత, తిరిగి నగరానికి బయలుదేరారు.

నగరద్వారం దాటి రాజు తన పరివారంతో తన భవనాన్ని సమీపించేంతలో, రాజవీధిలో నుంచి జనం పక్కనున్న సందుగొందులకు పారిపోతూండటం అతడి దృష్టిని ఆకర్షించింది. ఏదో శత్రుసైన్యం నగరంలోకి జొరబడిందేమో అని కూడా క్షణం సేపు అనుమానించాడు, రాజు. కాని అంతలో కొందరు యువకులు పరిగెత్తుకు వస్తూ, "దారి తొలగండి! పట్టపుటేనుగు కట్లు తెంచుకుని విరిగిన పడింది. మావటిని చంపి, అడ్డపడిన వారినందరిని తొక్కుతూ, తొండంతో విసిరికొడుతూ ఇటే వస్తున్నది." అంటూ అరిచాడు.

ఆ హెచ్చరిక వింటూనే ఖడ్గ, జీవదత్తులు రాజపరివారం నుంచి ముందుకు వచ్చారు. ఏనుగు ఎటు నుంచి వస్తున్నదా అని వాళ్ళు పరికించి చూసేంతలో, పర్వతంలా వున్న పట్టపుటేనుగు కోరల నుంచి కారుతున్న రక్తంతో, తొండాన్ని అటూ యిటూ వేగంగా తిప్పుతూ, పెద్దగా ఘీంక



రిస్తూ వారి కేసి పరిగెత్తుకు రాసాగింది. రాజూ, అతడి పరివారం ఏది అందుకు పోయి కత్తులూ, బాణాలతో దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధం కాసాగారు.

ఖడ్గవర్మ జీవదత్తుణ్ణి హెచ్చరించి కత్తి దూసి, వేగంగా తనను సమీపిస్తున్న మదపుటేనుగు కేసి మెరుపులా దూకి, దాని కాళ్ళ సందుగా పోయి, చటుక్కున దాని తోక పట్టుకుని కత్తితో వెనకకాళ్ళలో ఒకదాని మీద బలంగా కొట్టాడు. అదే సమయంలో జీవదత్తుడు ఏనుగు తొండం పట్టుకుని, ఒక్క ఊపున దాని కుంభస్థలం మీదికి ఎగిరిపోయి, దండంతో దాని తల మీద గట్టిగా మోదాడు.

ఏనుగు భయంకరంగా ఒక్కసారి ఘీంకరించి ఖడ్గవర్మను తొండంతో వడిసి పట్టుకునేందుకు వెనుదిరగ బోయింది. కాని అంతలో అతడు దాని రెండవ కాలును కూడా కత్తితో నరికాడు. అదే సమయంలో జీవదత్తుడు దాని తల మీద మరోసారి బలంగా దండంతో కొట్టాడు. ఏనుగు వెనక కాళ్ళు తెగటంతో వెనక్కు విరుచుకు పడ పోయి, తల మీద బరువుగా తగిలిన దెబ్బకు ముందుకు ఒరిగి—చివరకు పట్టు తప్పి పక్కకు పడిపోయింది.

మరుక్షణాన రాజప్రాసాదం మీది నుంచి హర్షధ్వానాలు వినిపించినై. ఖడ్గ, జీవదత్తులు తలెత్తి చూశారు. రాజకుమారి పద్మావతి తన చెలికత్తెలతో కలిసి వాళ్ళిద్దరి మీదా పూలు జల్లింది. ఆ దృశ్యం చూసిన పద్మసేనమహారాజు సంతోషంతో, "కుమారి యిన్నాళ్ళకు తనకు నచ్చిన మహావీరుడు కనిపించాడు!" అన్నాడు.

"మహారాజా, వీరు ఒకడుగాదు, యిద్దరు! యువరాణికి యీ ఇద్దరిలో ఎవరు నచ్చినట్టు? మీరు ఏకాంతంగా మాట్లాడి చూడండి," అన్నారు మంత్రి సోమదేవుడు.

—(ఇంకా వుంది)





# రాకాసిలోయ

## 2

[ఖడ్గవర్మ, జీవదత్తుడు అనే క్షత్రియయువకు లిద్దరు, పద్మపురాన్ని పాలించే పద్మసేన మహారాజును అరణ్యంలో కలుసుకున్నారు. సాయంకాలానికి అందరూ నగరానికి చేరారు. ఆ సమయంలో రాజవీధిని అల్లకల్లోలపరుస్తున్న పట్టపుటేనుగును ఖడ్గవర్మా, జీవదత్తులు సంహరించారు. రాజకుమారి పద్మావతి వాళ్ళమీద పూలు జల్లింది. తరవాత—]

మంత్రి సోమదేవుడి సలహా పద్మసేన మహారాజుకు చాలా యుక్తియుక్తంగా వున్నట్టు కనిపించింది. యువరాణి పద్మావతి ఎంతో కాలంగా, మహావీరుడైనవాణ్ణి తప్ప, మరొకడిని వివాహ మాడనని పంతంపట్టి కూర్చున్నది. ఆమెను వివాహమాడవలెనని ఎందరో రాజకుమారులు వచ్చారు. కాని, పద్మావతి వాళ్ళందరినీ ఏదో వంక చెప్పి తిరస్కరించింది. వాళ్ళల్లో అందచందాలూ, తెలివి తేటలే తప్ప, నిజమైన వీరుడి కుండవలసిన లక్షణాలు ఏ మాత్రమూ లేవని ఆమె తండ్రితో అన్నది.

పద్మసేనమహారాజుకు, ఖడ్గవర్మా, జీవదత్తుడూ మహావీరుల్లా కనిపించారు. వాళ్ళు అరణ్యంలో భయంకరమైన సింహాలనూ, పులులనూ వేటాడిన తీరు, అపూర్వమైనది! ఏవో పాతకాలపు కథల్లో తప్ప, ఎవరూ ఆ క్రూరమృగాలను ముఖాముఖి ఎదు



ర్కొని అలా సంహరించటం తాను వినలేదు, చూడలేదు.

సోమదేవుడి ఆజ్ఞ ప్రకారం ఖడ్గవర్మ, జీవదత్తులకు రాజుగారి అతిథి గృహంలో విడిది ఏర్పాటు చేయబడింది. రాజు తన కుమార్తెను పిలిచి, వాళ్లిద్దరూ అరణ్యంలో చేసిన సాహస కృత్యాల సంగతి చెప్పి, "అమ్మా, ఏనుగును చంపగానే వాళ్ళ మీద నువ్వు, నీ చెలికత్తెలూ పూలు జల్లటం నేను చూశాను. వాళ్ళల్లో ఎవరినైనా నీవు వరించావా?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు పద్మావతి చిరునవ్వు నవ్వి, "నాన్నా, నీ మాటలు నాకు వింతగా వున్నవి. పట్టపు ఏనుగును చూసి రాజవీథిలో వున్న జనం అందరూ బెదిరి పారిపోయిన మాట నిజమే. నీ వెంట వచ్చిన ఆ యువకు లిద్దరూ దాన్ని ధైర్యంగా ఎదుర్కొని చంపి, నగర ప్రజల ప్రాణాలు కాపాడిన మాటా నిజమే. అయినా, అంతమాత్రానికే వాళ్ళు మహావీరులవుతారా? నక్కను కొట్టిన వాడల్లా వేటగాడవుతాడా!" అన్నది.

"నీ వన్నది బాగున్నది. కాని, ఏ ఘన కార్యం చేసినవాడు మహావీరుడవుతాడు? ఆ సంగతి స్పష్టంగా నువ్వే తెల్చి చెప్పాలి. నాకు మాత్రం ఆ ఖడ్గ, జీవదత్తు లిద్దరూ మహావీరుల్లానే కనబడుతున్నారు," అన్నాడు మహారాజు.

"అయితే వాళ్ళను పిలిపించండి. వాళ్ళెలాంటివాళ్ళో యిప్పుడే తెల్చి చెపుతాను. మీరు మాత్రం యీ ప్రశ్నలు వారి నడగండి," అని పద్మావతి తండ్రికి అడగ వలసిన ప్రశ్నలు చెప్పింది.

రాజు సేవకుణ్ణొకణ్ణి మంత్రిని పిలుచుకు రమ్మని చెప్పి, మరొకణ్ణి ఖడ్గ, జీవదత్తుల్ని తీసుకు వచ్చేందుకు అతిథి గృహానికి పంపాడు. కొద్దిసేపటికల్లా, మంత్రి సోమదేవుడూ, ఖడ్గవర్మా, జీవదత్తులూ రాజుగారి దగ్గిరకు వచ్చారు.

పద్మసేనుడు, ఖడ్గ, జీవదత్తుల్ని. "మీరు దేశాటనకు బయలుదేరటానికి కారణం ఏమిటి?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు జీవదత్తుడు. "మేం పుట్టి పెరిగిన గ్రామంలో మా శక్తి సామర్థ్యాలూ, నేర్చిన విద్యలూ ప్రదర్శించేందుకు అవకాశం లేదు. ఆ కారణంవల్ల తమ నగరానికి వచ్చి, మీ ఎదట మా విద్యలను చూపదలిచాం." అన్నారు.

"ఈ విద్యా ప్రదర్శన అంతా ఎందుకోసం?" అన్నారు రాజు.

ఆ మాటకు ఖడ్గవర్మ ముఖం ఎర్రబడింది. జీవదత్తుడు తన మిత్రుడి కేసి కొంత పడవలసిందన్న సూచనగా చిరునవ్వు నవ్వి, "మహారాజా! ఈ లోకంలో, అరణ్యాలకు పోయి తపస్సు చేసుకోవటం ఒక్కటి తప్ప, మనిషి చేసే తక్కిన పనులన్నీ పొట్ట పోసుకునేందుకే. మేం కీర్తి గౌరవాల ద్వారా ఈ పని సాధించాలనుకున్నాం." అన్నాడు.

ఆ జవాబు విని రాజు, కూతురి కేసి చూశాడు. పద్మావతి మంత్రి సోమదేవుడి కేసి తల తిప్పి, "ఈ సమయంలో నేనిక్కడున్న కారణం ఏమిటో వారిద్దరికి అర్థమయ్యే వుంటుంది." అన్నది.

ఖడ్గవర్మా, జీవదత్తుడూ ముఖముఖాలు చూసుకున్నారు. వారికి సంగతి సరిగా





అర్థం కాలేదని గ్రహించిన మంత్రి సోమదేవుడు. "యువరాణికి తగిన వరుణ్ణి తెచ్చేందుకు మహారాజుగారు చాలా శ్రమ పడుతున్నారు. ఆమె మహావీరుణ్ణి తప్ప వివాహమాడనని పట్టుపట్టి కూర్చున్నది." అంటూ, పద్మావతి తనను పెళ్ళాడ వచ్చిన ఎందరెందరు రాజకుమారుల్ని తిరస్కరించి పంపించిందీ ఖడ్గ, జీవదత్తులతో చెప్పాడు.

"మహావీరుల సంగతి కొస్తే, నన్ను కత్తి యుద్ధంలో జయించగలిగినవాడు లేడు." అన్నాడు ఖడ్గవర్మ.

"నేను యుద్ధవిద్యలే కాకుండా మంత్ర శాస్త్రం కూడా నేర్చినవాణ్ణి. ఆ రెండిలో నాకు సమఉజ్జీ అయినవాడు ఇంకొకడు లోకంలో వుంటాడని అనుకోను." అన్నాడు జీవదత్తుడు.

ఆ మాటలు వింటూనే రాజకుమారి పద్మావతి గిరుక్కున వెనుదిరిగి చెలికత్తె చేతిలో వున్న వస్తు వొకదానిని తీసుకుని, దాన్ని ఖడ్గ, జీవదత్తులు స్పష్టంగా చూసేందుకు వీలుగా పైకెత్తి పట్టుకుని, "ఇది, రాతిరథం! వింధ్యపర్వతాల్లో ఎక్కడో వున్న ఒక రాతిరథానికి ప్రతికృతి. నేను విన్నదాన్ని బట్టి, ఆ పర్వత పంక్తుల్లో వున్న ఆ రాతిరథాన్ని కదిలించినవాడు ప్రపంచంలో సాటిలేని మహావీరుడు. అతణ్ణి నేను వరిస్తాను." అన్నది.

పద్మావతి మాటలు రాజునూ, మంత్రిని కూడా అమితంగా ఆశ్చర్యపరిచినై. ఇంత వరకూ ఆ రాతిరథం మాట వాళ్ళు విని వుండలేదు. రాజు ఆసనం మీదినుంచి లేచి కుమార్తె చేతిలో వున్న చిన్న రాతిరథాన్ని తీసుకుని అటూ యిటూ తిప్పి పరీక్షించ సాగాడు. మంత్రి సోమదేవుడు పక్కన నిలబడి దాని కేసి వింతగా చూడసాగాడు.

జీవదత్తుడు, ఖడ్గవర్మతో చిన్నగా ఏదో మాట్లాడి, తరవాత మహారాజు కేసి తిరిగి, "మహారాజా, ఈ బొమ్మరాతిరథం పోలికలే

ఉన్న పెద్ద రాతిరథం ఒకటి ఆ వింధ్య పర్వతాల్లో ఎక్కడో ఒక చోట ఉన్నదని ఖచ్చితంగా నమ్మటం ఎట్లా? దానికి రుజువేమిటి?" అని అడిగాడు.

రాజు కుమార్తె కేసి చూశాడు. పద్మావతి చిన్నగా నవ్వి, "దీనికి రుజువు మామూలు మనుషుల నుంచి కాక అమానుషశక్తుల ద్వారా నేను తెలుసుకున్నాను," అన్నది.

"యువరాణి కోసం కాకపోయినా, మేం మహావీరులం అని రుజువు చేసేందుకు వింధ్యపర్వతాల్లో ఉన్న ఆ రాతిరథాన్ని కనుక్కొని, కదిలించేందుకు బయలుదేరి పోతాం. కాని, ఆ రథం సంగతి చెప్పిన అమానుషశక్తులేవో మేం తెలుసుకోవలసిన అవసరం ఉన్నది గదా, మహారాజా!" అన్నాడు జీవదత్తుడు.

"అవునమ్మా, ఆ సంగతేమిటో చెప్పటం ధర్మంగా ఉంటుంది," అన్నాడు రాజు.

"ఇందులో దాయవలసిందేమున్నది, యువరాణీ?" అన్నాడు మంత్రి.

పద్మావతి గొంతు సవరించుకుని, "పోయిన పౌర్ణమి రోజున నేను మేడ మీద నిద్రపోతున్నాను. బాగా నడిరాత్రివేళ ఏదో శబ్దమై కళ్ళు తెరిచాను. ఆ సమయంలో పెద్ద రాక్షసాకారంలో ఉన్న నల్లని మేఘం





ఒకటి ఆకాశంలో కదుల్తూ, నేనున్నచోటుకు పైన ఒక్క క్షణకాలం ఆగింది. నేను భయంతో చెలికత్తెల్ని పిలవబోయేంతలో, ఆ ఆకారం కిందికి చేయి చాచింది. వెంటనే దభీమంటూ ఈ రాతిరథం నా పక్కన పడింది. ఆ పాటుకు చెలికత్తెలంతా లేచారు. ఆ నల్లని ఆకారం ఆకాశంలో అంతర్ధానమయింది. ఆ రథాన్ని పోలిన పెద్ద రాతి రథం వింధ్యపర్వతాల్లో వున్నదన్న సమాచారం గల చీటీ, దానికి కట్టబడి వున్నది. ఆ చీటీ తెప్పించమన్నారా?" అన్నది.

రాజూ, మంత్రీ ఏదో అనబోయేంతలో జీవదత్తుడు, "రాజకుమార్తె మాటలు సత్యం అని మేం భావిస్తున్నాం. ఆకాశంలో అలా మేఘంలా ఎగిరినవాడు రాక్షసుడో, కిన్నెరుడో, విద్యాధరుడో... అయివుంటాడు. ఏదో స్వప్రయోజనాన్ని ఆశించే వాడు, ఈ బొమ్మరాతిరథాన్ని రాకుమారి పక్కన జార్చిపోయాడు. సరే, ఇక మాకు సెలవిప్పించండి. ఉదయాన్నే మేం బయలుదేరి వింధ్యపర్వతాల్లో వున్న ఆ మూల రాతిరథాన్ని కనుక్కొని, దాన్ని కదిలించే ప్రయత్నం చేస్తాం." అన్నాడు.

"మీ యిద్దరి ధైర్యసాహసాలూ, తెలివితేటలూ నేను కళ్ళారా చూసినవాణ్ణి. విజయులై క్షేమంగా రండి." అన్నాడు పద్మసేనమహారాజు.

"నేనూ, మిమ్మల్ని విజయులై రండని, దీవిస్తున్నాను. మీ యిద్దరిలో ఎవరు గొప్ప వీరుడో అతనితో రాకుమారి వివాహం అవుతుంది." అన్నాడు మంత్రి సోమదేవుడు.

జీవదత్తుడు ముందుకొక అడుగు వేసి, "ఆ బొమ్మరాతిరథాన్ని ఒకసారి చూడనివ్వండి. ఆ వింధ్యపర్వత ప్రాంతాల్లో పూర్వం అనేక మహానగరాలు వుండి, కాలక్రమాన మట్టిలో కలిసిపోయినై. అక్కడ వుండే శిథిలాల్లో అనేకమైన రాతిరథాలు వుండవచ్చు. మేం కదిలించవలసింది—

ఈ బొమ్మరథాన్ని పోలిన రాతిరథాన్ని గదా?" అన్నారు.

రాజు, బొమ్మరాతిరథాన్ని జీవదత్తుడి చేతికిచ్చారు. దాన్ని అతడూ, ఖడ్గవర్మా బాగా పరీక్షించి చూసి, తిరిగి రాజుగారికి యిచ్చివేసి, సెలవు తీసుకుని తమ అతిథి గృహానికి వెళ్ళిపోయారు.

అప్పటికి రాత్రి చాలా పొద్దుపోయింది. ఖడ్గ, జీవదత్తులు హాయిగా నిద్రపోసాగారు. కొంతసేపటికి గదిలో ఏదో అలికిడి అవటంతో ముందుగా జీవదత్తుడు కళ్ళు తెరిచి చూశాడు. ఇద్దరు ముసుగు వ్యక్తులు గదిలో ఒక మూల వున్న కన్నం దగ్గిర నిలబడి వంగి చూస్తున్నారు. అంతలో మరొక ముసుగువాడు ఆ కన్నంలో నుంచి గది లోపలికి వచ్చాడు.

తమను చంపటానికి వచ్చిన హంతకులు వాళ్ళని తెలియగానే, జీవదత్తుడు, "ఖడ్గా! లే, హంతకులు!" అంటూ అరిచి, తలగడ పక్కనే వున్న దండాన్ని తీసుకున్నాడు.

ముసుగు వ్యక్తులు ముగ్గురూ ఒకేసారి కత్తులు దూశారు. వాళ్ళల్లో యిద్దరు జీవదత్తుడి కేసి, ఒకడు యింకా నిద్రలేవని ఖడ్గవర్మ కేసి దూశారు. జీవదత్తుడు తన మీది కురికే ముసుగువాళ్ళను తప్పుకుని, ఖడ్గవర్మ మీదికి పోబోతున్నవాణ్ణి తన



దండంతో తల మీద గట్టిగా ఒక్కదెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకు వాడు కిక్కురుమన కుండా కిందపడిపోయాడు.

ఇంతలో ఖడ్గవర్మ లేచాడు. అది చూస్తూనే చచ్చినవాడు కాగా మిగిలిన ముసుగువాళ్ళిద్దరూ, చప్పున వెనుదిరిగి గోడ కన్నంలో నుంచి దూరి పారిపోజూశారు. అందులో ముందుగా ఒకడు దూరాడు. రెండవవాడు దూరి సగం కనబడకుండా పోయాడు. జీవదత్తుడు వాడి కాలొకటి పట్టుకుని ఎలుకను లాగినట్టు గది లోపలికి లాగి, గోడ పక్కకు విసిరివేశాడు.

"ఆ పారిపోయిన దుష్టుడి సంగతి నేను చూస్తాను." అంటూ ఖడ్గవర్మ కన్నంలో నుంచి దూరి బయటికిపోయాడు.

ఆ సరికే ముసుగువాడు పరిగెత్తుతూ అతిథిగృహానికి చుట్టూ వున్న ప్రహరీ గోడను సమీపించాడు. ఖడ్గవర్మ అతణ్ణి హెచ్చరిస్తూ, "ఆగు! వెన్ను చూపిన శత్రువును నేను చంపను. కాని, దొరక్కుండా పోవాలని చూశావో చావు తప్పదు!" అన్నాడు.

అతడి మాటలు లక్ష్యపెట్టకుండా ముసుగు వ్యక్తి మరింత వేగంగా పరిగెత్తుతూ పోయి ఆరడుగుల ఎత్తున్న ప్రహరీ గోడ మీదికి ఎగిరాడు. అతడు చేతులతో గోడ పై భాగాన్ని పట్టుకుని, అవతలికి జారబోయేంతలో ఖడ్గవర్మ అక్కడికి చేరాడు. అతడికి ముసుగువాడి కాళ్ళు మాత్రమే కనిపిస్తున్నవి.

హంతకుడు తప్పుకుపోతున్నాడనే ఆదుర్దాలో ఖడ్గవర్మ ముసుగువాడి కాళ్ళల్లో ఒక దానికి గురి చూసి కత్తి విసిరాడు. ఆ కాలు తెగి టపీమంటూ కింద పడింది. అదే సమయంలో ముసుగువాడు ధఢీమంటూ గోడ అవతల పడిపోయాడు. ఆ సమయంలో రాత్రి గస్తీ తిరుగుతున్న రాజభటు లిద్దరు కేకలు పెడుతూ అక్కడికి పరిగెత్తుకు రాసాగారు. —(ఇంకా వుంది)





# రాతిరథం

## 3

[రాకుమారి పద్మావతి, ఖడ్గ జీవదత్తులకు తమకు దొరికిన ఒక బొమ్మ రాతిరథాన్ని చూసి, వింధ్యపర్వత ప్రాంతాల్లో వున్న అలాంటి పెద్ద రాతిరథాన్ని కనిపెట్టదలిచారు. ఆ రాత్రి వాళ్ళను ముగ్గురు ముసుగులు చంపబోయారు. ఖడ్గవర్మ వాళ్ళల్లో ఒకడి కాలు తెగగొట్టాడు. ఆ సమయంలో రాజభటులు అక్కడికి పరిగెత్తుకు వచ్చారు. తరవాత—]

ప్రహారీ గోడ ఆవతల రేగిన కలకలం వింటూనే జీవదత్తుడు అతిథిగృహం నుంచి, ఖడ్గవర్మ వున్న చోటుకు పరిగెత్తాడు. ఖడ్గవర్మ గోడ ఆవతల జరుగుతున్న గొడవ ఆలకిస్తున్నాడు. రాజభటులు కాలు తెగిన ముసుగు వ్యక్తిని ప్రశ్నిస్తున్నారు. వాళ్ళకు జవాబుగా వాడు పెద్దగా మూలుగుతున్నాడు.

ఖడ్గవర్మ ఒకటి రెండు మాటల్లో జరిగినదంతా జీవదత్తుడికి చెప్పాడు. జీవదత్తుడు ఆలోచించాడు; ఒక ముసుగువాడి శవం తామున్న అతిథిగృహంలో వున్నది. ఒకడు పారిపోయాడు. మరొకడు కాలు తెగి రాజవీధిలో పడివున్నాడు! ఆ ముసుగువాళ్ళను పంపిన శత్రువు లెవరై వుంటారు?

తక్షణం చేయవలసిన పనిని గురించి ఒక నిర్ణయానికి వచ్చిన జీవదత్తుడు, ప్రహారీగోడ ఎక్కి ఆవతల వున్న రాజభటులతో, "మీరు కేకలు వేసి గొడవ చేస్తే పది



మంది పోగవుతారు. ఈ ముసుగువాడు రాజగృహంలో ప్రవేశించ చూసి, తగిన శాస్తికి గురయ్యాడు. అంతా రాజుగారు చూసుకుంటారు. వాణ్ణి గోడమీదుగా లోపలికి పడవెయ్యండి!" అన్నాడు.


రాజప్రాసాదం లోపలి నుంచి మాట్లాడుతున్నాడు గనక జీవదత్తుడు ఎవరో ముఖ్య రాజోద్యోగి అయివుంటాడని భావించి, రాజభటులు కిక్కురుమనకుండా ముసుగువాణ్ణి పైకెత్తి గోడ మీద వున్న జీవదత్తుడికి అందించారు. జీవదత్తుడు వాణ్ణి దిగువ వున్న ఖడ్గవర్మ కేసి జార్చి, గోడ మీంచి కిందికి దూకాడు.

అప్పుడు కాలుపోగొట్టుకున్న ఆ ముసుగువాడి ముఖాన ముసుగు ఏంలేదు. ఆ నల్లటి వస్త్రం భుజం మీది నుంచి వేలాడుతున్నది. జీవదత్తుడు దాన్ని చించి యింకా రక్తం కారుతున్న వాడి కాలి గాయానికి గట్టిగా బిగించాడు. తరవాత అతడూ, ఖడ్గవర్మా వాణ్ణి తమ అతిథి గృహంలోకి మోసుకుపోయి, నేల మీద పడుకోబెట్టారు.

"నువ్వెవరివి? మమ్మల్ని చంపేందుకు నిన్నూ, నీ అనుచరుల్నీ పంపిన వాళ్లెవరు?" అని ప్రశ్నించాడు, జీవదత్తుడు వాణ్ణి.

వాడు దాహం అన్న సూచనగా చేయి ఆడించాడు. ఖడ్గవర్మ ఒక పాత్రలో నీళ్ళు తెచ్చి వాడి నోటికి అందించాడు. దాహం తీరిన తరవాత వాడు బాధతో మూలుగుతున్నప్పటికీ, కాస్త మైకం వదిలి యీ లోకంలోకి వచ్చినవాడిలా, చుట్టూ ఓ మారు కలయజూశాడు. అతడి దృష్టికి జీవదత్తుడి దండం దెబ్బకు ప్రాణాలు కోల్పోయినవాడి శవం—గదికి ఓ మూలగా కనిపించింది. దాన్ని చూస్తూనే వాడు పెద్దగా మూలిగాడు.

జీవదత్తుడు అతడితో, "ఒరే, నువ్వెవరు? నిన్ను పంపిన దుర్మార్గు లెవరు? నిజం


CHITRA



చెప్పావే రాజవైద్యుణ్ణి పిలిపించి నువ్వు రక్తస్రావంతో చావకుండా బతికే మార్గం చూపిస్తాను," అన్నాడు.

ఆ మాటకు కాలు తెగినవాడు గట్టిగా కళ్ళు మూసుకుని ఒకటి రెండు క్షణాలు మౌనంగా వూరుకుని, తరవాత కళ్ళు తెరిచి, జీవదత్తుణ్ణీ, ఖడ్గవర్మనూ ఒకసారి పరీక్షగా చూసి, "మీరు క్షత్రియులు, నేనూ క్షత్రియుణ్ణి. ముందు నాకు చికిత్స చేయించటం ధర్మం!" అన్నాడు.

ఆ మాటలు ఖడ్గవర్మకు చాలా కోపాన్ని తెప్పించినై. అయినా అతను దాన్ని తొక్కిపెడుతూ, "నీచుడా! నువ్వు క్షత్రియుడవేమోగాని, క్షాత్రం మాత్రం నీలో లేదు. దొంగదాటుగా వచ్చి, నిద్రపోతున్న మమ్మల్ని చంప చూసినవాడివి, నీ వెలాంటి క్షత్రియుడివి!" అన్నాడు.

జీవదత్తుడు, ఖడ్గవర్మను కొంచెం శాంతించమని చెప్పి, బయటికిపోయి రాజభవనం కాపలావాళ్ళొకణ్ణి పిలిచి, వాడితో త్వరగా వైద్యు లెవరినైనా పిలుచుకు రమ్మని చెప్పాడు.

కాపలావాడు వైద్యుణ్ణి తెచ్చే లోపల జీవదత్తుడు, కాలు తెగినవాణ్ణి మరొకసారి నిజం చెప్పమని ప్రశ్నించాడు. దానికి వాడు కొంచెంసేపు తటపటాయించి, చివరకు, "అయ్యా, నా ప్రాణాలు మీ చేతుల్లో వున్నవి!....చెప్పక తప్పదు. నేను మహేంద్రనగరం రాజుగారి రెండవ కుమారుణ్ణి. ఈ చచ్చినవాడు మంత్రిగారి మూడో కుమారుడు. ఆ పారిపోయినవాడు, సేనాపతి పెద్ద కొడుకు." అన్నాడు.

"నిజమా? అలా అయితే, ఆ తరవాతి కథ మహా బావుంటుంది! మరి, మీ ముగ్గురు మహావీరులూ, ఈ పద్మపురంలో ముసుగులు తగిలించుకుని రాత్రివేళ కొంపలకు కన్నా లేస్తున్నారెందుకు? తమ పేరు?" అన్నాడు జీవదత్తుడు.




"నా పేరు ప్రతాపచంద్రుడు. నేను ఈ పరాయి నగరంలో రాత్రివేళ ఇంత సాహసానికి ఒడిగట్టడానికి కారణం, ప్రేమ!" అన్నాడు కాలు తెగినవాడు.

"పేరులో తప్ప మీలో ప్రతాపం లేదు, ప్రతాపచంద్రా! మీ ప్రవర్తనా, చేయబూనిన పనీ, పిరికివాళ్ళూ, దుష్టులూ చేసేది. సరే, ప్రేమ అన్నారే, ఏమిటా ప్రేమ?" అని అడిగాడు జీవదత్తుడు.

ప్రతాపచంద్రుడు బాధతో మధ్య మధ్య మూలుగుతూ, ఖడ్గ జీవదత్తులకు, తాను రాకుమారి పద్మావతిని ప్రేమించాననీ, ఆమె మహావీరుణ్ణి తప్ప వివాహ మాడనని ప్రతిన బట్టటంతో, తన మిత్రులతో కలిసి, ఈ నగరం వచ్చి ఆమెను అపహరించుకు పోబూనాననీ చెప్పాడు. కాని, తన ప్రయత్నానికి ఆటంకంగా ఖడ్గ, జీవదత్తులు కనిపించారనీ--అందుకే ముందు వాళ్ళను తుద ముట్టించేందుకు ప్రయత్నించాననీ అన్నాడు.

ప్రతాపచంద్రుడు రాకుమారిని అపహరించుకు పోవటానికి, తామిద్దరూ ఎలా ఆటంకంగా పరిణమించారో ఖడ్గ జీవదత్తులకు అర్థం కాలేదు. చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న వాడి మాటలు హేతుబద్ధంగా వుండే అవకాశం లేదన్నాడు జీవదత్తుడు, ఖడ్గవర్మతో. ఇంతలో కావలావాడు ఒక యువవైద్యుణ్ణి అక్కడికి తీసుకువచ్చాడు.

ఈ వచ్చిన యువవైద్యుడు రాజవైద్యుడి దగ్గర వైద్యవిద్య నేర్చుకుంటున్నవాడు. అతడికి యీ నాటివరకూ స్వంతాన ఎవరికీ చికిత్స చేసే అవకాశం చిక్కలేదు. అందువల్ల బాధతో మూలుగుతున్న ప్రతాపచంద్రుణ్ణి చూస్తూనే, "ఆహా, కాలు తెగిపోయిందా? కుడికాలై పోయిందిగాని, ఎడమ కాలైతే తిరిగి కుట్టి, కట్లు కట్టివుండును." అన్నాడు వెంట తెచ్చుకున్న సంచిలోంచి మందుమాకులు తీస్తూ.



"కాలు తెగిపోయి చాలా సేపయింది. మనిషి చావకుండా కాపాడండి, చాలు. రాజుగారు చాలా సంతోషిస్తారు," అన్నాడు జీవదత్తుడు.

"నా చేతుల్లో యింతవరకూ ఎవరూ చావలేదు. నా సొంతాన యీ నాటివరకూ ఎవరికీ వైద్యం చేసింది కూడా లేదనుకోండి!" అంటూ యువవైద్యుడు, ప్రతాపచంద్రుడి కాలికి కట్టి వున్న వస్త్రం ముక్కను విప్పి, గాయానికి మందులు పూసి, తిరిగి కట్టుకట్టాడు.

యువవైద్యుడు యీ విధంగా తన పని పూర్తి చేసుకుని బయటికిపోయిన పావు గంటకల్లా రాజు పద్మసేనుడూ, మంత్రి సోమదేవుడూ అతిథి గృహం దగ్గిరకు వచ్చి, బయట నిలబడి, కావలావాడి చేత ఖడ్గ జీవదత్తులకు కబురు చేశారు. వాళ్ళిద్దరూ బయటికి వచ్చి, రాజునూ, మంత్రిని చూసి ఎక్కడలేని ఆశ్చర్యం పొందారు.

వాళ్ళ ఆశ్చర్యాన్ని గమనించిన మంత్రి చిన్న గొంతుతో, "మాకు ఈ జరిగిపోయిన దుర్ఘటన సంగతి ఎలా తెలిసిందనా ఏం ఆశ్చర్యం? గోడలకు చెవులుంటాయి; కావలావాళ్ళు కూడా వుంటారు! సరే, యింతకూ ఆ ప్రతాపచంద్రుడు బతుకుతాడా? అతన్ని ఏం చేయదలిచారు?" అని అడిగాడు.

రాజు, ఖడ్గ జీవదత్తుల ముఖాల కేసి తీవ్రంగా చూస్తూ వూరుకున్నాడు. ఆయనకు యీ ప్రతాపచంద్రుడి కారణంగా మహేంద్రనగర రాజుతో యుద్ధంలాటిది రావచ్చునన్న అనుమానం పట్టుకున్నది. ఈ పరిణామానికి కారకులు ఖడ్గ జీవదత్తులే అని ఆయనకు అనిపించింది.


జీవదత్తుడు రాజు మౌనానికి కారణం గ్రహించి, జరిగినదంతా ఆయనకు నివేదించి, "మహారాజా! మేము ఆత్మరక్షణకు మాత్రమే యిలా చేయవలసి వచ్చింది.

పైగా అప్పట్లో మాకు యీ ముసుగు వ్యక్తుల నాయకుడు మహేంద్ర నగరరాజు కుమారుడని తెలియదు," అన్నారు.

"సరే, జరిగిందేదో జరిగింది. ఇప్పుడేం చేస్తే బావుంటుంది?" అన్నారు రాజు. ఆ ప్రశ్న మంత్రిని, ఖడ్గజీవదత్తుల్ని కూడా ఉద్దేశించి మరీ ఆయన అడిగారు.

మంత్రి సోమదేవు డేమంటాడో చూద్దామని జీవదత్తుడు కొద్దిసేపు జవాబివ్వకుండా వూరుకున్నాడు. కాని, సోమదేవుడు కొంచెం సేపు ఆలోచిస్తూ వూరుకున తరవాత జీవదత్తుడితో, "మహారాజుగారికీ, నాకూ యీ జరిగిన విపత్తు తెలియదే అనుకుందాం. అప్పుడు మీ ఇద్దరూ ఏం చేసి వుండేవాళ్లు?" అని ప్రశ్నించాడు.

జీవదత్తుడు, ఖడ్గవర్మ కేసి చూశాడు. ఖడ్గవర్మ నువ్వే చెప్పమన్న సూచనగా తలాడించి వూరుకున్నారు. అప్పుడు జీవదత్తుడు, "మహారాజా, మహామంత్రి మా ప్రవర్తనలో ఎలాంటి తొందరపాటూ లేదని ఒప్పుకుంటారనుకుంటాను. ఈ ప్రతాపచంద్రుణ్ణి ఏమి చేయాలనేది మాకై మేము నిర్ణయించగలిగితే—యిలా చేస్తాం. ఇతణ్ణి తెల్లవారేలోపలే నగరం దాటించి అరణ్యంలో ఏ చెట్టు కిందో పడుకోబెట్టి, మా దారిన



మేము రాతిఫలం కోసం వింధ్యారణ్యాలకు పోతాం." అన్నారు.

"బహుశా అరణ్యంలో అతణ్ణి ఏ క్రూరమృగమో తినేస్తుంది. కాని పారిపోయిన సేనాని కొడుకు మూరొవాడి మాటేమిటి? వాడు మహేంద్రనగరం చేరి జరిగిన దంతా తమ రాజుకు చెప్పేస్తాడు గదా!" అన్నాడు, వర్మసేన మహారాజు.

"అందువల్ల మహారాజుకు ఎలాంటి చిక్కూ రాదు. వాడు మా ఇద్దరిని గురించే చెపుతాడు. ఆ రాజు మా మీద పగసాధించేందుకు ప్రయత్నిస్తాడు. మంత్రి కొడుకు శవాన్ని, ప్రతాపచంద్రుణ్ణి నగరం దాటించి

తీసుకుపోయేందుకు మాకు ఒక బండీ, అనుమతి పత్రం యిప్పించండి. చాలు. తక్కిన పనులన్నీ అరణ్యంలో మేం పూర్తి చేస్తాం." అన్నాడు జీవదత్తుడు.

పద్మసేనరాజూ, మంత్రీ కొంచెం దూరంగా పోయి కొద్దిసేపు ఏదో మాట్లాడుకుని తిరిగి ఖడ్గజీవదత్తుల దగ్గిరకు వచ్చారు. వాళ్ళిద్దరికీ జీవదత్తుడు చెప్పిన ఉపాయం దివ్యంగా కనిపించింది.

"సరే, మీరు కోరినట్టే వేగవంతమైన రెండెద్దులను పూన్చిన బండీ యిప్పిస్తాము. శవాన్ని, ఆ ప్రతాపుణ్ణీ దాంట్లో వేసుకుని సూర్యోదయం లోపల నగరం దాటి అరణ్యం చేరండి," అన్నాడు రాజు.

రాజుగారి ఆజ్ఞ కాగానే కావలివాడు రెండెద్లను కట్టిన బండీ ఒక దాన్ని, వెనకా ముందు తెరలు కట్టి తీసుకువచ్చాడు. నగర ద్వారాన్ని కావలా కాసేవాళ్ళకు ఎద్లబండిని బయటికి వదలవలసిందిగా సోమదేవుడు పత్రం రాసి, దానిమీద తన సొంత ముద్ర వేసి జీవదత్తుడికి యిచ్చాడు.

ఖడ్గ, జీవదత్తులు మహేంద్రనగర మంత్రి కొడుకు శవాన్ని, సొమ్మసిల్లి పడివున్న ప్రతాపచంద్రుణ్ణీ బండిలో వేసుకుని, దాని గూడుకు వెనకా ముందూ తెరలు అడ్డం కట్టి, బండి తోలుకుంటూ పోయి నగర ద్వార రక్షకులకు మంత్రిగారి ఆజ్ఞాపత్రం చూపారు. ద్వారరక్షకులు మారుమాటాడకుండా వారిని బయటికి పోనిచ్చారు.

నగరం వదులుతూనే ఖడ్గ జీవదత్తులు ఎద్లను గట్టిగా అదిలించి, అరణ్యంలో తమకు తెలిసిన పశువుల కాపరి వృద్ధుడున్న గుడిసె కేసి వేగంగా బయలుదేరారు. అదే సమయంలో ప్రాణాలతో బతికి బయటపడిన ప్రతాపచంద్రుడి మిత్రుడు, జరిగిన సంగతి తమ రాజుకు చెప్పేందుకు గుర్రం మీద శరవేగంతో మహేంద్రనగరం దిక్కుకేసి బయలుదేరాడు. —(ఇంకా వుంది)





# రాతిరథం

## 4

[ఖడ్గ జీవదత్తుల్ని చంపజూసిన ముగ్గురు ముసుగువాళ్ళూ, మహేంద్రనగరం రాజూ, కొడుకూ, అతడి మిత్రుడూ అని బయటపడింది. పద్మపురం రాజూ, మంత్రుల అనుమతితో ఖడ్గ జీవదత్తులు చచ్చిన మహేంద్రనగరం మంత్రికొడుకునూ, కాలు తెగిన ప్రతాపచంద్రుణ్ణి రెండెడ్లబండి మీద వేసుకుని అరణ్యంకేసి బయలుదేరారు. తరవాత—]

సూర్యోదయానికి చాలా ముందుగానే ఖడ్గ జీవదత్తులు వృద్ధ పశువులకాపరి నివసించే అరణ్యప్రాంతాన్ని చేరారు. పశువులకాపరి గుడిసె వద్దకు సరాసరి బండిని తోలుకు పోవటం జీవదత్తుడికి యిష్టంలేదు. తమ కారణంగా ఆ ముసలివాడు చిక్కుల్లో తగులుకునే ప్రమాదం వున్నది.

పశువులకాపరి గుడిసెకు చాలా దూరంగా ఎడ్లబండిని ఆపి, జీవదత్తుడు, ఖడ్గవర్మను తన వెంట రమ్మనమని సౌంజ్ఞచేశాడు. ఇద్దరూ బండి దిగి అల్లంత దూరంలో వున్న ఒక చెట్టు కిందికి పోయారు. వాళ్ళచుట్టూ కన్ను పొడుచుకున్నా కానరాని అంధకారం. దూరంగా అడవిమృగాలు ఆహార సంపాదనా ప్రయత్నంలో తిరుగుతూ, భయంకరంగా అరుస్తూ వుండటం వినబడుతున్నది.

"ఖడ్గా, యిక యిప్పుడు మనం ఏంచేస్తే బాగుంటుందో జాగ్రత్తగా ఆలోచించుకోవాలి.



ఈ మహేంద్రనగరం దుష్టులవల్ల అనవసరమైన చిక్కుల్లో తగుల్కున్నాం," అన్నాడు జీవదత్తుడు.

"ఆ మూడో ముసుగువాడు నీ అజాగ్రత్త వల్లనే పారిపోగలిగాడు. వాణ్ణి వదిలి నువ్వు ప్రహరీగోడ దగ్గిరకు రావలసింది కాదు. వాణ్ణి పారిపోకుండా మనం పట్టుకోగలిగి నట్టయితే, మన కిలాంటి చిక్కులూ వుండేవి కావు. వాడు బహుశా మహేంద్రనగరం పోయి, యిక్కడ జరిగినదంతా తమ రాజుకు చెప్తాడు," అన్నాడు ఖడ్గవర్మ.

"నాకూ అలాంటి అనుమానమే కలుగుతున్నది. తమ మధ్య శత్రుత్వం రాకుండా చూసుకునేందుకు, ఆ రాజూ, ఈ రాజూ ఏకమై, హంతకులమని మన వేట సాగించినా సాగించవచ్చు," అన్నాడు జీవదత్తుడు.

"బాగా చెప్పావు, జీవా! ఇక పద. ఎడ్ల బండినీ, అందులో వున్న శవాన్నీ, కుంటి వాణ్ణీ వాళ్ళ ఖర్మకు వదిలి, తెల్లారే లోపల రాజ్య సరిహద్దులు దాటిపోయే ప్రయత్నం చేద్దాం," అన్నాడు ఖడ్గవర్మ.

"ఇది న్యాయంగా వుంటుందా? చచ్చిన వాణ్ణీ, చావు బతుకుల మధ్య వున్నవాణ్ణీ నట్టడవిలో వదిలి...."

జీవదత్తుడు మాట ముగించేలోపలే, వెనక నుంచి నల్లని ఆకారం ఒకటి వాళ్ళను సమీపించి చిన్నగొంతుతో, "ఎవరు? మీరా! ఏదో ఎడ్ల గంటల చప్పుడు వినిపించి గుడిసె లోంచి బయటికి వచ్చాను," అన్నది.

ఖడ్గజీవదత్తులు ఆ మాట్లాడిన ఆకారం కేసి చూశారు. అది పశువుల కాపరి వృద్ధుడు.

"తాతా! ఇప్పుడు మేం చాలా కష్టంలో వున్నాం. ఆ ఎడ్లబండిని నగరాన్నుంచి యిక్కడికి తోలుకువచ్చినవాళ్ళం మేమే. దాంట్లో ఒక శవం, ఒక కాలు తెగినవాడూ వున్నారు. వాళ్ళ ఈ దుర్దశకు వాళ్ళే కారకులు, మేము నిర్దోషులం. వాళ్ళను తెల్లవారేవరకూ కాపాడే బాధ్యత నీకు ఒప్ప చెప్పి, మా దారిన మేం పోదాం అని యిక్కడికి వచ్చాం," అన్నాడు జీవదత్తుడు.

"కాపాడటం అంటే.... క్రూరమృగాల నుంచి వాళ్ళ కెలాంటి హానీ జరక్కుండానా—" అంటూ పశులకాపరి చప్పున ఎడ్ల బండి వున్న దిక్కు కేసి తల తిప్పాడు. అందుక్కారణం, ఆ వైపు నుంచి ఎలుగు బంటు గుర్ర్ అంటూ అరవటం, పెద్దపులి చిన్నగా గాండ్రించటం అతడికి వినబడింది.

ఖడ్గజీవదత్తులు కూడా అటు కేసి చూశారు. బండికి వెనకవైపు నుంచి వచ్చిన ఎలుగుబంటూ, ముందువైపు నుంచి వచ్చిన పులీ, యీసారి మరింత భయంకరంగా అరిచినై. అవి రెండూ కలియబడే ప్రయత్నంలో వున్నవి. కాని, వాటి అరుపులకు బెదిరిపోయిన బండి ఎడ్లు, బండితోపాటు అరణ్యానికి అడ్డంపడి పరిగెత్తసాగినై.

ఇదంతా కన్నుమూసి తెరిచేంతలో జరిగిపోయింది. ఖడ్గజీవదత్తులకు యిప్పుడు ఎడ్ల మెడల్లోని గంటలచప్పుడూ, ఎలుగుబంటూ, పులీ కలియబడి భయంకరంగా అరుస్తూ పోరాడుతూండటం మాత్రం కనబడింది.

"మన సమస్యకు దేవుడే పరిష్కార మార్గం చెప్పాడు, జీవా!" అన్నాడు ఖడ్గవర్మ ఉత్సాహంగా.

"అలాగే కనబడుతున్నది. కాని, పాపం, ఆ కాలు తెగిన రాజకుమారుడు...."

జీవదత్తుడి మాటలు అడ్డొస్తూ పశుల కాపరి వృద్ధుడు, "రాజకుమారుడా! ఏ దేశపు రాజకుమారుడు? అసలేం జరిగింది? ముందు యీ పులి, ఎలుగుల్ని యిక్కణ్ణించి తరమటం మంచిది," అన్నాడు.





ఖడ్గవర్మ చెట్టు కింద వెతికి లావుపాటి ఒక ఎండుపుల్ల తీసుకుని, పెద్దగా కేక పెడుతూ దాన్ని గురి చూసి పోట్లాడు కుంటున్న పులి, ఎలుగుబంట్ల మీదికి విసిరాడు. ఆ ఎండుపుల్ల వచ్చి బలంగా తగల గానే పులి, ఎలుగులు చెరొక దిక్కుగా పారిపోయాయి.

జీవదత్తుడు, వృద్ధుడికి ఆ రాత్రి నగరంలోని రాజుగారి అతిథి గృహంలో జరిగిన సంఘటనలన్నీ టూకీగా చెప్పాడు. అంతా విన్న వృద్ధుడు ఓ క్షణం ఆలోచిస్తూ ఊరుకుని, తరవాత ఖడ్గజీవదత్తులతో, "మీరు తక్షణం యీ రాజ్యం సరిహద్దులు దాటి పోవటం మంచిది. మా మహారాజు కంటె మహేంద్రనగర రాజు బలవంతుడు. ఆయనకు జరిగిన సంగతి తెలిస్తే, మా రాజు ద్వారా మిమ్మల్ని పట్టుకునేందుకు తప్పక ప్రయత్నం చేస్తాడు," అన్నాడు.

ఖడ్గజీవదత్తులను మొదటి నుంచి యిలాంటి అనుమానమే పట్టి పీడుస్తున్నది. వాళ్ళు వృద్ధుడికి నమస్కరించి, మళ్ళీ ఏదో ఒకనాడు అతన్ని చూచేందుకు రాగలమని చెప్పి, ఆ చీకట్లోనే త్వరత్వరగా అడవి మార్గాన బయలుదేరారు. తెల్లవారే లోపుగా పద్మపురనగరాన్నుంచి ఎంత దూరంగా పోగలిగితే అంత క్షేమమని వాళ్ళు నిశ్చయించుకున్నారు.

కాని, పారిపోయిన మహేంద్రనగర సేనాని పెద్దకొడుకు రాత్రి మూడవ జాముకే తన నగరం చేరి, ముందుగా తన తండ్రికి జరిగినదంతా తెలియపరిచాడు. రాజకుమారుడూ, మంత్రికుమారుడూ పరాయి రాజధానిలో చిక్కుల్లో తగుల్కొన్నారని తెలియగానే సేనాని అప్పటికప్పుడే పోయి జరిగినదంతా రాజుకూ, మంత్రికీ చెప్పాడు.

రాజూ, మంత్రీ సేనానికొడుకును కూడా పిలిపించి జరిగిందేమిటో వివరంగా చెప్పమన్నారు. అతను మంత్రికొడుకు దండం దెబ్బతిని కిందపడిపోవటం చూశానని, తరవాత రాజకొడుకు ప్రహరీగోడ దూకిన సూచనా, గాయపడినట్టుగా అరవటం విన్నా

నని: ఆ సమయంలో తనను కావలా కాస్తున్నవాడు బయటికి పోవటంతో, తాను మరొక వైపున ప్రహరీగోడ దూకి పారిపోయి వచ్చాననీ చెప్పాడు.

సేనానికొడుకు యిన్ని వివరాలూ రాజుతో చెప్పాడుగాని, తాము మునుగులు వేసుకున్న సంగతి, అసలు తాము ముగ్గురూ పద్మపురం ఎందుకు వెళ్ళింది మాత్రం చెప్పలేదు. ఎవరో క్షత్రియయువకులు యిద్దరు తమను ఆహ్వానిస్తే, అతిథి గృహానికి పోయామని బొంకారు.

మహేంద్రనగర రాజుకూ, ఆయన మంత్రికీ యీ వార్త చాలా ఆదుర్దా కలిగించింది. ఇప్పుడు తమ పుత్రులు ఎలాంటి చిక్కుల్లో వున్నారో, అసలు బతికే వున్నారో లేదో అన్న భయం కూడా వాళ్ళను పట్టుకున్నది. రాజూ, మంత్రీ సంప్రతించుకుని ఒక దూతను అప్పటికప్పుడే పద్మపురానికి ప్రయాణం కట్టించారు. పద్మసేన మహారాజుకు యివ్వవలసిందిగా అతడికి ఒక లేఖ యిచ్చారు.

ఆ రాజదూత గుర్రం మీద బయలుదేరి సూర్యోదయం అయిన కొద్దిసేపటికి పద్మపురం చేరి, తమ రాజు యిచ్చిన లేఖను పద్మసేన మహారాజుకు అందించాడు. ఆ లేఖలో మహేంద్రనగర రాజు తన కుమారుణ్ణీ, మంత్రి కుమారుణ్ణీ వెంటనే తమ



నగరానికి పంపవలసిందిగా రాస్తూ, వాళ్ళకు హాని తలపెట్టిన ఇద్దరు క్షత్రియయువకుల్ని కూడా తగిన విధంగా శిక్షించేందుకు తమరు ఒప్పచెప్పవలసిందిగా కోరాడు.

పద్మసేనుడు ఆ లేఖ చదివి, సేనాని కొడుకు ప్రాణాలతో బయటపడ్డాడని, కాని అతడికి మంత్రికొడుకు మరణం, రాజు కొడుకు కాలు తెగిపోవటం తెలియదని గ్రహించాడు. ఆయన వెంటనే తన మంత్రి కోసం కబురుచేసి, మహేంద్రనగర దూతను అతిథిగృహానికి పంపాడు.

మంత్రి సోమదేవుడు రాజు దగ్గిరకు వచ్చాడు. లేఖలోని విషయమంతా ఒకటికి రెండుసార్లు చదివాడు. తరవాత దీర్ఘంగా



ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చి రాజుతో యిలా అన్నాడు: "మహారాజా! మహేంద్ర వర్మ రాజుకు యిక్కడ జరిగిపోయిన సంఘటనల పూర్తి వివరాలు తెలియవన్నది, యీ లేఖ ద్వారా మనకు అర్థమవుతున్నది. మనం ఒక పని చేద్దాం. ఆ క్షత్రియ యువకు లిద్దరూ తెల్లవారేసరికి అతిథి గృహంలో నుంచి ఎటో వెళ్ళిపోయారని, రాత్రి ఆ గృహంలో జరిగిన ఘటన లేవీ మనకు తెలియవని—అయినా ఆ క్షత్రియ యువకుల్ని పట్టుకునేందుకూ, రాజకుమారుడూ, మంత్రికుమారుడూ ఎక్కడ వున్నది తెలుసుకునేందుకూ ప్రయత్నిస్తామని ప్రత్యుత్తరం రాద్దాం."

"బాగానే వుంది. కాని, నిర్దోషులైన ఆ ఖడ్గ, జీవదత్తుల్ని వెతికిపట్టుకుని ఆ మహేంద్రవర్మకు అప్పచెప్పటం ఎలా? అది వాళ్ళకు మరణ శిక్ష విధించటంతో సమానం అవుతుందిగదా?" అన్నాడు రాజు.

"అలాంటి ప్రమాదం రాకుండా ఒక ఉపాయం వుంది. ఆ ఖడ్గ జీవదత్తుల పేర్లు గాని, రూపురేఖలుగాని బాగా ఎరిగినవాళ్ళు బహు కొద్దిమంది మాత్రమే. వాళ్ళంతా మన పౌరులూ, రాజప్రాసాద ఉద్యోగులూ. కనక, మనం ఆ యువకుల పేర్లు మార్చి, ఆకార విశేషాల్లో ఏదో ఒక లోపం వున్నట్టు చెప్పి, ఆ మహేంద్రవర్మను తప్పు దారిన పెడదాం. మంత్రికొడుకు శవం, ఒంటరిగాని రాజకుమారుడూ యిప్పు డే స్థితిలో ఎక్కడున్నారో మనకే తెలియదు గదా!" అన్నాడు మంత్రి సోమదేవుడు.

"అదంతా జాగ్రత్తగా ఆలోచించి, లేఖ రాసి, ఆ వచ్చిన రాజదూత ద్వారా మహేంద్ర వర్మకు పంపండి. ఏది ఏమైనా ఆ ఖడ్గ, జీవదత్తులు మాత్రం చిక్కుల్లో పడరాదు. వాళ్ళు నిజంగానే మహావీరులు! పద్మావతి అడిగినట్టు వాళ్ళలో ఏ ఒకరో తప్పక వింధ్యపర్వతాల్లోని రాతిరథాన్ని కదిలించ వచ్చు—అలా జరిగితే రాజ్యభారం అల్లుడి మీద వేసి, విశ్రాంతి తీసుకుంటాను." అన్నాడు పద్మసేన రాజు.

మంత్రి సోమదేవుడు లేఖ రాసి, దానిని రాజుకు చూపించి, ముద్రవేసి, మహేంద్ర వర్మ దూతకు యిచ్చాడు. ఆ దూత వెంటనే బయలుదేరి సాయంకాలానికల్లా నగరం చేరి, తమ రాజుకు దాన్ని అందించాడు.

మహేంద్రవర్మా, ఆయన మంత్రీ లేఖ లోని విషయం చదివి తికమకపడ్డారు. తమ పుత్రులూ, ఆ క్షత్రియయువకులూ అయిపూ అజా లేకుండా పోవటం వాళ్ళను ఆశ్చర్యపరిచింది. కాని, లేఖలో ఆ క్షత్రియ యువకుల పేర్లూ, వాళ్ళను గుర్తించి పట్టుకునేందుకు అవసరం అయిన రూపురేఖా వివరాలూ చూసి, వాళ్ళు తృప్తిపడ్డారు.

మంత్రి సోమదేవుడు, ఖడ్గజీవదత్తుల పేర్ల బదులు వీరభద్రుడూ, రామభద్రుడూ అనీ, వాళ్ళల్లో వీరభద్రుడికి కుడి కన్ను మెల్ల అనీ, రామభద్రుడి ఎడమ చేతికి ఆరు వేళ్ళు వుంటాయనీ లేఖలో రాశాడు. అంతే కాక వాళ్ళను పట్టుకునేందుకు రాజభటులు దేశమంతా గాలించబోతున్నారనీ, గ్రామ గ్రామానా వాళ్ళ ఆ చూకీ తెలుసుకునేందుకు చాటింపు కూడా వేయిస్తున్నాననీ మహేంద్రవర్మకు తెలియపరిచాడు.

"మహామంత్రీ! ఇక ఆ దుష్ట క్షత్రియ యువకు లిద్దరూ మనకు దొరికినట్టే. పోతే మన పిల్లల సంగతే తెలియటం లేదు. వాళ్ళు రహస్యంగా మారువేషాలు వేసుకుని మన



నగరానికి బయలుదేరి వుంటారని మీ అభిప్రాయమా?" అని అడిగాడు మహేంద్రవర్మ.

మంత్రి వామపాలుడు కొంచెం సేపు మౌనంగా వూరుకుని, "మన పిల్లలలో యింకా అకతాయితనం పోలేదు, మహారాజా! వాళ్ళిద్దరూ ఆ క్షత్రియ యువకులతో కలిసి, దేశాటనకు పోయినా పోయివుండవచ్చు. అసలు వీళ్ళ మధ్య విరోధానికి కారణం ఏమిటో సేనాని కొడుకు మాటల వల్ల నాకేం అర్థం కాలేదు. అతడు మన వాళ్ళకన్న కూడా దుందుడుకు స్వభావం కలవాడు," అన్నాడు.

"నిజం నిలకడమీద తెలుస్తుంది, అన్నారు పెద్దలు. మన రాజ్యంలో కూడా

ఆ వీరభద్ర రామభద్రుల్ని పట్టుకునేందుకు చాటింపు వేయించటం బాగావుంటుంది.'' అన్నాడు మహేంద్రవర్మ.

ఆ నాటి సాయంత్రంవేళ పద్మపుర, మహేంద్రనగర రాజ్యాల్లోని పల్లె పట్టణాల్లో వీరభద్ర, రామభద్రుల పోలికల్ని చెప్పి, వాళ్ళను పట్టుకున్నవాళ్ళకు గొప్ప బహుమానం వుంటుందని రాజభటులు చాటింపు వేయసాగారు.


పద్మపురానికి చాలా దూరంగా వున్న ఒక పల్లెలోని పూటకూళ్ళ యింట వున్న ఖడ్గ, జీవదత్తులు, యీ చాటింపు విని దీని వెనక ఏదో రహస్యం వున్నదని, ఇది బహుశా తమను జాగ్రత్తపడవలసిందిగా పద్మసేన రాజు చేస్తున్న హెచ్చరిక కావచ్చునని అనుమానించారు.

ఖడ్గవర్మకు తక్షణం ఆ పల్లె వదిలి పోవటం క్షేమం అన్న అభిప్రాయం కలిగింది. కాని జీవదత్తుడు అలా చేయటం అనుమాన కారణం అవుతుందని, సూర్యాస్తమయం తర్వాత బయలుదేరి, ఆ రాత్రి అరణ్యంలో గడిపి, మర్నాటి పగటివేళ ఏదో విధంగా పద్మపుర రాజ్య సరిహద్దులు దాటే ప్రయత్నం చేద్దామని అన్నాడు.

ఇద్దరూ యిలా మాట్లాడుకుంటున్నంతలో తలారు లిద్దరు పూటకూళ్ళ ఇంటికి వచ్చి, ఇంటి యజమానిని, ఆ ఉదయం వచ్చిన యువకులిద్దరూ ఎక్కడ వున్నారని ప్రశ్నించారు. చాటింపు విని వున్న పూటకూళ్ళ ఇంటి వాడు భయపడిపోతూ, ''లోపలే వున్నారు! పిలుచుకు వస్తానుండండి.'' అంటూ ఖడ్గ జీవదత్తుల దగ్గరకు వచ్చాడు.

తలార్లు అడిగిన ప్రశ్న విన్న ఖడ్గజీవదత్తులు ఇంట్లో నుంచి బయిటికి వచ్చారు. తలారు లిద్దరూ వాళ్ళను నఖశిఖ పర్యంతం ఒకసారి పరీక్షగా చూసి, ''బయలుదేరండి, గ్రామాధికారి మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నాడు.'' అన్నారు.

''అలాగా! వస్తున్నాం, దారితీయండి!'' అన్నాడు జీవదత్తుడు. ముందు తలార్లూ, వెనకగా ఖడ్గజీవదత్తులూ గ్రామకచ్చేరి కేసి నడవసాగారు. —(ఇంకా వుంది)





## 5

[ ఖడ్గ జీవదత్తులు, వకుళకావరి వృక్షుల్లో కలుసుకున్నారు. ఆ సమయంలో పెద్దపులిని చూసి బెదిరిన ఎడ్లు, బండితో అరణ్యానికి అడ్డంపడి పారిపోయినై. ఖడ్గ జీవదత్తులు సూర్యోదయం వరకూ నడిచి ఒక గ్రామం చేరారు. అక్కడ వాళ్ళ కోసం గ్రామాధికారి తలార్లను పంపాడు. ఇద్దరూ గ్రామకచ్చేరీ కేసి బయలుదేరారు. తరవాత—]


ఖడ్గ జీవదత్తులు గ్రామకచ్చేరిని చేరేసరికి అక్కడ ఒక చిన్నగుంపు తయారై వున్నది. వీళ్ళను చూస్తూనే, గుంపులో గుసగుసలు ప్రారంభమయినై. తలార్లు వాళ్ళను గ్రామాధికారి ముందుకు తీసుకుపోయారు. గ్రామాధికారి వాళ్ళ కేసి గుచ్చిగుచ్చి చూస్తూ, హూఁ, హేఁ అని, ఒకసారి పెద్దగా దగ్గి, గొంతు సవరించుకుని, "మీలో ఎవరు వీరభద్రుడు? ఎవరు రామభద్రుడు?" అన్నాడు.

"ఆ పేర్లు గలవాళ్ళు మాలో ఎవరూ లేరు," అన్నాడు జీవదత్తుడు.

"అలాగా! అయితే మీ పేర్లేమిటి?" అన్నాడు గ్రామాధికారి.

జీవదత్తుడు ఆ ప్రశ్నకు జవాబు చెప్పబోయేంతలో, ఖడ్గవర్మ, "నా పేరు ఖడ్గవర్మ, యితని పేరు జీవదత్తుడు," అన్నాడు.

"పేర్లు మార్చుకోవటం ఏమంత కష్టం! ఏవీ మీ హస్తాలు? ఎడమ చేతులు



దాచండి!" అన్నాడు గ్రామాధికారి కోపంగా వాళ్ళ కేసిచూస్తూ.

ఖడ్గ, జీవదత్తులు చేతులు చాచారు. గ్రామాధికారి లేచి ముందుకు వచ్చి ఇద్దరి చేతుల్నీ పరీక్షగా చూసి, "అయిదే వేళ్ళు న్నాయి! ఏవీ కుడిచేతులు," అన్నాడు.

ఖడ్గ జీవదత్తులు కుడిచేతులు చాచారు. గ్రామాధికారి వాటి వేళ్ళను లెక్కపెట్టి అసంతృప్తిగా తలాడించి, ఇద్దరి ముఖా ల్లోకీ ఓ క్షణకాలం చూసి, "కన్నార్పకుండా ఇద్దరూ నా కేసి చూడండి!" అన్నాడు.

ఖడ్గ జీవదత్తులకు లోపల వణికిపోతున్నా, బయటపడకుండా గ్రామాధికారి ముఖం కేసి దృష్టి సారించారు. "ఏమీ మెల్ల వున్నట్టులేదే!" అన్నాడు గ్రామాధికారి పక్కన లెక్కలు చూస్తున్న గణకుడితో.

ఆ గణకుడు ఖడ్గ జీవదత్తుల కేసి పరీక్షగా చూసి తలాడిస్తూ, "రాజుగారి చాటింపూ, మెల్లకన్నూ, ఆరు వేళ్ళ మాటా అట్లా వుంచుదాం. కనబడకుండాపోయిన మీ కుమార్తె మాటేమిటి? కొలను దగ్గి ర్నుంచి ఆమెను ఏ గంధర్వులో, యక్షులో అపహరించుకుపోయారని అనుకుంటు న్నారా?" అన్నాడు.

గణకుడు యిలా అనగానే గ్రామాధి కారికి కూతురు సంగతి గుర్తుకొచ్చి, మన స్సుకు బాధ కలిగింది. అతడి ఒక్కగా నొక్క కుమార్తెను వారం రోజుల క్రిందట గ్రామానికి సమీపంగా వున్న కొలను దగ్గి ర్నుంచి ఎవరో అపహరించుకుపోయారు. ఎంత ప్రయత్నించినా యింతవరకూ ఆమె జాడ తెలియలేదు.

గణకుడు అన్న మాటల్లో సూచన ప్రాయంగా వున్న భావం గ్రహించిన గ్రామాధికారి ఖడ్గ జీవదత్తుల కేసి గుర్రుగు ముతూ, "మీరీ గ్రామం ఏం పనిమీద వచ్చారు?" అని ప్రశ్నించాడు.

"దేశాటన చేస్తూవస్తున్న మాకు, దారిలో యీ గ్రామం తగిలింది. ఇవ్వాళ యిక్కడ వుండిపోదాం అనుకున్నాం. అంతకన్న మరేం లేదు," అన్నాడు జీవదత్తుడు.

ఆ జవాబు వింటూనే గణకుడు వాళ్ళ ముందుకు వచ్చి, "ఈ గ్రామం చుట్టూ వున్న అడవుల్లో దొంగలూ, తోడుబోతులూ విచ్చలవిడిగా తిరుగుతున్నారు. అడిగితే దేశాటన అని సాకు చెపుతారు!" అని గ్రామాధికారితో, "ఎందుకైనా మంచిది. వీళ్ళిద్దర్నీ ఒకటి రెండు రోజులపాటు గ్రామం వదలకుండా చూడండి. ఈలోపల రాజుగారు చాటింపు వేయించిన వాళ్ళ సంగతీ, అమ్మాయిని అపహరించుకు పోయిన దుర్మార్గుల విషయం కూడా తెలిసి పోవచ్చు." అన్నాడు.

ఈ మాటలన్నీ ఖడ్గ జీవదత్తులకు పట్టి అసందర్భపు వాగుడులా తోచింది. అమ్మాయి అపహరణ ఏమిటో వాళ్ళకు అర్థమేకాలేదు. ఖడ్గవర్మ కోపంగా గ్రామాధికారి కేసీ, గణకుడి కేసీ ఓమారు చూసి, తన కత్తి పిడి మీద చేయివేస్తూ జీవదత్తుడికి సౌంజ్ఞ చేశాడు. దాని భావం, యీ వదరుబోతుల్ని కత్తికి బలిచేసి గ్రామం నుంచి పారిపోదామని. కాని, జీవదత్తుడు చేయెత్తి అతడికి తొందరపడవద్దని సూచించాడు.

గ్రామాధికారి తలార్లను పిలిచి, వాళ్ళతో, "ఈ ఇద్దర్నీ పెద్ద నేరేడుచెట్టు దగ్గిరున్న పాకలో పెట్టి ఒకళ్ళు కాపలా వుండండి. భోజనం సంగతి పూటకూళ్ళవాడు చూస్తాడు. ఇప్పుడు తొందర పనులున్నాయి.



రేపు ఉదయం మళ్ళీ కచ్చేరికి తీసుకు రండి." అని చెప్పాడు.

తలార్లు ఖడ్గ జీవదత్తుల్ని వెంటబెట్టుకు పోయి గ్రామం చుట్టూ వున్న ఎత్తయిన కొయ్యకంచెకు సమీపంలో వున్న ఒక ఖాళీ పాక వాళ్ళకు చూపించి, అందులో వుండమన్నారు. ఆ పాక నేరస్థుల్ని నిర్బంధించేందుకు ఉపయోగించేది. ఆ పాకకు పక్కనే ఒక నేరేడుచెట్టూ, గ్రామం నుంచి బయటికి పోయేందుకు కంచెలో ఒకచోట వాసాలతో కట్టిన ద్వారమూ వున్నాయి.

గ్రామాధికారీ, గణకుడూ అమాయకత్వంవల్లా, మౌఢ్యంవల్లా తమకు అనవసరమైన చిక్కులు కల్పించి, చివరకు



తామెవరైనదీ బయటపడేలా చేస్తారేమో అన్న అనుమానం జీవదత్తుడికి కలిగింది. ఎవరో యిద్దరు యువకులు ఫలానా గ్రామంలో నిర్బంధంలో వున్నారనే పుకారు రాజధాని వరకూ పోయి, తమ అసలు గుట్టు బయటపడవచ్చు....

"ఖడ్గా, నువ్వు తొందర పడి ఏమీ చెయ్యకు. మనం యీ రాత్రి యిక్కణ్ణుంచి వెళ్ళిపోదాం, కాపలావాడి కనుగప్పి. కంచె మీది నుంచో, ద్వారం నుంచో అరణ్యంలోకి పారిపోవటం ఏమంత కష్టం కాదు," అన్నాడు జీవదత్తుడు.

"అమ్మాయి అపహరణ అంటా రేమిటి, ఆ కోతివెధవ!" అన్నాడు ఖడ్గవర్మ.

"అదే నా కర్థం కావటం లేదు!" అన్నాడు జీవదత్తుడు.

ఆ మధ్యాహ్నం పూటకూళ్ళ ఇంటివాడు వాళ్ళకు భోజనం తెచ్చి, వాళ్ళు ప్రశ్నించిన మీదట గ్రామాధికారి పెళ్ళీడు కూతుర్ని ఎవరో దొంగలు కొలను దగ్గరకు నీటికై పోగా అపహరించుకు పోయారని చెప్పాడు.

"అదీ సంగతి! దానితో ఆ ముసలాళ్ళిద్దరికీ మతులుపోయినై. తెలిసిందా, ఖడ్గా!" అన్నాడు జీవదత్తుడు.

ఖడ్గవర్మ తల వూపి వూరుకున్నాడు. అతడికి ఆ పాకలో కూర్చోవటం ముళ్ళమీద కూర్చున్నట్టుగా వుంది. పద్మపురంలో అంత పెద్ద ప్రమాదం నుంచి బయటపడి, యిక్కడ ఒక చవట గ్రామాధికారి చేత చిక్కటం తల కొట్టివేసినట్టుగా వున్నది.


ఆ పగలు ఎలాగో గడిచింది. తలార్లలో ఒకడు పాక ముందున్న నేరేడుచెట్టుకు ఆనుకుని కూర్చుని పగలంతా కునికిపాట్లు పడుతూనే వున్నాడు. వాడి పక్కన తళతళ మెరుస్తూ ఒక ఈటె!

"ఇది కుంతల గ్రామంలా వున్నది. ఈ నిద్రముఖం వెధవా మనకు కాపలా? ఛీ, ఛీ, బయలుదేరు, పోదాం!" అన్నాడు ఖడ్గవర్మ వినుగ్గా.

"ఖడ్గా, తొందర పడకు! నలుగురికీ తెలిసేట్టు పారిపోవటం ప్రమాదం. వాళ్ళు

మనమేదో నిజంగా దోషులం అనుకుంటారు. రాత్రికయితే, తెల్లవారి వాళ్ళకు తెలిసేలోపల మనం అరణ్యంలో కొన్ని ఆమడల దూరం పోవచ్చు." అన్నాడు జీవదత్తుడు.

సాయం సమయమై....సూర్యుడు అస్త మించాడు. క్రమంగా గ్రామాన్నీ, చుట్టూ వున్న అరణ్యాన్నీ చీకట్లు ఆక్రమించ సాగినై. పగలల్లా అరణ్య ప్రాంతాన గల పొలాల్లో పనిపాటులు చేసుకుంటూ కాలం గడిపిన గ్రామస్తులు, పశువులతో, వ్యవసాయ పరికరాలతో తిరిగి గ్రామం చేరుతున్నారు. వాళ్ళకోసం తలారి కంచె ద్వారాన్ని తెరిచాడు.



కొంచెం పొద్దు పోయింతర్వాత పూట కూళ్ళవాడు ఖడ్గ, జీవదత్తులకు భోజనం తెచ్చాడు. మాటల సందర్భంలో వాడు గ్రామంలో బయలుదేరిన పుకార్లను గురించి ఖడ్గ, జీవదత్తులకు చెప్పాడు. ఆ మధ్య ఒకళ్ళిద్దరు గ్రామస్తులు అరణ్యంలో కొందరు భైరవుడి భక్తుల్ని చూశారట. వాళ్ళల్లో వాళ్ళే ఇద్దరు వేషం మార్చుకుని గ్రామంలో భైరవుడికి బలి యిచ్చేందుకు పనికి వచ్చే కన్యల ఆచూకీ తీసేందుకు వచ్చారని వాళ్లు అనుకుంటున్నారట!

ఈ పుకార్ల సంగతి వింటూనే ఖడ్గవర్మ అసహ్యించుకుంటూ, "మేం భైరవుడి భక్తులమా? ఆ పుకారేదో నిజం చేస్తాం! ఇక్కణ్ణించి వెళ్ళే లోపల గ్రామాధికారినీ, అతడి సహద్యోగినీ తప్పక భైరవుడికి బలి యిస్తాం." అన్నాడు.

"బాబూ, ఆ ముసలాళ్ళను చంపటం ఎందుగ్గాని. మీరిద్దరూ సాధ్యమైనంత త్వరగా యిక్కణ్ణించి వెళ్ళిపొండి. ముఖ్యంగా ఆ గణకు డున్నాడే—వాడు బహు దుష్టుడు. రాజుగారి మెప్పు పొందేందుకు ఎలాంటి నీచకార్యం అయినా చేయగల సమర్థుడు." అన్నాడు పూటకూళ్ళవాడు.

వాడి మంచి తనానికి సంతోషించి జీవ దత్తుడు వాడికి ఒక వెండినాణెం యిస్తూ, "ఇక వెళ్ళిరా. నువ్వు మాత్రం ఆ పుకార్లేవీ నమ్మకు," అన్నాడు.



పూటకూళ్ళవాడు వెళ్ళిపోయాడు. తలార్లలో రెండవవాడు రాత్రి కాపలాకు వచ్చాడు. వాడు కంచె ద్వారాన్ని మూసి లోపలి వైపున బలమైన తాళ్ళతో బంధించాడు. తరవాత పాకలోకి ఓసారి తొంగి చూసి. నేరేడుచెట్టు దగ్గరకుపోయి, దాని మొదట్లో చాప పరుచుకుని కూర్చున్నాడు.

పొద్దు గడిచి నడిరేయి సమీపించింది. గ్రామం చుట్టూ రక్షణగా వున్న పెద్ద కంచె అవతల అరణ్యమృగాలు విచ్చలవిడిగా తిరుగుతూ రకరకాల ధ్వనులు చేస్తున్నవి. ముఖ్యంగా ఏనుగొకటి కంచె ద్వార ప్రాంతాల తిరుగుతూ మధ్య మధ్య ఘీంకారం చేస్తున్నది. అది ఘీంకరించి నవ్వేతల్లా తలారి అదిరిపడుతూ. కంచెద్వారం దగ్గిరకు పోయి. లోపలి వైపున బిగించిన కట్టుతాళ్ళు సరిగా వున్నవో లేవో పరీక్షించి చూసుకుంటున్నాడు.

ఖడ్గ జీవదత్తులకు గ్రామాధికారి నిర్బంధం నుంచి బయటపడటానికి అది మంచి అదనుగా తోచింది. వాళ్ళిద్దరూ పాకనుంచి బయిటికి వచ్చి సరాసరి చెట్టు కింద కూర్చుని వున్న తలారి దగ్గిరకు పోయారు. తలారి వాళ్ళకేసి చూసి చిరునవ్వు నవ్వాడు. ఈ ఇద్దరి నుంచి తనకేమైనా ప్రమాదం వస్తుందేమో అన్న భయం వాడిలో ఏ మాత్రం వున్నట్టు లేదు.

ఖడ్గవర్మ కత్తి దూశాడు. అది చూసి తలారి ఏమో అనబోయేంతలో జీవదత్తుడు చిన్న గొంతుతో. "నే నడిగేదానికి పెద్దగా అరవకుండా మెల్లిగా జవాబులు చెప్పు. నీకేం ప్రాణభయం వుండదు. అరిచి గోల చేశావో చావు తప్పదు." అన్నాడు.

తలారికి ఆ మాటల్తో ప్రాణభయం కలిగింది. అతడు వణికిపోతూ సంగిగా, "నన్ను చంపకండి! మిమ్మల్ని చిక్కుల్లో పెట్టిన వాడు గ్రామాధికారి. నేను ఆయన నౌకర్ని. చెయ్యమన్న పనల్లా చేయాలి." అన్నాడు.

"ఆ సంగతి మాకు తెలుసు. మాకు ఆశ్చర్యంగా వున్న సంగతేమంటే— మా ఇద్దర్నీ పారిపోకుండా కాపలా

కాసేందుకు నిన్ను ఒక్కణ్ణి పెట్టారెందుకా అని." అన్నాడు జీవదత్తుడు.

"అదా అనుమానం! ప్రాణాలమీద ఆశ వున్న వాళ్ళెవరూ, రాత్రివేళ గ్రామకంచె దాటి పోరు. గ్రామం చుట్టూ వున్న అరణ్యంలో క్రూరమృగాలు తెల్లారేవరకూ కారాడుతూంటవి!" అన్నాడు తలారి.

"అలాగా! మాకు ప్రాణాలమీద ఆశే కాదు. సాధ్యమైతే నూరేళ్ళు బతకాలని కూడా వున్నది. మేం యీ నిర్బంధం నుంచి పారిపోదలిచాం. కంచె ద్వారాన్ని తెరు. కంచె మీదగా ఎక్కి పోవచ్చుగాని, గ్రామంలో ఎవరి కంటనైనా పడే ప్రమాదం వున్నది." అన్నాడు జీవదత్తుడు.

"కంచె అవతల సింహాలూ, పులులూ, తోడేళ్ళూ తిరుగుతూంటయి, బాబూ! ఒక ఏనుక్కూడా ఎలా ఘీంకరిస్తూ కంచె పక్కన కారట్లాడుతున్నదో వినబడటం లేదా?" అన్నాడు తలారి.

"వాటి సంగతి మేం చూసుకుంటాం. అట్టే వాగకుండా ముందు నువ్వు కంచె ద్వారం తెరువు!" అన్నాడు ఖడ్గవర్మ చాలా కోపంగా.

"అలాగే తెరుస్తాను. రాత్రివేళ అరణ్యంలోకి పోవటం ఎంత ప్రమాదమో చెప్పినా మీకు నమ్మకం కలగటం లేదు." అంటూ తలారి కంచె ద్వారం కేసి బయలుదేరాడు.



ఖడ్గవర్మా, జీవదత్తుడూ అతడి వెనకగా నడిచారు.

తలారి ద్వారం దాకా పోయి, దాన్ని కట్టివున్న తాళ్ళను విప్పబోయినవాడల్లా ఆగి, "బాబూ! ఇది నా ప్రాణం మీదికి తెస్తుంది. మీరు పారిపోయేందుకు నేను సహాయ పడ్డానని గ్రామాధికారి నన్ను కొరతవేయించుతాడు. ఒక పని చెయ్యండి. ఈ తలగుడ్డతో నా చేతులూ, కాళ్ళూకట్టి, మీ కత్తితో యీ తాళ్ళను నరికి పారిపొండి. అప్పుడు నామీద ఎవరికీ అనుమానం రాదు." అన్నాడు బతిమాలుతున్నట్టు.

తలారి మాటలు జీవదత్తుడికి నచ్చినై. అతడు చెప్పింది నిజం. నిర్దోషిని ఎందుకు

చిక్కులపాలు చేయాలి? ఖడ్గవర్మ కూడా యిందుకు సరే నన్నాడు. వెంటనే వాళ్ళిద్దరూ తలారిని చెట్టు దగ్గరకు తీసుకుపోయి, వాడి తలగుడ్డ చించి కాళ్ళూ చేతులూ కట్టి, నోటి మీదుగా ఒక గుడ్డ ముక్కను పోనిచ్చి, తల వెనక దాన్ని ముడివేయబోయారు.

అప్పటివరకూ మౌనంగా వూరుకున్న తలారి, హఠాత్తుగా ఏదో ఆలోచన వచ్చిన వాడిలా, "బాబూ, ఆగండి. నా కాళ్ళూ చేతులూ కట్టి, నన్ని చెట్టు కింద వదిలి పోయారో, మీరు తెరిచిన కంచె ద్వారం నుంచి ఏ క్రూరమృగమో లోపలికి వచ్చి నన్ను తినేస్తుంది. దయవుంచి, నన్ను, యీ చెట్టు కొమ్మల్లో పెట్టిపోండి." అన్నాడు ఏడ్పు గొంతుతో.

"ఈ అనుమానం మాకు రాలేదు సుమా! అన్యాయంగా ఏ అడవిజంతువుకో ఆహారం అయిపోయి వుండేవాడివి!" అన్నాడు జీవదత్తుడు.

ఆ తరవాత గబగబా ఖడ్గ, జీవదత్తులు తలారి కాళ్ళూ చేతులూ కట్టి, అతణ్ణి అక్కడ వున్న దాపలో చుట్టి, చెట్టు కొమ్మల్లో పెట్టారు. తలారి తన నోటికి అడ్డంగా గుడ్డ బిగుసుకునే ముందు, "బాబూ, జాగ్రత్త! ఆ ఏనుగేదో పగబట్టి నట్టు కంచె ద్వారం దాపుల్నే తిరుగు తున్నది!" అన్నాడు.

ఖడ్గవర్మ నవ్వుతూ, "కంచెనేకాక, దాని ద్వారాన్ని కూడా పసికట్టి తిరుగుతున్న దంటే, అది మామూలు ఏనుగైవుండదు— ఏనుగు రూపం దాల్చిన ఏ మాంత్రికుడో అయుండాలి! సరే, దాని సంగతేదో మేం తెలుస్తాంలే," అన్నాడు.

ఖడ్గ జీవదత్తులు నిశ్శబ్దంగా కంచెద్వారం కేసి నడిచారు. తలారి చెప్పినదాంట్లో అతిశయోక్తి ఏమీలేదని యిద్దరికీ అర్థమైంది. ఏనుగొకటి కంచె అవతల చెట్ల కింద నిలబడి ఘీంకారాలు చేస్తున్నది. బహుశా, దాని పిల్లనేదో గ్రామస్తులు అరణ్యంలో పట్టుకుని గ్రామానికి తెచ్చివుంటారని ఖడ్గ జీవదత్తులు అనుకున్నారు.

—(ఇంకా వుంది)






## 6

[గ్రామాధికారి కుమార్తెను అరణ్యంలో ఎవరో అపహరించుకుపోయారు. వాళ్ళు ఖడ్గ జీవదత్తులై వుంటారని ఆయన వాళ్ళను ఒక పాకలో నిర్బంధించాడు. రాత్రివేళ తమకు కావలా వున్న తలారిని భయపెట్టి వాళ్ళు పారిపోయేందుకు కంచెద్వారం దగ్గరకు వెళ్ళారు. కంచె అవతల అడవిఏనుగు ఒకటి ఘీంకరిస్తూ వాళ్ళ కంటబడింది. తరవాత—]

ఖడ్గవర్మ కత్తితో కంచె ద్వారాన్ని బంధించి వున్న తాళ్ళను గబగబా నరకసాగాడు. ఆ సమయంలో పాక వైపు నుంచి ఒక నల్లని ఆకారం ముందుకొచ్చి, "ఎవరక్కడ? తలారి ఓబన్నా! ఖైదీలు పారిపోతున్నారులా వుంది. నువ్వెక్కడ చచ్చావ్?" అంటూ పెద్దకేక పెట్టింది.

ఆ గొంతు గబుకుడిది! ఖడ్గ జీవదత్తులు ద్వారంతాళ్ళు తెగిపోగానే, దాన్ని పట్టుకుని బలంగా వెనక్కులాగి బయటికి పోయారు. ఇంతలో గబుకుడు పరుగెత్తుకుంటూ వస్తూ, "ఆగండి! పారిపోజూశారో, మిమ్మల్ని చిత్రవధ చేయిస్తాను!" అంటూ అరిచాడు.

బహుశా అతడి కేకలు అప్పటికే బాగా రెచ్చిపోయి వున్న ఏనుగును మరింత రెచ్చగొట్టి వుంటాయి. అది ముందుకాళ్ళతో నేలను ఓసారి గట్టిగా దువ్వి, తొండం ఎత్తి.



భయంకరంగా ఘీంకరిస్తూ, సగం తెరిచి వున్న కంచె ద్వారం కేసి దూకుడుగా వచ్చింది. ఖడ్గ జీవదత్తులు ఒక్క ఉదుటున కంచె మీదికి ఎగిరి కూర్చున్నారు. వాళ్ళను పట్టుకోవాలన్న కోపంలో వెనకా ముందులు చూసుకోకుండా, కేకలు పెడుతూ వేగంగా పరిగెత్తుకొస్తున్న గణకుడు, సరిగ్గా కంచె ద్వారం దగ్గర దానికి ఎదురయ్యాడు.

ఆ పరిస్థితుల్లో జరగబొయ్యే ఘోరం ఊహించుకుని జీవదత్తుడు తల పక్కకు తిప్పుకున్నాడు. ఖడ్గవర్మ మాత్రం పెద్దగా చప్పట్లు చరిచి, "వీడెవడో గ్రామగణకుడి రూపంలో వున్న భీముడై వుండాలి! అడవి ఏనుగుతోనే మల్లయుద్ధం చేయబోతున్నాడు!" అన్నాడు.

అంతలో గణకుడు ఒక్క దావుకేక పెట్టాడు. కంచెద్వారం దాటగానే, తనను కవ్విస్తున్నట్టు మీదికొస్తున్న గణకుణ్ణి ఏనుగు తొండంతో పట్టుకుని పైకెత్తి విసిరి వేసింది. గణకుడు కీచుమని అరుస్తూ, పోయి తలారి వున్న చెట్టుకొమ్మల మీద పడ్డాడు. అదృష్టవశాన అతడి కేమీ అపాయకరమైన దెబ్బలు తగలలేదు.

ప్రాణభయంపోయి, కాస్త ఊపిరి పీల్చుకునే వీలు చిక్కగానే గణకుడు చెట్టు కొమ్మల మీద వూగుతూ, "వీరభద్ర రామభద్రులు పారిపోతున్నారు! అడవి ఏనుగు గ్రామంలో జొరబడింది!" అంటూ కేకలు వేయసాగాడు.

పూరిపాక మీదపడి చిందరవందర చేస్తూ ఏనుగు పెట్టే ఘీంకారాలూ, చెట్టు మీది నుంచి గణకుడు వేసే కేకల్తో, ఆ చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళంతా మేల్కొని, దప్పున దివిటీలు వెలిగించుకుని, ఈటెలూ, కత్తులూ, కర్రలూ తీసుకుని ఇళ్ళల్లో నుంచి బయటికి వచ్చారు.

"పారిపోతున్న రాజద్రోహుల్ని ముందు పట్టుకోండి! తరవాత ఏనుగు సంగతి చూడొచ్చు," అంటూ మరింత పెద్దగా అరవసాగాడు గణకుడు. గ్రామస్తులు చిన్న



చిన్న ముఠాలుగా చీలి, కొందరు ఏనుగు కేసి, మరికొందరు బార్లా తెరిచి వున్న కంచె ద్వారం కేసి రాసాగారు.

అప్పటివరకూ ఈ గలభా అంతా చూస్తూ వినోదిస్తున్న ఖడ్గ జీవదత్తులకు, ఇక కంచె మీద వుండటం క్షేమం కాదనిపించింది. ఇద్దరూ కంచె మీది నుంచి అవతలివైపుకు దూకేశారు. ఆ మరుక్షణం దాపులనున్న పొదల్లో నుంచి పెద్దపులి ఒకటి గట్టిగా గాండ్రించింది.

"ఛీ ఛీ! ఏమి గ్రామం! ఏ మరణ్యం! అంతా పులులూ, ఏనుగులమయంగా వుంది!" అన్నారు ఖడ్గవర్మ విసుక్కుంటూ.


"అలా వుండటంవల్లనే మనం రాజభటులకూ, ఈ గ్రామస్తులకూ దొరక్కుండా పారిపోగలుగుతున్నాం. లేకపోతే వాళ్ళు మనను చెట్టాపట్టా తిప్పి, లేళ్ళనూ, కుందేళ్ళనూ వేటాడినట్లు వేటాడేవాళ్ళు!" అన్నాడు జీవదత్తుడు.

ఇద్దరూ ఇలా మాట్లాడుకునేంతలో పొదలదాటున వుండి గాండ్రిస్తున్న పులి చప్పున బయటికి వచ్చింది. ఇక ఏ క్షణాన్నయినా అది తమ మీదికి దూకుతుందని గ్రహించిన ఖడ్గవర్మ, చప్పున దాని వెనక్కు పోయి, "జీవా! దీన్ని చంపటమా? కంచె ద్వారం నుంచి గ్రామంలోకి తరమటమా?" అని అడిగాడు.

"అంతా నీ ఇష్టం!" అన్నాడు జీవదత్తుడు నవ్వుతూ.

అంతలో గ్రామంలో అడవి ఏనుగు చేస్తున్న బీభత్సం, గుణకుడూ, గ్రామస్తులూ పెట్టే కేకలూ వినవస్తున్నాయి. బాగా తెరిచి వున్న కంచె ద్వారం కేసి ఒక్కరూ రావటం లేదు. అందరూ ఏనుగును చుట్టుముట్టి చంపే ప్రయత్నంలో వున్నారు.

పులి పెద్దగా గాండ్రిస్తూ తన కేసి తల తిప్పబోయేంతలో ఖడ్గవర్మ దాని నడుం మీద కత్తితో చిన్నగా పొడిచాడు. ఆ పోటుకు శరీరం చురుక్కుమని, పులి అతడి మీదికి లంఘించబోయింది. అంతలో జీవదత్తుడు దాని గదవ మీద దండాన్ని ఆనించి,



బలంగా ముందుకు దూకాడు. కత్తి, దండం దెబ్బలకు పులి జడిసిపోయి, ఎదురుగా తెరిచి వున్న కంచె ద్వారం గుండా గ్రామంలోకి పరిగెత్తింది.

ఇక అప్పుడు గ్రామంలో రేగిన గల్లంతు అంతా యింతా కాదు. ఏనుగు ధాటిని తట్టుకోలేక చిందరవందరవుతున్న గ్రామస్తులు, గాండ్రిస్తూ కంచె ద్వారం దాటి లోపలికి వచ్చిన పులిని చూసి, చెల్లాచెదురుగా పారిపోసాగారు. కిందికి దిగటానికి భయపడి, ఇంకా చెట్టుకొమ్మల్లోనే వున్న గణకుడు మరింత పెద్ద గొంతుతో, "మనకు దొరికి పారిపోయిన ఆ ఇద్దరూ, మాంత్రికులు! ఏనుగుల్నీ, పులుల్నీ గ్రామం మీదికి పంపకం చేస్తున్నారు. వాళ్ళు సింహాలనూ, తోడేళ్ళనూ కూడా గ్రామంలోకి తోలక ముందే, కంచె ద్వారాన్ని మూయండి!" అంటూ అరవసాగాడు.

ఆ అరుపులు విని ఖడ్గజీవదత్తులు పొట్టలు చెక్కలయేలా నవ్వుకున్నారు. ఖడ్గవర్మ కత్తి పైకెత్తి చెట్టు మీద వున్న గణకుణ్ణి చూస్తూ, "ఆ పిరికివెధవ, అక్కడుండి అంతగా గొంతుచించుకోకపోతే, కిందికి దిగి గ్రామస్తులకు సహాయపడకూడదా? నా దగ్గిర కత్తితోపాటు, విల్లంబులు కూడా వున్నట్టయితే, ఆ ముసలి ముచ్చు తలను తాటికాయలా ఒక్క బాణం దెబ్బకు కింద పడగొట్టేవాణ్ణి!" అన్నాడు.

"విల్లంబులు సంపాయించటం ఎంత పని! అరణ్యంలో వాటి అవసరం మనకు తప్పక కలుగుతుంది. ఆ ముసలి గణకుడి తల మాట తర్వాత చూద్దాం. ముందు మనం యిక్కణ్ణించి వెళ్ళిపోవటం మంచిది!" అన్నాడు జీవదత్తుడు.

ఇద్దరూ అక్కణ్ణించి కదిలి గుడ్డి వెన్నెల కాంతిలో జాగ్రత్తగా దారి చూసుకుంటూ అరణ్యం కేసి బయలుదేరారు. దారిలో వాళ్ళకు రకరకాల క్రూరమృగాలు కనిపించినై. కాని, నిర్భయంగా ముందుకు పోతున్న వాళ్ళిద్దర్నీ అవి ఒక్కసారి తేరిపారజూసి, దారి తొలగిపోసాగినై.

సూర్యోదయానికి ఒక జాము ముందుగా వాళ్ళు చాలా దూరం నడిచి, దట్టమైన ఒక అరణ్యప్రాంతాన్ని చేరారు. ఆ ప్రదేశమంతా మహావృక్షాలతోనూ, చిన్నా పెద్ద కొండలతోనూ భయంకరంగా వున్నది.


"ఖడ్గా, మనం గ్రామం నుంచి రెండు మూడామడల దూరం వచ్చినట్టున్నది. సూర్యోదయానికి మరెంతో కాలం లేదు. ఈ పెద్ద చెట్టుకొమ్మల్లో కొంచెంసేపు పడుకుని విశ్రాంతి తీసుకుందామా?" అన్నాడు జీవదత్తుడు.

ఖడ్గవర్మ అందుకు సరే నన్నాడు. ఇద్దరూ ఒక చెట్టు పైకెక్కి దాని కొమ్మల మధ్య అనుకు కూర్చున్నారు. రాత్రంతా నిద్ర లేకపోవటం వల్లా, అరణ్యంలో చాలా దూరం నడవటం వల్లా యిద్దరూ బాగా అలసిపోయి వున్నారు. ఆ కారణంచేత వాళ్ళకు వెంటనే కునుకు పట్టింది.

కాలం గడిచింది. ఎవరో గడబిడగా మాట్లాడుకుంటున్న ధ్వని వినబడింది. హఠాత్తుగా జీవదత్తుడు కళ్ళు తెరిచాడు. ఆ వెంటనే ఖడ్గవర్మ కూడా నిద్ర మేల్కొని, జీవదత్తుడి కేసి చూశాడు. జీవదత్తుడు అతడికి మాట్లాడవద్దని సౌంజ్ఞ చేసి, మాటలధ్వని వస్తున్న వైపుకు తల తిప్పి చూశాడు.

ఖడ్గ జీవదత్తులు వున్న చెట్టుకు రాయి వేటు దూరంలో గుంపుగా వున్న చెట్ల మధ్య ఖాళీస్థలంలో కొందరు మనుషులు కీచులాడుకుంటున్నారు. వాళ్ళు వయసును బట్టి చిన్నా పెద్ద గడ్డాలతో, ముఖాన విభూతి,





కుంకుమలతో. చేతుల్లో త్రిశూలాలతో—చూడ భయంకరంగా వున్నారు. వాళ్ళందరి మెడల్లోనూ రుద్రాక్ష మాలలున్నాయి. ఒకడు మాత్రం తల మీద కూడా రుద్రాక్షలు బిగించాడు. వాడిది అందరి కన్న మరి కాస్త పొడవు గడ్డం. వాడు త్రిశూలం ఎత్తి, తన కన్న కాస్త పొట్టిగడ్డం వాణ్ణి కత్తి భయపెడుతూ అరుస్తున్నాడు. కొందరు వాళ్ళ పక్కన చేరి వేడ్క చూస్తున్నారు. దూరాన వుండటంవల్ల, ఉగ్ర జీవదత్తులకు వర్షధ్వని తప్ప. వాళ్ళ మాటలు స్పష్టంగా వినిపించటం లేదు.

ఆ కొట్లాడుకుంటున్న వాళ్ళు భైరవ భక్తులు. ఆ ముఠాకు నాయకుడైన గణలింగేశ్వరుడికి. అతడి ప్రధాన శిష్యుడైన శ్వేతభైరవుడికి కొత్తచోట స్థాపించవలసి వున్న భైరవాలయాన్ని గురించి అభిప్రాయభేదం కలిగింది.

ఈ భైరవులు అయిదారు నెలల క్రితం వరకూ వింధ్యపర్వత ప్రాంతాల్లో వున్న ఒక పురాతన భైరవాలయాన్ని ఆశ్రయించుకుని వుంటూండేవాళ్ళు. ఆ ఆలయానికి ఒక ముసలి పూజారిణి — భైరవి వుండేది. ఆ మధ్య వాళ్ళు ఒక పర్వదినంనాడు భైరవుడి బలి కోసం తెచ్చిన ఒక బాలుణ్ణి బలి పెట్టటానికి ఆమె నిరాకరించింది. అదే రాత్రి, ఆ ప్రాంతాన పెద్ద తుపాను ప్రారంభమై, భైరవాలయం మీద పిడుగొకటి పడి, ఆలయం శిథిలమైపోయింది.

ఈ వైపరీత్యానికి కారణం ముసలిభైరవి బాలుణ్ణి బలి చేయ నిరాకరించటమే అని గణలింగేశ్వరుడు తన మనుషులందరికీ చెప్పి, ఆమెను భైరవుడికి బలి చేయాలని కుట్రపన్నాడు. అది తెలిసిన శ్వేతభైరవుడు, ఆమెను రహస్యంగా ఒక కొండగుహలో దాచి, గురువుతో ఆమె ఎటో పారిపోయిందని చెప్పాడు.

గణలింగేశ్వరుడు ముసలిభైరవి కనిపించకుండా పోవటంలో ఏదో మోసంవుందని అనుమానించినా, ఆధారాలు లేనందువ ప్రధాన శిష్యుణ్ణి శిక్షించలేకపోయాడు.



కాని. ఆ తరవాత అందరూ కొత్త భైరవిగా పనికొచ్చే కన్య కోసం వెతుకుతూ, పర్వత ప్రాంతాలు వదిలి గ్రామసీమల కేసి బయలు దేరినప్పుడు—శిష్యుడి మీద ఒక కన్ను వేసి వుంచాడు.

శ్వేతభైరవుడికి నరబలులంటే అసహ్యం. కాని, ఆ పద్ధతిని మార్పించాలంటే సూటిగా భైరవభక్తులందరికీ ఆ మాట చెప్పటం చావు కోరి తెచ్చుకున్నట్టవుతుంది. ఆ కారణంగా అతను ముందు తమ ప్రధాన గురువైన గణలింగేశ్వరుణ్ణి పదవి నుంచి తొలగించేందుకు రహస్య ప్రయత్నాలు ప్రారంభించాడు.

తన ప్రధాన శిష్యుడు ముఠాలో చిన్న ముఠా మరొకదాన్ని తయారుచేస్తున్నాడని గణలింగేశ్వరుడు, తనకు మరింత విశ్వాస పాత్రులైన భైరవభక్తుల ద్వారా తెలుసుకున్నాడు. అందుకు అవసరం అయిన సాక్ష్యం పోగు చేయటమేగాక, తాము ఒక గ్రామప్రాంతంలోని కొలను దగ్గిర నుంచి అపహరించుకువచ్చిన ఒక కన్యకు, రాత్రి వేళ పారిపోయేందుకు సహాయపడ్డాడని కూడా అతడు నేరం ఆరోపించాడు.

శ్వేతభైరవుడు గురువుగారి ఆరోపణల్లో నిజం లేదన్నాడు. దానితో గణలింగేశ్వరుడు రెచ్చిపోయి అతణ్ణి త్రిశూలంతో పొడవటానికి సిద్ధపడ్డాడు. శిష్యులు కొందరు అతణ్ణి వారించి, నిజానిజాలు తెలుసుకునేందుకు తాము అపహరించుకు వచ్చిన కన్యనే ప్రశ్నిద్దామన్నారు.

గణలింగేశ్వరుడు గట్టిగా చప్పట్లు కొట్టాడు. ఆ వెంటనే త్రిశూలం ధరించిన ఒక యువభైరవుడు చెట్లచాటు నుంచి వచ్చాడు. వాడికి గణలింగేశ్వరుడు కన్యను తమ ముందుకు తీసుకురమ్మని ఆజ్ఞ యిచ్చాడు. వాడు తిరిగిపోయి పదహారూ పదిహేడేళ్ళ వయసు గల ఒక పిల్లను గురువు దగ్గిరకు తీసుకువచ్చాడు.

గణలింగేశ్వరుడు ఆమెతో, "రాత్రి నువ్వు పారిపోవాలని చూశావు గదా? అందుకు శ్వేతభైరవుడు నీకు సహాయం చేస్తానన

లేదా? అబద్ధమే ఆడకుండా నిజం చెప్పు. లేకపోతే మహాభైరవుడు నీ నెత్తి ఆయి స్తాడు." అన్నాడు.

ఆ పిల్ల తాను పారిపోయిన మాట నిజ మేనని, కాని అందుకు ప్రోత్సహించిన వాళ్ళుగాని, సహాయ పడతామన్న వాళ్ళుగాని ఎవరూ లేరని చెప్పింది. ఆ జవాబు ఒక్క గణలింగేశ్వరుణ్ణి తప్ప భైరవుల ముఠాలో చాలామందిని సంతృప్తిపరిచింది.

గణలింగేశ్వరుడు ఆ అమ్మాయిని ఆవ తలకు తీసుకుపొమ్మని యువభైరవుడితో చెప్పి, శ్వేతభైరవుడి కేసి గుర్రుమంటూ, అతడు నడుముకు జంధెంలా వేసుకున్న రుద్రాక్షల తాడును గట్టిగా పట్టుకుని. "నా తర్వాత నువ్వు యీ భైరవభక్తులకు గురువవుదామనుకున్నావా; అవకాశం ఏమీ లేదు. నువ్వు ద్రోహివి! నిన్నిప్పుడే శాస్త్రోక్తంగా భైరవుడికి బలి యివ్వగలను. కాని—నీవంటే యింకా విశ్వాసం వున్నవాళ్ళు భక్తుల్లో కొందరున్నారు గనక, ప్రస్తుతానికి నిన్ను ప్రాణాలతో వదులుతున్నాను." అన్నాడు.

శ్వేతభైరవుడు నిప్పులు చెంగే కళ్ళతో గురువు ముఖం కేసి చూస్తూ, త్రిశూలాన్ని అతడి గుండెల్లో గుచ్చేందుకు ఎత్తబోయాడు. కాని, అతడి మిత్రులొకరు, ఆ పని తగదన్న సూచనగా అతడి భుజం మీద చేయివేసి సముదాయించారు.

ఈ కీచులాటంతా చెట్టు మీద వున్న ఖడ్గ జీవదత్తులకు కనబడుతూనే వున్నది. కాని భైరవుల సంభాషణ మాత్రం వాళ్ళకు విన బడలేదు. ఒక పిల్లను చెట్లచాటు నుంచి భైరవుడొకడు గుంపు దగ్గిరకి తేవటం చూస్తూనే, ఆ పిల్ల తమను బందీలను చేసిన గ్రామాధికారి కూతురై వుంటుందని వాళ్ళు వూహించారు.

"ఖడ్గా! ఆ పిల్లను ఎలాగైనా మనం యీ నరబలిగాళ్ళ నుంచి కాపాడాలి!" అన్నాడు జీవదత్తుడు.

"తప్పకుండా! ఆ అవసరంలో వీలైతే యీ భైరవుల్లో కొందర్ని వనదేవతలకూ, పులితోడేలుమాతలకూ ప్రసాదంగా ఇద్దాం!" అన్నాడు ఖడ్గవర్మ. —(ఇంకా వుంది)





7

[ఖడ్గ జీవదత్తులు గ్రామాధికారి నిర్బంధం నుంచి బయటపడి అరణ్యంలోకి వెళ్ళారు. వాళ్ళ కొక చోట భైరవభక్తుల ముఠా తటస్థపడింది. వాళ్ళ నాయకుడు ఒక కన్యను అపహరించుకు వచ్చాడు. అతడూ, అతని ప్రధాన శిష్యుడూ త్రిశూలాలతో పొడుచుకో బోయారు. ఖడ్గ జీవదత్తులు చెట్టు మీద వుండి యిదంతా చూడసాగారు. తరవాత—]

భైరవభక్తుల్లో కొందరు నిప్పురాజేసి వంట పనుల్లో దిగారు. ఆ ఏర్పాట్లు చూస్తూనే జీవదత్తుడు, "ఖడ్గా! వీళ్ళిప్పట్లో యిక్కణ్ణించి కదిలేలాలేరు. మనం యీ దాపుల నేదైనా కొలను వుంటే అక్కడికిపోయి హాయిగా స్నానం చేసి, అడవి ఫలాలు సంపాదిద్దాం," అన్నాడు.

ఆ తరవాత వాళ్ళిద్దరూ నిశ్శబ్దంగా చెట్టు మీది నుంచి దిగి నీటి కోసం వెతుకుతూ బయలుదేరారు. కొద్ది దూరంలోనే వాళ్ళకు సెలయేరొకటి కనిపించింది. అక్కడ కాలకృత్యాలు తీర్చుకుని, ఆ ప్రాంతాల వున్న చెట్లపళ్ళు కోసుకు తిని, తిరిగి రాత్రి తాము గడిపిన చెట్టు దగ్గిరకు వచ్చారు.

ఆ సరికి భైరవుల ముఠా కూడా భోజనాలు ముగించి, ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. వాళ్ళు బయలుదేరిపోతున్నది,



పద్మపురరాజ్య సరిహద్దుల అవతల వున్న కొండల కేసి అని గ్రహిస్తూనే, ఖడ్గ జీవదత్తులకు చాలా ఆనందం కలిగింది. వాళ్ళు కూడా సాధ్యమైనంత వేగంగా ఆ రాజ్య సరిహద్దులు దాటి పోవాలనుకుంటున్నారు.

ఆ పగలల్లా భైరవులకు కొంచెం వెనకగా, వాళ్ళను అనుసరించి ఖడ్గ జీవదత్తులు అరణ్యంలో ప్రయాణం చేశారు. అంత పెద్ద ముఠాను పగటివేళ ఎదుర్కొని, వాళ్ళు అపహరించుకు వచ్చిన పిల్లను విడిపించటం ప్రమాదకరమని వాళ్ళిద్దరూ తీర్మానించుకున్నారు.

సూర్యాస్తమయమై క్రమంగా అరణ్యమంతా చీకటి కమ్ముకున్నది. భైరవుల ముఠా ఒకచోట చిన్నచిన్న డేరాలు వేసుకుని, వంట పూర్తవగానే భోజనాలు చేసి నిద్రకు ఉపక్రమించారు. వాళ్ళున్నచోటుకు సమీపంలో వున్న ఒక చెట్టు మీద కూర్చుని ఖడ్గ జీవదత్తులు తగిన సమయం కోసం నిరీక్షిస్తున్నారు.

బాగా పొద్దుపోయింతర్వాత భైరవుల గురువు తన డేరా నుంచి బయటికి వచ్చి, మరొక డేరా వద్ద కాపలా వున్న వాళ్ళొకణ్ణి పిలిచి, మాట్లాడుతూ ఖడ్గ జీవదత్తులు వున్న చెట్టు కిందికి వచ్చారు.

ఇప్పుడు ఖడ్గ జీవదత్తులకు, గణలింగేశ్వరుడు తన అనుచరుడికి చెప్పుతున్నదేమిటో స్పష్టంగా వినబడసాగింది.

"ఆ కానున్న భైరవీకన్య నిద్రిస్తున్న డేరా, ఆ టేకుమాను కింద వున్నదే గదా! దాని వెనక వున్న గుబురుపొదల్లో పులి ఒకటి తిరుగుతూండటం చూశాను. బహుశా అది కన్యను ఎత్తుకుపోయేందుకు డేరాలోకి దూరవచ్చు. మీరు మాత్రం అడ్డుకోకండి. కన్యాభైరవి ధైర్యస్థైర్యాలు ఏపాటివో పరీక్షిద్దాం!" అన్నాడు.

తరవాత వాళ్ళిద్దరూ అక్కణ్ణించి వెళ్ళిపోయారు. అప్పుడు జీవదత్తుడు చిన్న గొంతుతో, "విన్నావా, ఖడ్గా! ఈ భైరవుల గురువు ఆ పిల్లను పులికి మేతగా వెయ్యాలని చూస్తున్నాడు. ఎంతో శ్రమపడి అపహ

రించుకు వచ్చాడు గదా! కారణం సరిగా అర్థం కావటం లేదు." అన్నాడు.

"కారణం అర్థం చేసుకునేందుకు మనం ప్రయత్నించే లోపల ఆ పిల్ల పులి కడుపులో వుంటుంది! అదంతా తరవాత ఆలోచిద్దాం. నువ్విక్కడే వుండు!" అంటూ ఖడ్గవర్మ చెట్టుకొమ్మల్ని పట్టుకుని వూగుతూ, ఆ పిల్ల డేరా వున్న చెట్టు దగ్గిరకు పోయాడు.

భైరవుల గురువు అన్నట్టుగానే పులి ఒకటి, ఆ డేరా పక్కనున్న గుబురుపొదల్లో అటూయిటూ తిరుగుతూ, మధ్యమధ్య ఆగి డేరా కేసి చూస్తున్నది.


"ఓహో, పరిస్థితి చాలా ప్రమాదకరంగా తయారయేట్టుందే!" అనుకున్నాడు, ఖడ్గవర్మ. అతడికి ముందు పులి మీద పడి దాన్ని చంపాలని వున్నది. కాని, ఆ సమయంలో రేగే అలజడికి భైరవులంతా మేలుకోవచ్చు! అలాకాక వాళ్ళు పట్టుకుని తెచ్చిన పిల్లను డేరాలోంచి బయిటికి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తే, ఒక వైపు నుంచి పులీ, రెండవ వైపు నుంచి కాపలావాడూ తమ మీదికి రావచ్చు!

ఖడ్గవర్మ యిలా ఆలోచిస్తూ, కాపలావాడేమి చేస్తున్నాడో చూద్దామని చెట్టుచాటు నుంచి బయిటికివచ్చి, నక్కుతూ పిల్ల వున్న డేరా పక్కకు పోయాడు. తమ గురువు



సలహా వింటూనే భైరవకాపలావాడు, మరొక చెట్టు కింద వున్న డేరా దగ్గిరకుపోయి, దాని ముందు ఎండుపుల్లలతో నెగడు తయారు చేయసాగాడు. భైరవికన్య ఏమయిపోయినా, తనను పులి ఎత్తుకుపోకుండా వాడు ముందు జాగ్రత్తపడుతున్నాడన్న మాట!

కాపలావాడి ధోరణి ఖడ్గవర్మ చేయదలుచుకున్నదానికి చాలా అనుకూలంగా కనిపించింది. ఇప్పుడతడికి కాపలావాడి కంటబడతానేమో అన్న భయంలేదు. అతడు భైరవికన్య వున్న డేరాలోకి వెనక వైపు నుంచి నిశ్శబ్దంగా ప్రవేశించాడు. ఎలుగుచర్మం మీద విచారంగా కూర్చుని వున్న భైరవికన్య అతణ్ణి చూస్తూనే భయంతో



కంపించి పోయింది. కాని అరిచేందుకు ప్రయత్నించలేదు.

ఖడ్గవర్మ ఆమెను సమీపించి చిన్న గొంతుతో, "అమ్మాయీ, నువ్వెవరో నాకు తెలుసు. మీ నాయన గ్రామాధికారిగా వున్న గ్రామం నుంచే వస్తున్నాను. నిన్ని భైరవులు కొలను దగ్గిర నుంచి అపహరించుకు వచ్చారుగదా?" అని అడిగాడు.


"అవును!" అంటూ భైరవికన్య తల వూపి. "మిమ్మల్నెప్పుడూ మా గ్రామంలో చూడలేదే!" అన్నది.


"నేను మీ గ్రామం నుంచి వస్తున్నానని చెప్పాగాని, మీ గ్రామస్తుణ్ణని చెప్పలేదు. ఏమైనా అదంత ముఖ్య విషయం కాదు. నీకు తిరిగి నీ తల్లిదండ్రుల వద్దకు వెళ్ళాలని వున్నదా, లేక యీ భైరవులకు పూజారిణివి అయి పెరూ, అధికారం చలాయించాలని వున్నదా?" అని అడిగాడు ఖడ్గవర్మ.

"ఛీ ఛీ! ఈ భైరవులు మనుషులా? పట్టి పశుప్రాయులు! వాళ్ళల్లో కాస్త మనిషి అని చెప్పకొదగ్గవాడు ఆ శ్వేతభైరవుడు ఒక్కడే! మీ చేతనైతే నన్ను రక్షించి, నా తల్లిదండ్రుల దగ్గిరకు చేర్చండి!" అన్నది భైరవికన్య.

"నువ్వేమీ భయపడకు. తప్పక నిన్ను నీ తల్లిదండ్రుల దగ్గిరకు చేరుస్తాను. అవతల పొదల్లో పులి తిరుగుతూండటం తెలుస్తున్నది గదా? మనం ఇక్కణ్ణించి బయటికి వెళ్ళగానే అది మన మీదికి దూకే ప్రయత్నం చెయ్యవచ్చు. నువ్వు అరవకుండా నా వెనక నిలబడు. ఆ పులి సంగతి నేను చూస్తాను. భయపడి అరిచావో, భైరవభక్తులంతా వచ్చి మన నిద్దర్నీ పట్టుకుంటారు." అన్నాడు ఖడ్గవర్మ.

ఇద్దరూ చప్పుడు కాకుండా కదిలి డేరా వెనకవైపు నుంచి బయటికి వచ్చారు. అప్పటివరకా పొదల్లో తిరుగుతూ మధ్య మధ్య గాండ్రిస్తున్న పులి వాళ్ళను చూస్తూనే, పొదల నుంచి బయటికి వచ్చి, వాళ్ళకు ఎదురుగా వెనకకాళ్ళ మీద కూర్చున్నది. ఖడ్గవర్మ ముందు కదుగేసి పులిని


CHITRA



కత్తితో ఒక దెబ్బ కొడదా మనుకున్నాడు గాని, అప్పుడు మరింత గలభా అయి భైరవ భక్తులు లేచి వస్తారని సంశయించాడు.

పులిని అంత దాపుల్లో చూసి, భైరవికన్య వడవడ వణకసాగింది. ఖడ్గవర్మ ఆమె ముందు నిలబడి ఒక్కొక్క అడుగే వెనక్కు వేయసాగాడు. జీవదత్తు డున్న చెట్టు దగ్గిరి కావిధంగా పోయి, కన్యను చెట్టెక్కించాలని అతడి ప్రయత్నం.

కాని పులి వాళ్ళను వదలకుండా వాళ్ళతో పాటు మెల్లిగా ముందుకు నడుస్తూ రాసాగింది. క్రూరమృగాల స్వభావం బాగా తెలిసిన ఖడ్గవర్మ అది ఏ క్షణాన్నయినా తమ మీదికి లంఘిస్తుందని గ్రహించి, కత్తిని సిద్ధంగా వుంచుకున్నాడు. అతయూహించినట్టుగానే అది ఒక్కసారి పెద్దగా అరిచి, ఖడ్గవర్మ మీదికి ఎగిరింది. ఖడ్గవర్మ గురి చూసి దాని తల మీద కత్తితో పొడిచాడు.

కత్తిదెబ్బ తింటూనే పులి భయంకరంగా అరుస్తూ, వెనక్కు పడి, నేల మీద అటూ ఇటూ పొర్లుతూ పొదల్లోకి పోయి పడింది. భైరవుల డేరాల్లో పెద్ద కలకలం బయలుదేరింది. భైరవుల గురువు గణలింగేశ్వరుడు ఒక డేరాలోంచి చప్పున బయటికి వచ్చి, "ఆహా, భైరవికన్య నిరాయుధంగా పులితో పోరాడుతున్నది! మీ రెవరూ అడ్డుకోకండి. ఆమె పులి డొక్క చీల్చి పేగులు మెడలో వేసుకుని యిప్పుడే మన దగ్గిరికి రావచ్చు!" అన్నాడు బిగ్గరగా.

భైరవభక్తు లంతా తమ గురువు పక్కన చేరి, పులి అరవటం వినవస్తున్న పొదల కేసి చూడసాగారు. ఈలోపల ఖడ్గవర్మ, భైరవికన్యతో జీవదత్తు డున్న చెట్టు దగ్గిరికి పరిగెత్తాడు. జీవదత్తుడు అప్పటికే చెట్టు దిగి వున్నాడు. భైరవుల కళ్ళుగప్పి పారిపోవటానికి యిదే మంచి సమయం అని గ్రహించి వాళ్ళు అక్కణ్ణించి బయలుదేరి అరణ్యానికి అడ్డంపడి నడవసాగారు.

గణలింగేశ్వరుడు భైరవికన్య పులినోట పడిందనే అనుకుంటున్నాడు. ఆమెకు తన

పై కన్న శ్వేతభైరవుడి పైన ఎక్కువ అభిమానం వున్నదని. అలాంటి కన్యను భైరవ పూజారిణిగా చేస్తే తనకు ముందు ముందు ప్రమాదం రావచ్చునని ఆలోచించి, అతడు ఆమెను పులికి ఆహారంగా వేయ నిశ్చయించాడు. పైకి మాత్రం తన శిష్యులతో ఆమె ధైర్యసాహసాలు పరీక్షించ నున్నట్టు నాటకం ఆడాడు.

శ్వేతభైరవుడికి మాత్రం తమ గురువు ఏదో కుట్ర పన్నాడన్న అనుమానం వున్నది. అతడు గబగబా భైరవీకన్య కోసం కట్టిన డేరా దగ్గిరకు పోయి లోపలికి తొంగిచూశాడు. అక్కడ ఎవరూ లేరు. అసరికి అతడికి తమ గురువు మాటల్లోని కపటం, అతడు వేసిన ఎత్తూ అర్థమైంది.

అతడు గురువు వున్న చోటుకు తిరిగి వచ్చి, "గురులింగేశ్వరా! భైరవీకన్య డేరాలో లేదు!" అన్నాడు.

గురులింగేశ్వరుడు అతడి కేసి ఆశ్చర్య పడుతున్నవాడిలా చూసి, "నువ్వే లోకంలో వున్నావ్? ఇంతవరకూ నేను చెపుతున్న దేమిటి? నీకు మతిస్థిమితం ఏమైనా తప్పిందా? భైరవీకన్య ఆ కనబడే పొదలలో పులితో ఒంటరిగా పోరాడుతున్నది!" అన్నాడు.

"కన్య సాహసిలాగే కనబడుతున్నది గాని, పులితో పోరాడేటంత బలం, శక్తి



ఆమెలో వున్నదనుకోను!" అన్నాడు శ్వేతభైరవుడు కోపంగా.

"శక్తి, బలం లేనివాళ్ళు భైరవపూజకు పనికిరారు. అలాంటి బలహీనురాల్ని పులి తిన్నా వచ్చే నష్టం ఏమీ లేదు. మనం తిరిగి గ్రామప్రాంతాలకు పోయి మరో యోగ్యురాలైన కన్యను పట్టుకు వస్తాం!" అన్నాడు గురులింగేశ్వరుడు.

ఈ మాటలు శ్వేతభైరవుడికి ఎక్కడలేని కోపాన్ని తెప్పించినై. కాని అతడు దాన్ని దిగమింగుకుని పొదల కేసి చూస్తూ, "అక్కడ ఏ కదలికా లేదు. పులి అరవటం మానింది. ఎవర్ని ఎవరు చంపారో చూడటం అవసరం గదా!" అంటూ కాగడా ఒకటి

తీసుకుని పొదల కేసి బయలుదేరాడు. అతడి వెనకగా మరి కొందరు భైరవులు నడిచారు.


అందరూ పొదల దగ్గిరకు చేరి, ఒక వేళ పులి పొంచి వున్నదేమో అన్న భయంతో, ముందుగా పొదల మీదికి కొన్ని రాళ్ళు విసిరారు. అటు నుంచి ఎలాంటి ధ్వని గాని, పొదలు కదిలిన సూచన గాని రాలేదు. పులీ, కన్యా యిద్దరూ మరణించయినా వుండాలి, లేదా పులి ఆమెను పట్టుకుని పారిపోయి అయినా వుండాలి, అనుకుంటూ శ్వేతభైరవుడు పొదల్లోకి వెళ్ళాడు.

అక్కడ పులి లేదు, కన్యా లేదు! పొదంతా చింపరవందరగా తొక్కిసట్టున్నది. ఆకుల మీదా కొమ్మల మీదా రక్తపు మరకలు కాగడా కాంతిలో మిలమిలా మెరుస్తున్నవి. ఇది చూసి శ్వేతభైరవుడు, కన్యను పులి నోట కరుచుకు పోయిందని భావించి, తన వెంట వున్న వాళ్ళతో, "ఇదంతా మన గురువు పన్నిన కుయుక్తి. అతడు ఒక అమాయిక బాలిక చావుకు కారకుడయ్యాడు. ఇది సహించరానిది!" అన్నాడు.

గణలింగేశ్వరుడు దూరంగా నిలబడి, అంతా చూస్తూనే వున్నాడు. పొదల్లో వున్న పులి శ్వేతభైరవుడి మీద పడుతుందని కూడా అతడు ఆశపడ్డాడు. కాని అక్కడ అంతా నిశ్శబ్దంగా వుండటంతో, అతడు కొంచెం ఆశ్చర్యపోయి, పొదల దగ్గిరకు వెళ్ళి, "శ్వేతా! పులీ, కన్యా కూడా చచ్చారా?" అని ప్రశ్నించాడు.

"ఎవరి శవమూ యిక్కడ లేదు. ఇక్కడ అంతా రక్తమయంగా మాత్రం వున్నది. పులిని కన్యో, కన్యను పులో ఎత్తుకుని ఇక్కణ్ణించి పారిపోయారు!" అన్నాడు శ్వేతభైరవుడు వెటకారంగా.

"మహాభైరవుడు మనను రక్షించి, తనను తాను రక్షించుకున్నాడు! శక్తిహీన, బలహీన అయిన కన్య తనకు పూజారిణి కాకుండా ముందుగానే జాగ్రత్తపడ్డాడు. సరే, ఇక దీపాలు ఎత్తి ప్రయాణానికి సిద్ధంకండి! ఈసారైనా అన్ని అర్హతలూ వున్న కన్యగా చూసి పట్టుకురావటం మంచిది." అన్నాడు గణలింగేశ్వరుడు. —(ఇంకా వుంది)





# రాతిదేవత

## 8

[గంగాలింగేశ్వరుడు, తాను తెచ్చిన కన్యను పులికి ఆహారంగా వెయ్యాలని చూశాడు. కాని ఖడ్గవర్మ ఆమెను కాపాడి, రేఖలో నుంచి తీసుకువచ్చాడు. తరవాత అతడూ, జీవదత్తుడూ ఆమెను వెంట బెట్టుకుని బయలుదేరారు. గంగాలింగేశ్వరుడు మరొక కన్యను పట్టుకు వచ్చేందుకు తన శిష్యుల్ని ప్రయాణం కమ్మన్నాడు. తరవాత—]

గంగాలింగేశ్వరుడి ఆజ్ఞ కాగానే భైరవు లందరూ ప్రయాణ మయారు. ఈసారి గంగాలింగేశ్వరుడు దాపుల కనబడుతున్న ఒక కొండ కేసి తన ముఠాను నడిపించాడు. ఆ కొండ కింద ఏవో పల్లెపట్లు వుండకపోవవు. సూర్యోదయ వేళకు ఆ ప్రాంతాలు చేరితే, పొలం పనుల మీద వెళ్ళే కుటుంబీకులలో, తమకు కావలసిన కన్య దొరక్కపోదని అతడి ఆలోచన.

భైరవుల గుంపుకు ముందుగా, ఇద్దరేసి భైరవులు చెరొక వైపునా పోతూ, దారిలో ఏ రాజభటుల నుంచో లేక గ్రామస్తుల నుంచో ప్రమాదం వాటిల్లకుండా హెచ్చరిక యిస్తూంటారు. అలా ముందుకు పోయిన ఇద్దరు భైరవులకు సూర్యోదయం వేళ ఒక చెట్టు కింద కూర్చుని ఒక యువకుడూ, ఒక బాలికా కనిపించారు. యువకుణ్ణి మాత్రం వాళ్ళేనాడూ చూసి వుండ



లేదు. బాలిక మాత్రం రాత్రి పులితోపాటు మాయమైన కన్యాభైరవి!

"ఎవడో కామరూపి! రాత్రి పులి రూపంలో వచ్చి కన్యను అపహరించాడు!" అన్నాడొక భైరవుడు.

"ఇలాంటి కామరూపుల్ని మహాశక్తుడైన మన గురువు రుద్రాక్షలుగా మార్చి మెడలో వేసుకోగలడు! సరే, మనం గురువుకు ఈ సంగతి చెపుదాం!" అన్నాడు రెండో భైరవుడు.

భైరవు లిద్దరూ వెనుదిరిగి పరుగుపరుగున గణలింగేశ్వరుడి దగ్గిరకు వచ్చి, తాము చూసింది చెప్పారు. గణలింగేశ్వరుడు పొందిన ఆశ్చర్యం అంతా ఇంతా కాదు.

"నిశ్శబ్దంగా పోయి వాళ్ళను చుట్టుముట్టండి. కొందరు వాళ్ళున్న చెట్టుకొమ్మల్ని ఆక్రమించటం మంచిది. ఒకవేళ వాడు మాంత్రికుడైతే పైకెగిరిపోకుండా పట్టుకోవచ్చు!" అన్నాడు గణలింగేశ్వరుడు.

భైరవు లందరూ బయలుదేరి కన్యా, యువకుడూ వున్న చోటు చేరి, వాళ్ళను చుట్టుముట్టి పట్టుకునేందుకు అన్ని వైపుల నుంచి, నిశ్శబ్దంగా వాళ్ళ కేసి నడిచారు.

దాపుల నున్న చెట్ల మీది నుంచి వాళ్ళున్న చెట్టు కొమ్మల్లోకి చేరేందుకు కొందరు భైరవులు, కోతుల్లా పైకి పాకసాగారు.

అరణ్యంలో చాలాదూరం నడవటం వల్ల కలిగిన బడలిక చేత, బాలిక చెట్టు బోదె నానుకుని కునికిపాట్లు పడుతున్నది. ఆమెకు కొంచెం దూరంగా జీవదత్తుడు తన దండం మీద గడ్డం ఆనించి కూర్చుని, ఏదో ఆలోచిస్తున్నాడు. అతడికి కన్యాభైరవిని ఆమె తండ్రి దగ్గిరకు చేర్చటం ఎలా అన్నది, సమస్యగా పరిణమించింది. ఇక ఖడ్గవర్మ ఆ దాపుల్లో లేడు. అతడికి తూర్పున సూర్యోదయ చిహ్నాలు కనబడగానే, విల్లంబులు సంపాయించటం అవసరం అన్న అభిప్రాయం కలిగింది. ఆ పగలు తాము ఎలాంటి శత్రువులను ఎదుర్కోవలసి వుంటుందో వూహించటం కష్టం. దూరాన్నుంచే శత్రువుల్ని హతమార్చటానికి విల్లూ, బాణాలూ



తయారు చేస్తూ, అతనికి సెలయేటి ఒడ్డున కూర్చునివున్నారు.

ఆదమరిచి వున్న జీవదత్తుణ్ణి, గ్రామాధికారి కూతుర్ని పట్టుకోవటం భైరవ భక్తులకు చాలా తేలిక పనయింది. హఠాత్తుగా కొందరు చెట్ల చాటునుంచి వాళ్ళ మీదికి వచ్చి పడ్డారు. మరికొందరు చెట్లకొమ్మలు పట్టుకుని వేళ్ళాడుతూ, "రాత్రి పులిరూపంలో వచ్చిన మాంత్రికుడా, జాగ్రత్త! పైకెగిరావే, కాళ్ళూ చేతులూ విరిచి కిందపడేస్తాం!" అన్నారు.

జీవదత్తుడు దండం తీసుకొని లేచేలోపలే అతణ్ణి నలుగురైదుగురు భైరవులు గట్టిగా ఒడిసిపట్టుకున్నారు. గ్రామాధికారి కూతురు పారిపోయే ప్రయత్నం చేయలేదు. ఆమె నిర్భయంగా చెట్టు నానుకుని నిలబడి గణలింగేశ్వరుడికేసి చూస్తూ వూరుకున్నది.

గణలింగేశ్వరుడు, గుర్రుమంటూ, "కన్యాభైరవీ! రాత్రి పులిరూపంలో వచ్చి, నిన్ను అపహరించి తెచ్చినవాడు వీడేనా?" అని అడిగాడు, జీవదత్తుణ్ణి చూపుతూ.

"ఈయన పులిరూపంలో రాలేదు. ఇప్పుడున్న రూపంలోనే నాకు మీ గుడారాల ప్రాంతాన కనిపించాడు. నాకై నేనే ఆయన వెంట మా గ్రామానికి బయలుదేరాను," అన్నది గ్రామాధికారి కూతురు.

"అయ్యో, పిచ్చి భైరవీ! ఇంకా మీ గ్రామం అక్కడున్న దనుకుంటున్నావా? అడవి దొంగలముఠా ఒకటి మీ గ్రామంమీద పడి దోచుకుని, అందర్నీ చంపి ఇళ్ళకు నిప్పు పెట్టేశారు. ఆ సమయంలో నువ్వు గ్రామానికి దూరంగా కొలను దగ్గరవుండి మాకు దొరికి బతికిపోయావు!" అన్నాడు గణలింగేశ్వరుడు.

"నేను భైరవిని కాను. నా పేరు భవాని! నన్నూ, ఆయన్నీ వదిలి, మీ దారిన మీరు పొండి," అన్నది గ్రామాధికారి కూతురు కోపంగా.

"నీ పేరు భవాని అని తెలిసే నిన్ను భైరవిని చేయదలిచాం," అంటూ గణలింగేశ్వరుడు జీవదత్తుడికేసి పళ్ళు కొరుకుతూ చూసి, "అదుగో, ఆ కనబడే



కలకలం లేవటం విన్నాడు. ఆ సమయానికి సూర్యోదయం అయింది. ఖడ్గవర్మ ఒక బలమైన విల్లూ, కొన్ని అంబులూ తయారు చేసి, జీవదత్తుడున్న చోటుకు బయలు దేరాడు. అంతలో అతడికి భైరవుల అరుపులు వినిపించినై. ఏమి జరిగిందో చూసేందుకు అతడొక చెట్టు ఎక్కాడు. అక్కణ్ణించి అతడికి జీవదత్తుణ్ణి చుట్టుముట్టి పట్టుకున్న భైరవులూ, గ్రామాధికారి కూతురితో మాట్లాడుతున్న గురువూ కనిపించారు.


ఆ సమయంలో తను భైరవులను ఎదిరించటం వల్ల మేలుకన్న కీడే ఎక్కువ కలిగే ప్రమాదం వున్నదని ఖడ్గవర్మ అనుకున్నాడు. భైరవులు తన మిత్రుణ్ణీ, బాలికనూ వెంటబెట్టుకుని ఏ మార్గాన పోతారో చూసి, వాళ్ళను అనుసరించిపోయి, వీలయినప్పుడు వాళ్ళను హతమార్చి, మిత్రుణ్ణీ, బాలికనూ బంధవిముక్తుల్ని చేయాలని అతడు నిర్ణయించుకున్నాడు.


గణలింగేశ్వరుడు తన శిష్యులతో దాపుల నున్న కొండల కేసి బయలుదేరాడు. ఇద్దరు భైరవులు త్రిశూలాలు ఊపుకుంటూ అందరి కన్న ముందు నడుస్తున్నారు. చెట్టు మీద నుంచి యిది చూసిన ఖడ్గవర్మ తాను ఆ ఇద్దర్నీ అనుసరించి పోతే, మొత్తం భైరవముఠా పొదలిచిన ప్రదేశం కనుక్కో వచ్చునుకున్నాడు.

కొండల మీద భైరవాలయం నిర్మించ బోతున్నాం. ముందు వీణ్ణి ఆ స్థానంలో బలి యివ్వవలసివుంది. ఆ పని నువ్వు చేయాలి. ఆ తరవాత కట్టబోయే ఆలయానికి నువ్వు పూజారివి వయిపోతావు.'' అన్నాడు.

జీవదత్తుడికి గురువు మాట్లాడేధోరణి చూస్తుంటే అసహ్యం పుట్టుకు రాసాగింది. కాని, యింత మందిని తానొక్కడే యిప్పుడు ఎదిరించటం ప్రమాదకరం. బహుశా ఖడ్గ వర్మ దూరాన్నుంచి అంతా చూసి, సహాయ పడేందుకు తగు ప్రయత్నాలు చేస్తూవుంటా డని అతడు అనుకున్నాడు.

జీవదత్తుడు అనుకున్నట్టే ఖడ్గవర్మ తన మిత్రుడున్న చెట్ల ప్రాంతాన్నుంచి పెద్ద





ఖడ్గవర్మ చెట్టు మీదినుంచి కిందికిదిగి భైరవులకు కనబడకుండా వాళ్ళను అనుసరించి నడవసాగాడు. అలా కొంతదూరం నడిచి అతడు కొండపాదం చేరాడు. భైరవులందరూ కొండ ఎక్కసాగారు. ఆ ప్రదేశంలో చెట్లు అంతగా లేవు. ఖడ్గవర్మ తాను వాళ్ళను అనుసరించేందుకు రాళ్ళచాటుగా నక్కుతూ పోవటం ఒక్కటే మార్గమని గ్రహించాడు. అది కొంత ప్రమాదంలో కూడినపని, భైరవుల కంటబడే ప్రమాదం వున్నది.....

ఖడ్గవర్మ యిలా ఆలోచిస్తూ చెట్టు చాటునుంచి బయిటికి వచ్చేంతలో, చుట్టూవున్న పొదల మాటునుంచి పదిపన్నెండు మంది మనుషులు ఒక్కసారిగా బయిటికి వచ్చి, చేతుల్లోవున్న యీటెలను అతడి కేసి గురి చేశారు. వాళ్ళు తాము లోగడ విడిచివచ్చిన గ్రామస్థులని ఖడ్గవర్మ గుర్తించాడు. వాళ్ళల్లో తలారి వాళ్ళిద్దరు కూడా వున్నారు. ఒక యువకుడి చేతిలో పెంపుడు ఎలుగుబంటు ఒకటున్నది. వాడు ఎలుగుబంటుతో ఖడ్గవర్మను సమీపిస్తూ, "పాంపాళాశాపే, దీన్ని ఉసిగొలిపి నీ తల కొబ్బరిపొళ్ళెంలా కపీమని పగిలేలా కొరికిస్తాను!" అన్నాడు.

"తొందరపడి ఆ వెధవ పనిచేయకు. నేనూ మీరూ కూడా ప్రమాదంలో చిక్కుకువున్నాం. మీ గ్రామపెద్దా, లెక్కలురాసే మునసరి ఏకాదం ఎక్కడ?" అని అడిగాడు ఖడ్గవర్మ.


ఎలుగుబంటువాడు జవాబిచ్చే లోపలే, ఒక పొదలో నుంచి గ్రామాధికారీ, గణకుడూ తలలు బయటికి పెట్టి, "ఆ కత్తి లాగేసుకోండి! ఆ రెండో వాడెక్కడ?" అన్నారు.

"అయ్యా గ్రామపెద్దలూ! నా వోటి వాడి నుంచి కత్తిలాక్కోవటం, మీ గ్రామంలో వీధిన పోయేవాడి భుజంమీంచి పై పంచ లాక్కోవటం అంత తేలిక అనుకుంటున్నారేమో. కాదు! గొడవ చెయ్యకుండా ముందు నే చెప్పేది వినండి! నా స్నేహితుణ్ణీ, మీ కుమార్తెనూ భైరవభక్తులు బందీలను చేసి, అదుగో, ఆ కొండ మీదికి తీసుకు పోతున్నారు. మీరంతా నే చెప్పినట్టు వింటే,

వాళ్ళిద్దర్నీ రక్షించవచ్చు!'' అన్నాడు ఖడ్గవర్మ.

"అయ్యో, మా భవాని! ఎంత అదృష్టం, ఇంకా బతికేవున్నదా? వాళ్ళ అమ్మ పోరు పడలేక, దాన్ని వెతుకుతూ అరణ్యంలోకి వచ్చాం. నువ్వు తటస్థపడ్డావు. నీ మాటలు నమ్మవచ్చా?'' అన్నాడు గ్రామాధికారి.

"ఖడ్గవర్మను నమ్మి చెడ్డవాడు లేడన్నది మా గ్రామ ప్రాంతాలవున్న సామెత! రాత్రి నీ ఊరుర్ని భైరవుల గురువు పులికి ఆహారంగా వేయచూశారు. నేనూ నా మిత్రుడూ కాపాడి, యీ ప్రాంతాలకు తెచ్చాం. నేను లేనిసమయంలో ఆ భైరవులు వాళ్ళిద్దర్నీ పట్టుకుని కొండమీదికి తీసుకు పోతున్నారు. అదీ సంగతి! ఒక ఉపాయం ఆలోచించాను. నా వెంటరండి!'' అన్నాడు ఖడ్గవర్మ.



గ్రామాధికారికి ఆ మాటల్లో నమ్మకం కుదిరింది. అతడు ఖడ్గవర్మ దగ్గరకు వచ్చాడు. అతడికి వెనగ్గా నిలబడిన గణకుడు మాత్రం ఖడ్గవర్మ కేసి అనుమానంగా చూస్తూ, "నిన్ను నమ్మటం ఎలా? రాత్రి గ్రామం మీదికి ఏనుగుల్ని, పులుల్ని పంపకం చేశావే! నువ్వు మంత్రతంత్రాలు నేర్చిన వాడిలా వున్నావు!'' అన్నాడు.

"అసందర్భపు మాటల్తో పూరికే కథ పెంచక, నే చెప్పినట్టు విని, నా వెంటరండి! అదుగో, భైరవులు కొండ ఎక్కుతున్నారు. నా మిత్రుడూ, ఆ పక్కనేవున్న అమ్మాయీ కనబడుతున్నారా?'' అన్నాడు ఖడ్గవర్మ.

గ్రామాధికారీ అతడి వెంటవున్న వాళ్ళూ అటుకేసి చూశారు. గ్రామాధికారి తన కుమార్తెను చూస్తూనే, ఆవేశపడిపోతూ, "రండి! ఆ దుర్మార్గుల్ని పట్టుకుని చెట్లకు విరిచి కట్టి, ఈటెలతో పొడిచిద్దాం!'' అంటూ బయలుదేరాడు.

ఖడ్గవర్మ అతడి భుజం పట్టుకుని ఆపి, "ఆ దుర్మార్గులు నిరాయుధులు కారు. వాళ్ళదగ్గిర త్రిశూలాలు వున్నయ్. నా వెంట రండి. రాళ్ళచాటుగా వాళ్ళను వెన్నంటి పోయి, అవకాశం దొరికినప్పుడు హఠాత్తుగా మీద పడదాం!'' అన్నాడు.

ఖడ్గవర్మ చెప్పినట్టు గ్రామాధికారి, అతడి అనుచరులూ మరో మార్గాన కొండ ఎక్క సాగారు. కొంత సేపటికి భైరవుల ముఠా కొండమీద సమతలంగావున్న ఒక ప్రదేశాన్ని చేరారు. వాళ్ళ గురువు గణలింగేశ్వరుడు, అక్కడ అందర్నీ ఆపి, చుట్టూ ఓమారు కలయచూసి, "ఈ ప్రదేశం భైరవాలయ నిర్మాణానికి మహాప్రశస్తంగా వుంది. ఇదిగో, యీ రాతిమీద ముందుగా వీణ్ణి బలియిచ్చి, తరవాత ఆలయ నిర్మాణం ప్రారంభిద్దాం! కన్యాభైరవి యీ కత్తితో వీడి గుండెలను చీల్చి రక్తతర్పణం చేస్తుంది!" అంటూ చిన్న కత్తిని భవానికి యివ్వబోయాడు.

భవాని రౌద్రావేశంతో గణలింగేశ్వరుడివ్వ చూపిన కత్తిని విసురుగా పక్కకు తోసి, "ఛీ, దుర్మార్గుడా! నేనెవర్ననుకున్నావు? నా చేత హత్యలు చేయించాలనుకుంటున్నావా? జాగ్రత్త. నన్నూ, యీయన్నీ యిప్పుడే వదిలి నీ దారిన నువ్వు పోకపోయ్యావో, ఏదో ఒకనాడు ఆ కత్తితో నేనే నీ గుండెలు చీల్చుతాను!" అన్నది.

"అహా, పౌరుషం గల కన్య! భైరవిగా పనికొస్తుంది. సరే, ముహూర్తం దాటిపోతున్నది గనక, నేనే వీడి గుండెలు చీల్చి, భైరవాలయ నిర్మాణానికి ఉపయుక్తంగా యీ ప్రదేశాన్ని పవిత్రం చేస్తాను!" అన్నాడు గణలింగేశ్వరుడు.

గణలింగేశ్వరుడు పిడికిట కత్తిని గట్టిగా బిగించి, చేయెత్తి పెద్ద గొంతుతో ఏవో మంత్రాలు చదవసాగాడు. రాళ్ళ చాటున వుండి ఇదంతా చూస్తున్న ఖడ్గవర్మ, ఎలుగుబంటును వెంట తెచ్చిన పల్లె యువకుడితో, "ఏదీ నీ పెంపుడు ఎలుగును, ఆ గడ్డం పిశాచి మీదికి ఉసికొల్పు! ఏం జరుగుతుందో, చూద్దాం." అన్నాడు.

పల్లెయువకుడు ఎలుగుబంటుకు గణలింగేశ్వరుణ్ణి చూపుతూ, "దూకు బాంబ పంతా! వాడి తల కొరుకు!" అన్నాడు.

ఆ వెంటనే ఎలుగుబంటు పెద్దగా గాండ్రిస్తూ, రాళ్ళ చాటు నుంచి గణలింగేశ్వరుడి భైరవగుంపు మీదికి దూకింది.

—(ఇంకా వుంది)





# రాకాసిలోయ

## 9

[ఖడ్గవర్మ దగ్గిరలేని సమయంలో, భైరవులు జీవదత్తుణ్ణీ, గ్రామాధికారి కూతుర్నీ పట్టుకున్నారు. ఖడ్గవర్మ గ్రామాధికారిని, అతడి అనుచరులనూ వెంటబెట్టుకుని, వాళ్ళ వెన్నంటి పోయాడు. గండలింగేశ్వరుడు, జీవదత్తుణ్ణి కత్తితో పొడవబోయే సమయాన, వర్ణియువకు డొకడు పెంపుడు ఎలుగుబంటును అతడి మీదికి ఉసికొల్పాడు. తరవాత—]

ఎలుగుబంటి గాండ్రింపు వినబడగానే భైరవు లందరూ ఒక్కసారి తలలుతిప్పి చూశారు. వాళ్ళకు పరుగు పరుగున వస్తున్న ఎలుగు బంటు కనిపించింది. గండలింగేశ్వరుడు నివ్వెరపడి ఓ తృటికాలం దాని కేసి చూసి పెద్ద గొంతుతో, "ఎలుగును శూలాలతో పొడిచి చంపండి! ఈ లోపల నేను వీడి గుండె చీల్చి భైరవుడికి రక్త తర్పణ చేస్తాను," అని కేక పెట్టాడు.

అతడు మాట ముగించే లోపలే, ఖడ్గవర్మ వదిలిన బాణం అతడి మణికట్టుకు బలంగా తగిలింది. గండలింగేశ్వరుడు "అబ్బా!" అంటూ బాధగా అరిచాడు. కత్తి అతడి పిడికిలి పట్టు నుంచి జారి కింద బడింది. ఖడ్గవర్మా, గ్రామస్తులూ రాళ్ళ చాటు నుంచి బయటికి వచ్చారు.

"మోసం! అన్యాయం! దైవకార్యానికి విఘ్నం కలిగించే యీ నాస్తికమూకల్ని



చంపి, తలలు నరికి, శూలాలకు గుచ్చి పైకెత్తండి!" అంటూ ఎగిరి గంతేశాడు గబులింగేశ్వరుడు.

"పారిపోకుండా చచ్చుమాటల్తో కాలం వృధా చేస్తూ ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు వీడు! చుట్టుముట్టి పట్టుకోండి," అని ఖడ్గవర్మ గ్రామస్తులకు హెచ్చరిక చేసి, జీవదత్తుడున్న రాతి కేసి పరిగెత్తాడు.

గబులింగేశ్వరుడు తన శిష్యులను గ్రామస్తుల మీద పడి చంపమండని ఆజ్ఞాపిస్తూనే, తాను మాత్రం కొండ దిగువ కేసి పరిగెత్తసాగాడు. అది చూసిన శిష్యులు గురువును అనుసరించారు. ఎలుగుబంటు అలా పారిపోతున్న భైరవుల్లో ఒకడి తల పట్టుకోబోయింది. కాని, దాని చేతులకు వాడి నడుం దొరికింది. వాడు పెద్దగా ఓ ధావు కేక పెట్టి కొండ అంచున దొర్లాపడి, ఎలుగుతోపాటు కింద వున్న పల్లంలోకి దొర్లుకుపోసాగారు.

ఈ గలభా అంతా క్షణాల మీద జరిగిపోయింది. జీవదత్తుడూ, గ్రామాధికారి కూతురు భవాని ఆశ్చర్యంలో మునిగిపోయారు. ఖడ్గవర్మ జీవదత్తుడి చేతి కట్లు విప్పుతూ, "మనం అదృష్టవంతులం! నేను రావటం ఒక్క నిమిషం ఆలశ్యమై వుంటే, ఆ భైరవరాక్షసుడు కత్తితో నీ గుండెలు చీల్చి వుండేవాడు!" అన్నాడు.

"ఖడ్గా, నువ్వు తప్పక సహాయం వస్తావని అనుకుంటూనే వున్నాను! పారిపోతున్న ఆ దుర్మార్గులు భవానిని కూడా వెంట లాక్కుపోవటం లేదు గదా? ముందు ఆ పిల్ల సంగతి చూడు," అన్నాడు జీవదత్తుడు లేచి నిలబడుతూ.

"తల్లీ భవానీ! నువ్వు కొండ అంచుకు పోబోకు. ఆ భైరవ ఏకాదాల సంగతి మేం చూస్తాం!" అని గ్రామాధికారి కేక పెట్టాడు.

అందరూ కొండ అంచు కేసి తలలు తిప్పారు. భవాని అంచున నిలబడి, అక్కడ చెల్లా చెదురుగా వున్న బండరాళ్ళను, కొండ దిగి పారిపోతున్న భైరవుల మీదికి తోస్తున్నది. భైరవులు ఆ రాళ్ల దెబ్బలను తప్పించుకుంటూ

వేగంగా కొండ దిగి, దాపుల నున్న అరణ్య వృక్షాల కేసి పారిపోజూస్తున్నారు. పల్లె యువకుడి ఎలుగుబంటు, భైరవుడితోపాటు కొండ దిగువకు దొర్లుకుపోతూ మధ్య మధ్య నోటితో వాడి తల పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నది.

"నా ఎలుగుబంటును భైరవుడు చంపేడా వున్నాడు!" అంటూ పల్లెయువకుడు గబగబా కొండ దిగువకు పరిగెత్తసాగాడు. అతడితోపాటు మరి కొందరు గ్రామస్థులు కొండ దిగేందుకు బయలుదేరారు. వాళ్ళ ఉద్దేశం వెంటబడి తరిమి భైరవులను పట్టుకోవాలని.

ఖడ్గవర్మ వాళ్ళను ఆపి, గ్రామాధికారితో, "ఆ భైరవమూకా అంత సులభంగా మీకు దొరకదు. వాళ్ళొకసారి ఆ చెట్లలోకి పోయింతరవాత, ఒక పట్టాన అందరు. పోయే వాళ్ళను పోనివ్వండి. ఇక ముందు ఆ దుర్మార్గులు మీ గ్రామ ప్రాంతాలకు రాకుండా అవసరం అయిన కట్టుదిట్టాలు చేసుకోండి." అన్నాడు.

భవాని తన తండ్రి పక్కకు వచ్చి నిలబడి. "ఆ దుర్మార్గుల్లో ఒక్కగా నొక్కడైనా దొరక్కుండా పారిపోయారు. కనీసం ఒక్కడైనా దొరికి వున్నట్టయితే, లాక్కుపోయి గొంతుకు ఉరి వేసి గ్రామ మధ్యంలో వున్న చెట్టుకొమ్మకు వెల్లాడ దీసేవని." అన్నది కోపంగా.

"వాళ్ళపాపాన వాళ్ళు పోతారు. నువ్వు ప్రాణాలతో దొరికావు, తల్లి! అంతేచాలు."





అన్నాడు గ్రామాధికారి కుమార్తెను బుజ్జగిస్తూ.

గణకుడు, ఖడ్గ జీవదత్తుల కేసి కళ్లింత చేసుకుని చూస్తూ, "మీ రిద్దరూ మహా వీరులు. సందేహం లేదు. మీ సాహసం సంగతి రాజుగారికి కబురంపి, మంచి బహుమానం వచ్చేలా చూస్తాం. మా వెంట గ్రామానికి రండి!" అన్నాడు.

"మీ గ్రామానికీ, రాజుగారి బహుమానానికీ ఒక నమస్కారం. మా దారిన మమ్మల్ని పోనివ్వండి, అంతేచాలు!" అన్నాడు జీవదత్తుడు.

"మా గ్రామం వచ్చి, మా ఆతిథ్యం స్వీకరించకుండానే వెళతారా? అన్యాయం. మీరు నా రక్షణ కోసం పడిన శ్రమకు కృతజ్ఞత ఎలా చెప్పుకోవటం?" అన్నది భవాని.


"మేము కొద్ది కాలంలో తిరిగి మీ రాజ్యానికి వచ్చి, పద్మపుర రాజుగారి దర్శనం చేసుకోవలని వున్నది. ఆ సమయంలో మీ గ్రామానికి వచ్చి, కొన్నాళ్ళపాటు మీకు అతిథులుగా వుంటాం." అన్నాడు జీవదత్తుడు.

ఆ మాటలకు భవాని ఏదో జవాబు చెప్పబోయేంతలో కొండ కింది పల్లపు ప్రాంతాన్నుంచి పల్లెయువకుడు, "నా ఎలుగుబంటు క్రూరపుల్ని చంపింది!" అంటూ ఉత్సాహంగా కేక పెట్టాడు.

అందరూ అటు కేసి చూశారు. ముందు ఎలుగుబంటు మిట్ట ఎక్కుతున్నది. దాని నడుం ఒక చేత్తో పట్టుకుని, రెండవ చేత్తో చచ్చిన క్రూరపులి కాలొకటి పట్టుకుని, దాన్ని ఈడ్చుకుంటూ పల్లెయువకుడు కొండ ఎక్కుతున్నాడు.

"ఆ శవాన్ని అక్కడే వదిలిరా. దాన్ని ఇక్కడిదాకా ఈడ్చుకురావటం ఎందుకు?" అన్నాడు ఖడ్గవర్మ పల్లెయువకుడితో.

గణకుడు ఏదో రహస్యం చెపుతున్న వాడిలా ఖడ్గ జీవదత్తుల కేసి మెడ చాచి, "ఆ కుర్ర వెధవ, మా గ్రామాధికారి మేనల్లుడు. భవానిని వాడికే ఇవ్వాలనుకుంటున్నారు. బహుశా వచ్చే ఏడు పెళ్ళి



జరిగిపోతుంది. అందుకే వాడికి భైరవు లంటే అంత కోపం," అన్నాడు.

"అదా సంగతి!" అంటూ జీవదత్తుడు భవాని కేసి నవ్వుతూ చూస్తూ, "భవానీ! బహుశా మేం నీ పెళ్లి ముహూర్తానికి ముందే, మీ గ్రామానికి తిరిగి వస్తాం. నువ్వు ఎలుగ్గొడ్ల లాంటి భైరవుల్ని అదరగొట్టావ్. కాబోయే నీ భర్త ఎలుగుబంటునే మచ్చిక చేశాడు," అన్నాడు.

ఆ మాటకు భవాని సిగ్గుపడుతూ, తన తండ్రి చాటుకు తప్పుకున్నది. ఇంతలో పల్లెయువకుడు ఎలుగుబంటుతో సహా కొండ అంచుకు వచ్చాడు. అతణ్ణి చూస్తూనే గ్రామాధికారి కోపంగా, "ప్రాణాలతో వున్న భైరవుణ్ణి పట్టుకొస్తే సంతోషించేవాళ్ళం. ఈ చచ్చిన పీనుగని ఇక్కడికి లాక్కురావ డెందుకు?" అంటూ పోయి, శవాన్ని కాలితో గట్టిగా ఒక తన్ను తన్నాడు. ఆ దెబ్బకు శవం కొండ అంచు నుంచి పల్లానికి దొర్లుకుంటూ పోయింది.

జీవదత్తుడు గ్రామాధికారితో, "ఇక మాకు సెలవు. క్షేమంగా గ్రామానికి తిరిగి పొండి. దారిలో ఎక్కడైనా భైరవముఠా పొంచి వుండి దెబ్బతీయాలని చూస్తారేమో, తగు జాగ్రత్తలో వుండండి!" అన్నాడు.

గ్రామస్తులందరూ ఖడ్గ జీవదత్తులకు నమస్కారాలు చేశారు. భవాని ముందుకు వచ్చి వాళ్లిద్దరికీ తల వంచి నమస్కరించింది. జీవదత్తుడు ఆమెను ఆశీర్వదించి, కొండ దిగేందుకు భైరవులు పారిపోయిన వైపుకు కాక మరొక వైపుకు ఖడ్గవర్మతో బయలుదేరాడు.

వాళ్ళిద్దరూ ఒక నూరడుగుల దూరం నడిచి నడవక ముందే గణకుడు వెనక నుంచి పరిగెత్తుకుంటూ వాళ్ళ దగ్గిరకు వచ్చి, "మరేం అనుకోకండి, బాబులూ! మీలో వీరభద్రుడెవరు? రామభద్రుడెవరు?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు ఖడ్గవర్మ కోపంగా ఏదో జవాబివ్వబోయేంతలో జీవదత్తుడు అతణ్ణి వారించి, "గణకమహాశయా! మీరు ఆ వీర



భద్రరామభద్రుల సంగతి మరిచిపోండి. ఆ మహేంద్రనగరం రాజు కొడుకూ, వాడి మిత్రుల గొడవ మీ మనస్సుకూ, శరీరానిక్కూడా హాని కలిగిస్తుంది. మేం వీరభద్రులం రామభద్రులం కాదు. పదా!" అన్నాడు.

గణకుడు వాళ్ళకు మరోసారి నమస్కారం చేసి, ముఖం యింత చేసుకుని వెనుదిరిగి పోయాడు. ఖడ్గ జీవదత్తులు మిట్టపల్లాలుగా వున్న కొండను ఎంతో శ్రమకోర్చి దిగి, ఓ గంట తరవాత దాని పాదంలో వున్న అరణ్యాన్ని చేరారు. ఆ అరణ్యం రెండు ఎత్తయిన కొండల మధ్య వున్నది. అక్కడ నర సంచారం వున్న సూచనలు లేవు. ఎక్కడా వాళ్ళకు కాలిబాట లాంటిది కనిపించలేదు. క్రూరమృగాల కాళ్ళ గుర్తులు మాత్రం అంతటా కనిపించాయి.

"ఖడ్గా, ఇది చాలా యిరుకైన లోయలా వున్నది. మనం ఎదురుగా కనబడే ఆ కొండను సూర్యాస్తమయం లోపల దాటిపోగలమా అన్న అనుమానం నాకు కలుగుతున్నది." అన్నాడు జీవదత్తుడు.

"అంత ఎత్తు కొండ ఎక్కకుండా, దాన్ని దాటేందుకు ఎక్కడైనా సొరంగ మార్గాలున్నవేమో చూద్దాం!" అన్నాడు ఖడ్గవర్మ.

ఆ తరవాత యిద్దరూ ఆకాశాన్నంటుతున్నట్టున్న పెద్ద వృక్షాల కిందుగా కొండ కేసి నడవసాగారు. అలా వాళ్ళు పది పదిహేను నిమిషాలు నడిచేసరికి, ఒక నూరడుగుల ముందు ఏదో ప్రాణి నడుస్తున్న సూచనగా ఎండుటాకులు టపటప మంటూ శబ్దం చేసినై.

జీవదత్తుడు చప్పున ఆగి, "ఖడ్గా, ఏమరా నడిచేది? మనిషా? మృగమా?" అన్నాడు.

ఖడ్గవర్మ నిశ్శబ్దంగా చెట్ల చాటుగా కొంచెం ముందుకుపోయి, ఆ శబ్దం వస్తున్న వైపుకు చూశాడు. అక్కడ ఆజానుబాహుడైన యువకుడొకడు భుజాన గండ్రగొడ్డలి పెట్టుకుని, పది పన్నెండడుగుల లావు గల ఒక చెట్టు బోదె చుట్టూ పహరా తిరుగుతున్నాడు.

ఖడ్గవర్మకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఇన్ని మహా వృక్షాలున్న ఈ కారణ్యంలో ఒక్కగా నొక్క చెట్టుకు యీ కాపలా ఏమిటనిపించిం దతడికి. అతడు తల తిప్పి తన కేసి వస్తున్న జీవదత్తుడికి, నిశ్శబ్దంగా రమ్మని సౌంజ్ఞ చేశాడు. జీవదత్తుడు ఖడ్గ వర్మ దగ్గిరకు వచ్చి, చెట్టు నానుకుని నిల బడి పహరా యువకుణ్ణి చూశాడు.

"ఏదేదో రాజుగారి ఖజానాను కాపలా కాస్తున్నట్టు, యీ నట్టడవిలో చెట్టుకు పహరాయిస్తున్నాడేమిటి? వాడి ఖర్మకు వాణ్ణి వదిలి మన దారిన మనం పోదామా?" అన్నాడు జీవదత్తుడు.

"అలా కాదు. ఈ వింత ఏమిటో తెలుసు కుని పోదాం. లేకపోతే యీ వింతక్కారణం ఏమైవుండేదా అని బతికున్నన్నాళ్ళు ఆశ్చ ర్యంతో, సంశయంతో బాధ పడవలసి వస్తుంది." అన్నాడు ఖడ్గవర్మ.

"సరే, నువ్వు కాస్త పక్కగా పోయి, ఒక చుట్టు తిరిగి పహరావాడి చెట్టుకు ఆ వైపున నిలబడు. నేను సరాసరి వాణ్ణి యిటు నుంచి పోయి కలుసుకుంటాను," అన్నాడు జీవదత్తుడు.

ఖడ్గవర్మ బయలుదేరి ఒకటి రెండు నిమిషాల్లో చెట్టుకు అవతలి వైపు చేరి, ఒక చెట్టు చాటున కత్తి దూసి నిలబడ్డాడు. రాలి చెట్ల కింద పోగుగా పడిన ఎండుటాకుల్ని టపటప మని తొక్కుతూ జీవదత్తుడు యువకుడి కేసి నడిచాడు. ఆ శబ్దం వింటూనే యువకుడు తల తిప్పి తనను



సమీపిస్తున్న జీవదత్తుణ్ణి చూసి, "ఆగు! ఎవరు నువ్వు? యిక్కడ ఏం పని?" అని అడిగాడు గుడ్లురుముతూ.

"నే నెవరో చెప్పినా నీకు తెలియదు గనక ఆ సంగతి వదిలేద్దాం! ఇక పని సంగతి; ముందు నువ్వు ఆ చెట్టుకు ప్రదక్షిణం మీద ప్రదక్షిణం ఎందుకు చేస్తున్నావో చెపితే, తరవాత నే వచ్చిన పని చెప్తాను." అన్నాడు జీవదత్తుడు.

"ఇది చెట్టు కాదు — బాపగారి కోట బురుజు! ఇక్కణ్ణించి కొత్త వాళ్లెవరూ ఆయన రాజ్యంలోకి ప్రవేశించకుండా కాపలా కాస్తున్నాను," అన్నాడు యువకుడు గండ్రగొడ్డలి అంచును వేళ్ళతో రాకి చూస్తూ.

"ఏమనుకోకు. యిదంతా ఏదో తలతిక్క వ్యవహారంగా వుంది. నువ్వు యిక్కడ పహరా తిరక్కపోతే, యిక్కడ ఏదో కోట బురుజు వున్నదన్న అనుమానమే ఎవరికీ కలగదు. అరణ్యంలో ఎన్ని చెట్లు లేవు! అలాంటిదే నువ్వు పహరా యిచ్చే చెట్టు కూడా. కాని, నువ్వు గొడ్డలి భుజాన పెట్టి తిరుగుతూ ఆ రహస్యాన్ని నలుగురికీ చెప్తున్నావు," అన్నాడు జీవదత్తుడు.

"అట్టే వాగక యిక్కణ్ణించి కదులు. ఊఁ, పో!" అంటూ యువకుడు గొడ్డలి ఎత్తి జీవదత్తుడి కేసి ఒక అడుగు వేశాడు.

జీవదత్తుడు నవ్వుతూ, "నేనైతే పోతాను. సరే. నీ వెనక కత్తి దూసి ముందు కొస్తున్న పెద్ద మనిషి మాటేమిటి?" అన్నాడు.

యువకుడు చప్పున తల తిప్పి చూశాడు. ఖడ్గవర్మ అతడికి అయిదారడుగుల దూరంలో కత్తి ఝుళిపిస్తూ నిలబడి, "నువ్వు పరశురాముడి శిష్యుణ్ణనుకుంటున్నావా ఏం? ముందు ఆ గండ్రగొడ్డల్ని భుజాన వేలాడ వేసుకుని, చెట్టుబోదె కోటబురుజు ఎలా అవుతుందో, ఆ రహస్యం చెప్పు!" అన్నాడు.

యువకుడు తల తిప్పి యీసారి జీవదత్తుడి కేసి చూశాడు. జీవదత్తుడు అతడికి రెండు మూడడుగుల దూరంలో దండం ఎత్తిపట్టుకుని నిలబడి వున్నాడు.

—(ఇంకా వుంది)





# రాతిరథం

## 10

[భైరవులకు చిక్కి ప్రాణాపాయస్థితిలో వున్న జీవదత్తుణ్ణి, కవాని గ్రామస్థుల సాయంతో ఖడ్గవర్మ కాపాడాడు. భైరవులు అరణ్యంలోకి పారిపోయారు. గ్రామస్థులకు వీడ్కోలు చెప్పి, జీవదత్తుడూ, ఖడ్గవర్మా కొండ కింది లోయలోకి వెళ్ళారు. అక్కడ వాళ్ళకు యువకుడొకడు కనిపించాడు. ఖడ్గ జీవదత్తులు అతణ్ణి చుట్టుముట్టారు. తరవాత—]

ఖడ్గవర్మ కత్తి పైకెత్తి యువకుడి గుండెల కేసి గురిచేసి, నిలబడ్డాడు. జీవదత్తుడు కూడా దండాన్ని ఎత్తి పట్టుకుని కొంచెంసేపు ఆగి, యువకుడిలో ఎలాంటి చలనం లేకపోవటం చూసి, "ఏం, భయపడుతున్నావా? అంత భయస్తుడివి అంత పదునైన గండ్రగొడ్డలి ఎందుకు?" అన్నాడు హేళనచేస్తున్నట్టు.

ఆ మాటలకు యువకుడి ముఖం కోపంతో ఎర్రబడింది. అతడు పళ్ళు కొరుకుతూ అటూయిటూ తల తిప్పి, ఖడ్గ జీవదత్తుల్ని ఓమారు చూసి, "మీరు నా మీదికి దొంగదాటుగా వచ్చి పడ్డారు. అయినా నేను భయపడటం లేదు. ముందు మీలో ఎవర్ని యమలోకానికి పంపటమా అని ఆలోచిస్తున్నాను." అన్నాడు.

"అట్టే ప్రగల్భాలు పలకకు. ఈ పట్టి అడవిలో యీ చెట్టుకు ఎందుకు కాపలా కాస్తున్నావో చెప్పు!" అంటూ ఖడ్గవర్మ



చప్పున ముందుకు ఒకడుగు వేసి. యువకుడి కంఠాన్ని నరకబోయేవాడిలా కత్తిని ఝళిపించాడు.

ఖడ్గవర్మ ఎత్తు పారింది. యువకుడు గండ్రగొడ్డలిని ఎత్తి అతడి కేసి దూకబోయాడు. అదే అదనుగా జీవదత్తుడు ముందుకు పోయి దండాన్ని అతడి మోకాళ్ళకి అడ్డం పెట్టి వెనక్కు గుంజాడు. యువకుడు దభీమంటూ ముందుకు పడిపోయాడు. అతడి చేతిలోని గండ్రగొడ్డలి పట్టుతప్పి దూరంగా పోయిపడింది.

ఖడ్గవర్మ నవ్వుతూ గొడ్డలిని తీసుకుని భుజానికి తగిలించుకుని. "ఇప్పుడు మనం చేసింది ఎవరికీ ప్రాణాపాయం కలగని యుద్ధం. ఓపిక వుంటే లేచి నిలబడు, లేకపోతే ఆ చెట్టుబోదెకు చేరగిలబడి కూర్చో. అసలు సంగతి చెప్పు. బావగారెవరు? చెట్టు, గొడ్డళ్ళూ కాపటం ఏమిటి?" అని అడిగాడు.

"ప్రస్తుతానికి మీరే గెలిచారు, కాని ఆ రహస్యం తెలుసుకోవటంవల్ల మీకు మేలు కన్న కీడే ఎక్కువ కలుగుతుంది. ఆ మధ్య ఒకడికి చెప్పాను. వాడు బావగారి పెంపుడు సింహాలకూ, పులులకూ మేత అయి పోయాడు," అన్నాడు యువకుడు.

"ఓహో, ఇది మరీ చిత్రంగా వుంది! ఆ రహస్యం మేం తప్పక తెలుసుకోవాలి. త్వరగా చెప్పు. చీకటి పడేలోపల మేం ఆ ఎదురుగా వున్న కొండ దిగి పోవాలి." అన్నాడు జీవదత్తుడు.

"ఆ రహస్యం నేను చెపితే మీరు ఆ కొండా యీ కొండా మధ్యవున్న చిన్న మైదానంలో ఘోరమరణం పాలవుతారు." అన్నాడు యువకుడు.

ఖడ్గవర్మ కోపంగా గండ్రగొడ్డలిని తీసుకుని యువకుడితో, "తల నరకమంటావా? ఆ సంగతేదో చెపుతావా?" అన్నాడు.

యువకుడు ఖడ్గవర్మ ముఖంలోకి ఓసారి పరీక్షగా చూసి, అతడు అన్నంత పని చేస్తాడని భయపడిపోయి, "అయితే వినండి! ఈ చెట్టు బోదె పైకి అయిదారడుగులు




ఎక్కితే అక్కడ మీకొక తొర్ర కనబడుతుంది. ఆ తొర్రలో కొద్ది దూరం పాకుతూ పోయారంటే, ఒక సొరంగ మార్గం ఎదురవుతుంది. దాని వెంట పోతే అవతలి కొండను ఓ అరగంటలో సునాయాసంగా చేరవచ్చు. కాని దారిలో మీకు బావగారి మిట్టకోట తగులుతుంది. అక్కడ తప్పక మీకు నూకలు చెల్లిపోతాయి," అన్నాడు.

జీవదత్తుడు ఓ క్షణకాలం ఆలోచించి యువకుడి మాటల సారాంశం అర్థం చేసుకుని, "అంటే, యీ చెట్టు బోదెలోని రహస్య మార్గంకుండా మీ బావగారి కోటను ఎవరూ చేరకుండా యిక్కడ ఆ బురుజుల దగ్గర కాపలా కాస్తున్నావన్న మాట! ఆ ఎదురుగా వున్న కొండను చేరేందుకు నువ్వు చెప్పేది దగ్గిర దారిలా కనబడుతున్నది గనక, యీ మార్గానే పోతాం. దారి అడ్డగిస్తే మీ బావగారి సంగతి తేల్చుతాం!" అన్నాడు.

"అదేదో నేను రాత్రికి వచ్చి చూస్తాను. ఆయన కంటపడి సూర్యాస్తమయం వరకూ బతికుంటే మీ కిద్దరూ మహా వీరుల కిందే లెక్క!" అన్నాడు యువకుడు.

ఖడ్గ జీవదత్తులు అతడి మాటలకు నవ్వుకుని చెట్టు ఎక్కారు. యువకుడు చెప్పినట్టే వాళ్ళకు చెట్టు బోదెలో ఒక పెద్ద తొర్ర కనిపించింది. ముందు జీవదత్తుడు దానిలో ప్రవేశించి బోర్లా పడుకుని ముందుకు పాకసాగాడు. ఖడ్గవర్మ తాను కూడా తొర్రలోకి వెళ్ళే ముందు యువకుడికి అతడి గండ్రగొడ్డలిని యిచ్చివేస్తూ, "నువ్వు చీకటి పడేలోపలే మీ బావగారి సంస్థానానికి రావటం మంచిది. బహుశా నువ్వు వచ్చేసరికి, ఆయన మిట్టకోట నేల మట్టం అయి వుంటుంది." అన్నాడు.

యువకుడు ఏదో అన్నాడుగాని తొర్ర వెంట ముందుకు పాకి పోతున్న ఖడ్గ జీవదత్తులకు ఆ మాటలు వినిపించ లేదు. వాళ్ళు ఓ పది నిమిషాల కాలం అలా పోయింతరవాత వాళ్ళ దారిని అడ్డగిస్తూ ఒక బండరాయి—నాలుగు పలకలుగా వున్నది



ఎదురైంది. మసక చీకట్లో జీవదత్తుడు దాన్ని తడిమి చూశాడు. రాతి మధ్య అతడికి ఒక మేకు లాంటిది తగిలింది. అతడు దాన్ని రెండు చేతులతో గట్టిగా పట్టుకుని వెనక్కు లాగాడు. రాయి వూడి వచ్చింది. వాళ్ళకు ఎదురుగా సొరంగ మార్గం కనిపించింది.

"ఖడ్గా, ఇక మనం యీ సొరంగ మార్గం వెంట వంగి నడిచి పోవచ్చులా వుంది. ఎందుకైనా మంచిది, ఆయుధాలు సిద్ధంగా వుంచుకుని, నా వెనక జాగ్రత్తగా నడువు," అంటూ జీవదత్తుడు లేచి నిలబడి సొరంగంలో ప్రవేశించాడు.

సొరంగ మార్గం అంత చీకటిగా లేదు. అందుక్కారణం అవతలి వైపు ద్వారానికి ఏ రాళ్ళలాటివీ అడ్డం లేకపోవటమే. ఖడ్గ జీవదత్తులు కొద్ది సేపటికల్లా సొరంగం అవతలి వైపుకు చేరారు. ఎదురుగా వాళ్ళకు చిన్న మైదాన ప్రదేశంలాంటిది కనిపించింది. అక్కడ అంతగా చెట్లు లేవు. సొరంగ ద్వారానికి కొద్ది దూరంలో ఒక చుట్టు గుడిసె లాటిది వున్నది. దానికి కొంచెం ఎడంగా కొన్ని కట్టడాలు—పశువుల కొట్టాలలాటివి వున్నవి. వాటిని ఆనుకుని ఒక ఎత్తయిన రాళ్ళగుట్ట. దానిమీద పెద్ద రాళ్ళతో కట్టిన ఒక పెద్ద భవంతి వాళ్ళకు కనిపించింది.

"ఇదా ఆ కుర్రవెధవ చెప్పిన బావగారి మిట్టకోట! ఇతడు లోయ మధ్య నివసిస్తున్న తీరూ, గుట్టమీది రాతికట్టడం చూస్తూంటే—వీడు ఏదో రాక్షసుడై వుంటాడని నాకు అనుమానం కలుగుతున్నది!" అన్నాడు జీవదత్తుడు.

"రాక్షసుడే కావచ్చు! అయినా మనం యింత దూరం వచ్చి వెనక్కు తిరిగి పోవటం లేదుకదా?" అన్నాడు ఖడ్గవర్మ.

"అదెలా కుదురుతుంది? మనం పొద్దుటి నుంచి దాదాపు ఉపవాసం చేస్తున్నాం. అదుగో సూర్యుడు అస్తమించడానికి మరెంతో కాలం లేదు. మనం యీ రాత్రికి బలప్రయోగం చేసి అయినా, యీ మిట్ట కోట రాజావారికి అతిథులుగా వుండక తప్పదు!" అన్నాడు జీవదత్తుడు నవ్వుతూ.

ఆ తరవాత ఇద్దరూ దాపులనున్న చుట్టు గుడిసె కేసి బయలుదేరారు. అందులో కొంచెంసేపు విశ్రాంతి తీసుకుని మిట్ట మీద వున్న కవనానికి పోవాలని వాళ్ళ ప్రయత్నం.

ఖడ్గ జీవదత్తులు చుట్టు గుడిసెకు యింకా నూరూ నూటయిరవై గజాల దూరంలో వుండగా గుడిసె వైపునుంచి ఒక స్త్రీ ఆర్తనాదం వినిపించింది. ఆ వెంటనే సింహం గర్జించిన శబ్దం వినవచ్చింది. ఖడ్గ జీవదత్తులు ఓ క్షణకాలం నివ్వెరపోయి, అంతలోనే తేరుకుని ఆ ధ్వని వచ్చిన వైపుకు పరిగెత్తబోయేంతలో, ఒక స్త్రీ గుడిసెలోంచి కేకలు పెడుతూ బయటికి పరిగెత్తుకు వచ్చింది. ఆమెను వెన్నంటి ఒక సింహం కూడా బయటికి వచ్చింది.

జీవదత్తుడు, ఖడ్గవర్మను హెచ్చరించి వేగంగా పరిగెత్తిపోయి స్త్రీకి, సింహానికి మధ్య నిలబడ్డారు. స్త్రీ చిన్నగా ఒక కేక పెట్టి గుట్ట మీది లవంతి కేసి పరిగెత్తుతూ, "సింహానికి హాని కలిగించకండి! మా ఆయన మిమ్మల్ని బతకనివ్వరు!" అంటూ అరిచింది.

ఈ హెచ్చరిక జీవదత్తుణ్ణీ ఖడ్గవర్మనూ చాలా ఆశ్చర్యపరిచింది. సింహం నుంచి ప్రాణం కాపాడుకునేందుకు పరిగెత్తుకుపోయే స్త్రీ యిలా హెచ్చరించటం ఏమిటి? కాని, జీవదత్తుడికి యీ వింత హెచ్చరిక గురించి ఆలోచించే అవకాశం లేదు. సింహం అతని కేసి ఒకసారి పెద్దగా గర్జించి, మీదికి దూకింది. కాని, జీవదత్తుడు





చప్పున పక్కకు తప్పుకుని, అది తిరిగి తన మీద పడబోయే లోపల దాని వీపు మీదికి ఎగిరి కూర్చున్నారు.

సింహం చెవులు చిల్లులు పడేలా గర్జిస్తూ, వెనక కాళ్ళ మీద లేచి జీవదత్తుణ్ణి కింద పడవేయాలని చూసింది. తల తిప్పి అతణ్ణి నోట పట్టాలని చూసింది. కాని, జీవదత్తుడు దాని నోటికి అందకుండా, చేతిలోని దండంతో దాని తల మీదా, గవదల మీదా కొట్టసాగాడు. అది మరింతగా అరుస్తూ ఆ మైదాన ప్రదేశాన్నంతా కలయ తొక్కసాగింది.

ఖడ్గవర్మ ఆ దృశ్యం చూసి ఉత్సాహంగా, "జీవా, దాన్ని చంపకు! కొంచెం శిక్షణ ఇస్తే దాన్ని మనం అవసరానికి అశ్వం లాగా వాడుకోవచ్చు ననుకుంటాను." అన్నాడు.

సింహం బారినుంచి పారిపోయిన స్త్రీ భవంతి వున్న గుట్టమీదికి కొంత దూరం పోయి అక్కడ నిలబడి, గుట్ట మలుపు కేసి చేయి చూపుతూ, "అదుగో, మా ఆయన వేట నుంచి తిరిగివస్తున్నారు. మీరు వెంటనే ఉక్కళ్ళించి పారిపోండి. మిమ్మల్ని చూశాడో, మీకు చావు తప్పదు!" అని కేక వేసింది.

ఖడ్గవర్మ స్త్రీ చూపిన వైపుకు తలతిప్పి చూశాడు. ఎనిమిది తొమ్మిది అడుగుల ఎత్తున్న ఒక మహా కాయుడు, చేతిలో ఒక రాతి గద పట్టుకుని, ఒక లేడిని, అడవి పందిని ఒక భుజాన వేసుకుని, రెండవ భుజానికి కుందేళ్ళూ, అడవి పక్షులూ వున్న వల తగిలించుకుని, తమకేసే వస్తున్నారు. అతడికి ముందూ వెనకా నాలుగైదు సింహాలూ, పెద్ద పులులూ నడుస్తున్నవి. వాటి మెడల్లో వున్న తోలు పట్టెలను పట్టి: అవి ఆ మహాకాయుడు వేటకు ఉపయోగించే పెంపుడు జంతువుల్లా కన బడుతున్నవి.

ఆ మహాకాయుడి దృష్టికి ముందు సింహం మీద కూర్చుని వున్న జీవదత్తుడు కనిపించాడు. అతడికి కలిగిన ఆశ్చర్యం అంతా యింతా కాదు. అంతలో అతడి దృష్టి

కత్తి దూసి తన స్నేహితుని కేసి వస్తున్న ఖడ్గవర్మ పైన పడింది.

ఆ వెంటనే మహాకాయుడు భుజాన వేలాడుతున్న వేట జంతువుల్ని కింద పడవేసి, దాని గదను ఎత్తి పట్టుకుని, ఖడ్గ జీవదత్తుల కేసి పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వస్తూ, "ఎవర్రా మీరు? అల్పాయుష్కుల్లా వున్నారు! నా పెంపుడు సింహం మీదే స్వారి చేస్తున్నారా?" అన్నాడు ఉరుములాంటి పెద్ద గొంతుతో.

"ఈ సింహాన్నుంచి నీ భార్యను కాపాడాను. నిజమో అబద్ధమో ఆ మెట్టు మీద నిలబడి వున్నది, అడుగు!" అంటూ జీవదత్తుడు సింహం తలమీద దండంతో బలంగా ఒకసారి మోది, దాని వీపు మీదినుంచి కిందికి దూకేశాడు.

మహాకాయుడు తన భార్య కేసి చూశాడు. ఆమె గబగబా తన భర్త దగ్గిరకు వచ్చి, జరిగిందంతా చెప్పి, "వీళ్ళిద్దర్నీ ప్రాణాలతో వదులు. వాళ్ళదారిన వాళ్ళు పోతారు!" అన్నది.

"ఎలా వదలటం! వీళ్ళు నా రాజ్యంలో రహస్యంగా ప్రవేశించారు గదా? అక్కడ చెట్టు దగ్గిర కావలి కాస్తున్న నీ తమ్ముడు-ఆ సోమరి వెధవ ఏం చేస్తున్నట్టు?" అంటూ ఆగి, మహాకాయుడు ఏదో అనుమానం వచ్చిన వాడిలా, ఖడ్గ జీవదత్తుల్ని



పరీక్షగా చూస్తూ, "అన్నట్టు మీరు అరణ్యంలో చెట్టు కాపలా వున్న నా దావ మరిదిని చంపి, ఇక్కడికి రాలేదుగదా?" అని ప్రశ్నించాడు.

"ఆ అవసరం కలగలేదు. తనకైతనే మాకు ఇక్కడికి వచ్చే దారి చూపించాడు. గండ్రగొడ్డల్ని కూడా తిరిగి ఇచ్చేశాం," అన్నాడు జీవదత్తుడు.

"సరే, అయితే వచ్చిన దారినే తిరిగి పొండి. మళ్ళీ బతికుండగా ఎన్నడూ ఇటు రాకండి. నా భార్య దయాభిక్ష వేడింది కనక మిమ్మల్ని ప్రాణాలతో వదులుతున్నాను," అన్నాడు మహాకాయుడు పళ్ళు కొరుకుతూ.

అతడి యీ మాటలు ఖడ్గవర్మకు ఎక్కడ లేని కోపాన్ని తెప్పించినై. అతడు జీవదత్తుడి కేసి ఓమారు చూసి కత్తి పైకెత్తి, "మాకు ఎవరి దయాభిక్షా అవసరం లేదు. నువ్వు కండకావరంతో వున్నట్టున్నావు. నిన్ను యీ కత్తితో రెండు మూడు నిమిషాల్లో నాలుగైదు ముక్కలుగా నరకగలను!" అన్నాడు.

ఖడ్గవర్మ యిలా అనగానే మహాకాయుడు పెద్దగా హుంకరించి గద పైకెత్తి అతడి మీదికి రాబోయాడు. కాని అతడి భార్య గట్టిగా చేయి పట్టుకుని, "ఇది ధర్మయుద్ధం అనిపించుకోదు. వీళ్ళు మహా శూరుల్లాగే కనబడుతున్నారు. మీ యిద్దరూ గుర్రాలెక్కి యుద్ధం చేయండి. అప్పుడు పరాక్రమం, నేర్పు వున్నవాళ్ళు జయిస్తారు." అన్నది.

ఆ మాటల్తో మహాకాయుడు కొంచెం స్థిమితపడ్డాడు. అతడు ఖడ్గ జీవదత్తులతో, "నా భార్య చెప్పింది బాగానే వున్నది. ఈ రాత్రికి మీరు నాకు అతిథులుగా వుండండి. సూర్యోదయం కాగానే మీకు నా అశ్వశాలలో నుంచి మీరు కోరిన అశ్వాన్ని యిస్తాను. నేనూ ఒక అశ్వాన్ని తీసుకుంటాను. నా ఆయుధాగారం నుంచి మీరు కోరిన ఆయుధం యిస్తాను. మీలో ఎవరు నాతో మొదటగా పోరాడతారు?" అన్నాడు.

"మొదటగా చివరగా కూడా నేనే నేనే యుద్ధం చేయబోతున్నాను. నాకు అశ్వాన్ని యిస్తేచాలు. ఈ దండమే నా ఆయుధం! నువ్వు నన్ను ఓడిస్తే, నా మిత్రుణ్ణి కూడా ఓడించినట్టే!" అన్నాడు జీవదత్తుడు.

"ఆహా, నీ ధైర్యానికి మెచ్చుకున్నాను. ఇక నా వెంట మిట్టకోటకు రండి!" అన్నాడు మహాకాయుడు.

ఖడ్గ జీవదత్తులు అతడి వెంట గుట్ట మీది భవనానికి బయలుదేరారు. మహాకాయుడు తాను వేటాడి తెచ్చిన జంతువుల్ని, పక్షుల్ని భుజాన వేసుకుని, వెంట వున్న పెంపుడు సింహాల్ని, పులుల్ని పశుల కొట్టాలలోకి తోలి, కొద్ది సేపటికల్లా మిట్ట మీది భవనాన్ని చేరాడు. —(ఇంకావుంది)





**11**

[చెట్టుకు కాపలాకాస్తున్న యువకుడు, ఖడ్గ జీవదత్తులకు చెట్టుతొర్రలో నుంచి వున్న రహస్య మార్గం సంగతి చెప్పాడు. వాళ్ళు దాని వెంటపోయి ఒక మిట్టకోట ప్రాంతాన్ని చేరి, అక్కడ సింహం బారినుంచి ఒక స్త్రీని కాపాడారు. ఆమె భర్త అడవి నుంచి వేటాడిన జంతువులతో తిరిగి వచ్చి, వాళ్ళను తన భవనానికి తీసుకుపోయాడు. తరవాత—]

మహాకాయుడు, ఖడ్గ జీవదత్తులకు తన భవనంలోని ఒక పెద్ద గది చూపించి, "ఇదుగో, యిది మీ విడిది గది. వంటకవసరం అయిన సరంజామా అంతా లోపల వున్నది. కొద్ది సేపట్లో యీ వేటమాంసం మీకు కావలసినంత నా భార్య తెచ్చి యిస్తుంది," అని చెప్పి, జవాబు కోసం ఆగకుండా మెట్లెక్కి భవనం మీదికి వెళ్ళిపోయాడు.

ఖడ్గ జీవదత్తులు ఆ గదిలో ప్రవేశించి వంట ప్రయత్నాలు ప్రారంభించి, రాత్రి తొమ్మిది గంటలకల్లా తృప్తిగా భోజనాలు చేసి, నిద్రకు ఉపక్రమించారు. వాళ్ళకు ఒక రాత్రివేళ గది బయట అడుగుల చప్పుడు వినిపించింది. ఎవరై వుంటారా అని వాళ్ళు ఆలోచించేంతలో, "బావగారూ! ఆ పొగరుబోతు కుర్రవెధవలు యిక్కడికి వచ్చారా? వాళ్ళ శవాలెక్కడ? ఇంకా



వాళ్ళు ప్రాణాలతో వుంటే, యీ గండ్ర గొడ్డలికి బలిపెడతాను!" అన్న మాటలు వినిపించినై.

ఆ గొంతు అడవిలో చెట్టుకు పహరా తిరిగే గండ్రగొడ్డలి యువకుడిది! ఖడ్గ జీవదత్తులు ఆ గొంతు పోల్చుకున్నారు. ఖడ్గవర్మ తన పక్కనే వున్న కత్తిని ఒరలో నుంచి బయటికి లాగి ద్వారం దగ్గరకు పోయి తలుపు తెరిచాడు.

భవనం మెట్ల దగ్గరకు పోతున్న గండ్రగొడ్డలి యువకుడు తన వెనక వైపున కిర్రుమంటూ తలుపు తెరుచుకున్న శబ్దం వింటూనే గిరుక్కున వెనుదిరిగి చూశాడు. వెన్నెల వెలుగులో అతడికి ఖడ్గవర్మ కనిపించాడు; అతడి చేతిలోని కత్తి తళతళ మెరుస్తున్నది.

"అరెరె, ఎవడివి నువ్వు? .... వాడివా, వాడి భూతానివా? మిట్టకోటకు వచ్చి రాత్రి నిద్రచేసిన వాడెవడూ యింతవరకు లేడు!" అన్నాడు యువకుడు గండ్రగొడ్డలిని పైకెత్తి పట్టుకుని.

"ఒరే, అర్భకుడా, అట్టే వాగక పోయి బుద్ధిగా పడుకుని నిద్రపో. మళ్ళీ నీ కేకల్తో నిద్రాభంగం కలిగించావో, నీ చర్మం ఒలిచేస్తాను." అన్నాడు ఖడ్గవర్మ కోపంగా ద్వారబంధం దాటి బయటికివస్తూ.

యువకుడు కాస్త బెదిరి మరో రెండు మూడు మెట్లు గబగబా ఎక్కి, "చర్మం ఒలుస్తావా? నన్నేదో సింహమో, పులో అనుకుంటున్నావా? చూడు నిన్నిప్పుడే నా గండ్రగొడ్డలికి...."

యువకుడు మాట ముగించే లోపలే మెట్ల పై భాగం నుంచి మహాకాయుడు విసిరిన ఒక పెద్ద బొమికె వచ్చి అతడి వీపుకు రపీమంటూ తగిలింది. యువకుడు అదిరిపడి తలఎత్తి చూసేంతలో మహాకాయుడు పైన నిలబడి అతడి కేసి చూస్తూ, "ఎందుకు జంగుపిల్లిలా ఒకటే అరుపు ప్రారంభించావు? ఈ సమయంలో నేను భోజనం చేస్తుంటానని నీకు తెలియదా?" అన్నాడు కోపంగా.

యుపకుడు ఒకటికి రెండుసార్లు తన బావ కేసీ, ఖడ్గవర్మ కేసీ తల తిప్పి చూసి, "చెట్టు దగ్గిర నా చేత తన్నులుతిని పారిపోయి వచ్చిన వాళ్ళను నువ్వింకా ఎందుకు బతికుండనిచ్చావు? ఆ రెండో వాడేడీ?" అన్నాడు.

ఖడ్గవర్మ కత్తి ఝుళిపిస్తూ మెట్లు కేసి బయలుదేరాడు. యుపకుడి మాటల తీరు అతడికి చాలా అమర్యాదకరంగా కనిపించింది. అతన్నీ, అడ్డువస్తే మహాకాయుణ్ణీ ఆ రాత్రే తుదముట్టించాలన్నంత కోపం వచ్చింది అతడికి.

మహాకాయుడు ఖడ్గవర్మను చూసి ఆగమన్న సూచనగా చేతులు పైకెత్తి, "నా బావమరిది మాటలు అంతగా పట్టించుకోకు. ఎంతో కాలంగా నా బోటి గంధర్వుడి సాహచర్యంలో వున్నా, వీళ్ళ మనిషి బుద్ధులు మారలేదు. ఆడుకోవటానికి వచ్చిన పెంపుడు సింహాన్ని చూసి, వీడి అక్క ప్రాణభయంతో పరిగెత్తింది. వీడు అరణ్యంలో మీ చేత ఒళ్ళు హూనం చేయించుకుని, నా అనరాతో మిమ్మల్ని సాధించాలని చూస్తున్నాడు. ఏమైనా యీ రాత్రికి మీరు నా అతిథులు. పోయి పడుకో. ఈ కుర్రకుంక సంగతి నేను చూస్తాను," అన్నాడు.

ఖడ్గవర్మ మారు మాట్లాడకుండా వెనుదిరిగి గదిలోకి పోయి, తలుపు మూసేశాడు. బయట చెలరేగిన గలభా అంతా ఆలకిస్తున్న జీవదత్తుడు, ఖడ్గవర్మ గదిలోకి రాగానే,





"ఏమిటి, ఖడ్గా! ఆ మహాకాయుడు తాను గంధర్వుణ్ణని చెప్పినట్టుందే!" అన్నాడు సాలోచనగా.

"....అనే చెప్పుతున్నాడు. నయం.... దేవుణ్ణనలేదు!" అంటూ ఖడ్గవర్మ కత్తిని తిరిగి ఒరలో పెట్టి పక్కమీదికి పోయి పడుకున్నాడు.

"ఖడ్గా, అతడి మాటల్ని మరీ అంత చులకనగా కొట్టెయ్యకు. అంత అజానుబాహువూ, సింహాల్ని, పులుల్ని మచ్చిక చేసి వేట కుక్కల్లాగా ఉపయోగించేంత శక్తి వున్నవాడూ — కేవలం మామూలు మనిషై వుండడు. మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా అతడు యీ రహస్య ప్రదేశంలో వుంటున్న తీరు చూశావా?" అన్నాడు జీవదత్తుడు.

"నీ మాటలు వింటూంటే, యీ మహాకాయుడు తాను చెప్పుతున్నట్టు గంధర్వుడు కాకపోయినా, ఏదో అర్ధ గంధర్వుడైనా అయి వుంటాడని అనుమానం కలుగుతున్నది. రేపు ఉదయం జరగబోయే ద్వంద్వయుద్ధంలో అతణ్ణి తేలిగ్గా నువ్వు జయించగలవు 'గదా?'" అని అడిగాడు ఖడ్గవర్మ.

ఆ ప్రశ్నకు జీవదత్తుడు పెద్దగా నవ్వి, "జయించగలను. కాని తేలిగ్గానా, లేక ఎంతో శ్రమపడా అన్నది యిప్పుడు చెప్పటం కష్టం. నేను నా యుద్ధ ప్రావీణ్యాన్నే కాక, మంత్రశాస్త్ర పాండిత్యాన్ని కూడా పూర్తిగా ఉపయోగించవలసి రావచ్చు. అతణ్ణి చంపకుండా లోబరుచుకుని, అతణ్ణుంచి కొన్ని రహస్యాలు లాగవచ్చునుకుంటాను. అతడు నిజంగా గంధర్వుడైతే వింధ్యపర్వత ప్రాంతాల్లో వున్న రాతిరథాన్ని గురించిన సమాచారం మనకు కొంత చెప్పగలడు," అన్నాడు.

"నువ్వు ఊహించేవంతా నిజం అయితే ఎంత బావుంటుంది! ఆ రాతిరథాన్ని వెతికే శ్రమ తప్పుతుంది. సరే, నాకు నిద్ర ఆగటం లేదు." అంటూ ఖడ్గవర్మ కళ్ళు మూసుకున్నాడు.



జీవదత్తుడు మర్నాటి ఉదయం తాను మహాకాయుడితో చేయనున్న యుద్ధాన్ని గురించి ఆలోచించుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

సూర్యోదయం అవుతూండగానే మహాకాయుడు వచ్చి ఖడ్గ జీవదత్తులు నిద్రిస్తున్న గది తలుపు తట్టాడు. ఖడ్గవర్మ వెళ్ళి తలుపు తీశాడు. మహాకాయుడు అతడికి మిట్టకోట దిగువున వున్న ఒక కొండ వాగు గురించి చెప్పి, "ఆలస్యం కాకుండా స్నానాలూ అవీ ముగించుకు రండి. నేను వేటకు వెళ్ళే లోపలే మిమ్మల్ని నా పెంపుడు జంతువులకు ఆహారంగా వేయాలి!" అన్నాడు.

"ఓహో, రాత్రి గడిచిపోయింది గనక యిక మేం నీకు అతిథులం కాదన్న మాట! సరే, ఒక గంట లోపలే వస్తాం, నువు యుద్ధానికి సిద్ధంగా వుండు!" అన్నాడు ఖడ్గవర్మ.

మహాకాయుడు మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఖడ్గవర్మ తన మిత్రుణ్ణి నిద్ర లేపి, మహాకాయుడు పలికిన పరుష వాక్కుల సంగతి చెప్పాడు. జీవదత్తుడు మౌనంగా తలాడించి వూరుకున్నాడు. తరవాత యిద్దరూ భవనం మెట్లు దిగి మైదాన ప్రదేశం దాటి ఒక కొండవాగును చేరారు. అక్కడ వాళ్ళు వాగులో స్నానాలు చేసి, దాపుల నున్న ఫలవృక్షాల నుంచి కాయలు కోసుకు తిని, తిరిగి మిట్టకోట కేసి బయలుదేరారు.

మిట్టకోట కింద వున్న పశువుల కొట్టాల దగ్గిర మహాకాయుడూ, అతడి భార్యా, గండ్ర గొడ్డలి యువకుడూ వాళ్ళకు ఎదురయ్యారు. మహాకాయుడు జీవదత్తుణ్ణి పలకరించి, "ఇదుగో, యీ పక్కనే వున్న అశ్వశాలలో నుంచి నీకు నచ్చిన అశ్వాన్ని తీసుకో," అన్నాడు.

జీవదత్తుడూ, ఖడ్గవర్మా అశ్వశాలలో ప్రవేశించారు. అక్కడ వాళ్ళకు పది పన్నెండు ఉత్తమజాతి అశ్వాలు కనిపించినై. జీవదత్తుడు వాటి వీపుల మీద చేతితో



గట్టిగా తట్టి చూసి బలం, వేగం రెండూ వున్నవని భావించిన ఒక అశ్వాన్ని కట్టు విప్పి బయిటికి తీసుకు వచ్చాడు.

మహాకాయుడు జీవదత్తుడు తెచ్చిన అశ్వాన్ని చూసి, "ఆహా, నువ్వు నా దగ్గిర వున్న అశ్వాల్లో ఉత్తమమైనదాన్నే ఎన్నుకున్నావు. ఎన్నో ఏళ్ళ క్రిందట నా తల్లిదండ్రులు దీని పూర్వీకుడి మీదే ఎక్కి, వింధ్యపర్వత ప్రాంతాలనుంచి యిక్కడికి వలస వచ్చారు." అన్నాడు.

"అలాగా! అయితే నీ బల గర్వం పోగొట్టిన తరవాత నేను దీని మీదే స్వారీ అయి, నా మిత్రుడితో ఆ పర్వత ప్రాంతాలకే పోతాను," అన్నాడు జీవదత్తుడు.

ఆ మాట మహాకాయుడికి చాలా కోపం తెప్పించింది. అతడొకసారి మీసం మెలివేసి, జీవదత్తుడి కేసి గుడ్లురుముతూ చూసి అశ్వశాలలోకి పోయి, అశ్వాన్నొకదాన్ని బయిటికి తెచ్చాడు. తరవాత అతడి ఆజ్ఞ కాగానే గండ్రగొడ్డలి యువకుడు రెండు అశ్వాలకూ జీను వేసి, కళ్ళాలు తగిలించాడు. మహాకాయుడూ, జీవదత్తుడూ తమ తమ అశ్వాలను ఎక్కి కూర్చున్నారు. మహాకాయుడి చేతిలో ఒక గద వున్నది. జీవదత్తుడి చేతిలో ఎప్పుడూ వుండే దండం మాత్రమే వున్నది.

"ఇంతవరకూ నీ పేరేమిటో నాకు తెలియదు. నిన్ను యమపురికి పంపే ముందు పేరు తెలుసుకోవాలని వున్నది. నీ పేరేమిటి?" అని అడిగాడు మహాకాయుడు.

"నా పేరు జీవదత్తుడు, నా మిత్రుడి పేరు ఖడ్గవర్మ. నిన్ను నేను చంపదలచుకోలేదు. కాళ్లూ చేతులూ విరగ్గొట్టి వదలదలుచుకున్నాను. అయినా పేరు తెలుసుకోవటం మంచిది గదా. నీ పేరేమిటి?" అన్నాడు జీవదత్తుడు.

"నా పేరు వసుమతి. ఇంకో క్షణంలో యీ లోకాన్ని వదలబోయే నీకు నా పేరు తెలుసుకున్నందువల్ల ప్రయోజనం ఏమిటి? కాచుకో!" అంటూ మహాకాయుడు గద పైకెత్తి గుర్రాన్ని ముందు ఉరికించాడు.

ఆ రెండు గుర్రాల మధ్యా దాదాపు నూరడుగుల దూరం వున్నది. వసుమతి తన గుర్రాన్ని అదిలించగానే, జీవదత్తుడు కూడా తన గుర్రాన్ని అదిలించాడు. రెండూ వేగంగా ముందుకు దూకినై. వసుమతి తనను సమీపిస్తుండగా, జీవదత్తుడు తన గుర్రం కళ్ళెం పక్కకు లాగి, వసుమతి గుర్రం తన గుర్రం పక్కగా పోయే సమయంలో తన దండంతో, వసుమతి తల మీద బలంగా కొట్టాడు. వసుమతి గదతో జీవదత్తుడి తల మీద కొట్టాలని చూశాడు గాని, జీవదత్తుడు చప్పున తల వంచుకుని ఆ దెబ్బ తప్పుకున్నాడు.

జీవదత్తుడి దండం దెబ్బతో వసుమతి తల గిర్రున తిరిగి పోయింది. సామాన్య మానవుడి చేతికి అంత బలం వుంటుందా అనిపించిం దతడికి. బహుశా ఆ దండంలో ఏదో మంత్రశక్తి వుండవచ్చును కున్నా డతడు. లేకపోతే సాధారణ యువకు డొకడు తన మీద ద్వంద్వయుద్ధానికి తల పడటం అంటే ఎన్ని గుండెలు కావాలి?

ఈ సారి వసుమతి తన గుర్రాన్ని జీవదత్తుడి కేసి దూకిస్తూ, "ఓ జీవదత్తా! నువ్వు చూడబోతే క్షత్రియ యువకుడి వేషంలో వున్న బ్రాహ్మణ మంత్రవేత్తలా వున్నావు. నిజం చెప్పు. నువ్వు క్షత్రియుడివా, బ్రాహ్మణుడివా? బ్రాహ్మణుడివైనా నిన్ను చంపక వదలను," అంటూ గదను ముందుకు సాచి జీవదత్తుడి గుండెల మీద పొడవబోయాడు.



జీవదత్తుడు ఏదో మంత్రాన్ని పెద్ద గొంతుతో ఉచ్చాటన చేస్తూ వసుమతి గదను ఎడమచేత్తో పక్కకు తోసి, కుడి చేతిలో వున్న దండంతో గుర్రం మెడ మీద గట్టిగా మోదాడు. ఆ దెబ్బకు గుర్రం తల నేలను తాకింది. దాని వెనకకాళ్ళు రెండూ గాలిలోకి లేచినై. అది దభీమంటూ ముందుకు పడేలోపల వసుమతి పట్టు తప్పి, దానికన్న ముందుగా నేల మీద పడి ఆరుస్తూ అంతదూరం దొర్లుకుపోయాడు.

జీవదత్తుడు తన గుర్రం మీదినుంచి దూకి, లేచి నిలబడేందుకు ప్రయత్నిస్తున్న వసుమతిని సమీపించి దండం ఎత్తి, "ఈ పాటుకు ఏదో ఒక్క కాలు మాత్రమే విరిగిందనుకుంటాను. ఆ గద పట్టుకునే చెయ్యి కూడా విరగ్గొట్టమంటావా? లేక లొంగిపోతావా?" అన్నాడు.

వసుమతి మౌనంగా మరొకసారి లేచి నిలబడే ప్రయత్నం చేశాడు. కాని, సాధ్యం కాలేదు. అప్పుడతడు, జీవదత్తుడి ముఖంలోకి ఏమాత్రం కోపం లేకుండా చూస్తూ, "విరిగింది కాళ్లూ చేతులూ కాదు, నా నడుం. నువ్వే గెలిచావు! నీ మంత్రశక్తికీ, బాహుబలానికీ మెచ్చుకున్నాను. నీలాటివాడు ఒక్కడున్నట్టయితే, యుకులకు ఓడి నా తండ్రిలాంటి వాళ్ళు వింధ్యపర్వతాలు వదిలి యిక్కడికి పారిపోయి రావటం జరిగేది కాదు." అన్నాడు.

వసుమతి మాటలకు జీవదత్తుడు ఆశ్చర్యపోతూ ఏదో అనబోయేంతలో ఖడ్గవర్మ పెద్దగా కేక పెట్టటం వినిపించింది. అంతవరకూ యీ ద్వంద్వయుద్ధాన్ని చూస్తూ నిలబడిన గండ్రగొడ్డలి యువకుడు, తన బాప నేల కూలగానే, ఎక్కడలేని కోపంతో జీవదత్తుణ్ణి చంపేందుకు గొడ్డలి ఎత్తి అతడికేసి రాసాగాడు. ఖడ్గవర్మ ఆగమని ఒకసారి అతణ్ణి హెచ్చరించి, అందువల్ల ప్రయోజనం లేక పోవటంతో ముందుకు దూకి, కత్తి పిడితో అతడి తల మీద గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకు యువకుడు ఒక చావుకేక పెట్టి విరుచుకుని ముందుకు పడిపోయాడు.

—(ఇంకా వుంది)






## 12

[ఖడ్గ జీవదత్తులకు రాత్రి రథ భవనంలో ఆతిథ్యం యిచ్చిన వసుమతి అనే గంధర్వయువతి మర్నాటి ఉదయం జీవదత్తుడితో ద్వంద్వయుద్ధానికి పూనుకున్నారు. జీవదత్తుడు అతణ్ణి గుర్రం మీది నుంచి కిందికి పడదోశాడు. వసుమతికి సహాయంగా గంధ్రగార్తరి యువకుడు వచ్చాడు. ఖడ్గవర్మ అతడి నెత్తిన కత్తిపిడితో గట్టిగా కొట్టాడు. తరవాత—]

తన బావమరిది దాళ్ళ-కేక పెట్టి కింద పడటం చూస్తూనే వసుమతి పెద్దగా నవ్వుతూ, "ఖడ్గవర్మా! మంచి పని చేశావు. ఏ దెబ్బకు వాడి తల పగిలి వుండదు. అది నల్లరాతికన్నా గట్టిది," అన్నాడు.

జీవదత్తుడికి ఆ మాటలు చాలా నవ్వు తెప్పించినై. కాని అదే సమయంలో అతడికి గంధ్రగార్తలి యువకుడి మీద జాలి కూడా కలిగింది. అతడు యువకుణ్ణి సమీపించి అతడి తల మీది గాయాన్ని పరీక్షించాడు. అది ఏ మంత పెద్ద గాయంలా కనిపించ లేదు. కొద్దిగా రక్తం మాత్రం కారుతున్నది.

"ఖడ్గా, యీ అమాయకుణ్ణి నువ్వింత గట్టిగా కొట్టవలసింది కాదు. కాస్త నిదురు పెడితే సరిపోయేది! ముందు రక్తం కారకుండా ఆపాలి." అంటూ జీవదత్తుడు



మూలికల కోసం దాపుల నున్న చెట్ల కేసి నడిచాడు.

ఆ సమయంలో అక్కడికి వంగెత్తు కొచ్చిన వసుమతి భార్య జీవదత్తుని మాటలు విన్నది. ఆమె ఖడ్గవర్మ కేసి కొర కొర చూస్తూ, "నీ పరాక్రమం చూపేందుకు యీ అర్భకుడే దొరికాడా?" అన్నది.

"క్షమించమ్మా! నీ తమ్ముడు అన్నిటా అర్భకుడే కావచ్చు. కాని అతని చేతిలోని గండ్రగొడ్డలి చాలా పదునైనది. నే నాపక పోతే నా మిత్రుడేమయేవాడో నీ భర్తనే అడిగి చూడు," అన్నాడు ఖడ్గవర్మ.

వసుమతి భార్య తన భర్త కేసి కోపంగా చూసింది. అతడు యీసారి మరింత పెద్దగా నవ్వుతూ, "ఇందులో ఖడ్గవర్మ చేసిన అన్యాయం ఏమీ లేదు. అంతా నేను చూస్తూనే వున్నాను. ముందుగా బెదిరించే ప్రయోజనం లేకపోగా, కత్తి పిడితో తల మీద కొట్టాడు," అన్నాడు.

"ఎందుకలా నవ్వుతావు? వాడు నీకు సహాయపడేందుకేగా ప్రయత్నం చేసింది? పాపం!" అన్నది వసుమతి భార్య.

ఆ మాటలు వసుమతికి కొంచెం కోపం తెప్పించినై. అతడు ముఖం కందగడ్డలా చేసుకుని, "ఇదంతా నా ఖర్మ. గంధర్వుణ్ణయిన నేను, నీ లాటి మానవస్త్రీని పెళ్లాడవలసి వచ్చింది. మరొక మానవమాత్రుడి చేతిలో ఓడి నడుం విరక్కొట్టుకోవలసి వచ్చింది!" అన్నాడు.

ఆ సమయానికి జీవదత్తుడు రెండు దోసిళ్ళతో ఏవో ఆకులూ, కొన్ని వేళ్ళూ తీసుకుని అక్కడికి వచ్చాడు. వాటి నన్నిటినీ ఒక చోట గుట్టగా పోసి, వాటిల్లో నుంచి కొన్ని ఆకులను ప్రత్యేకంగా ఏరి తీసుకుని, అరచేతుల్లో నలిపి, ఉండగా చేసి, దానిని యువకుడి తల మీద గాయం అయినచోట అంటించాడు.

"అమ్మా, నీ తమ్ముడికొచ్చిన ప్రమాదం ఏమీ లేదు. గాయానికి కట్టు కట్టవలసిన అవసరం కూడా లేదు. గాయం నయం అయిన తరవాత, నేను అంటించిన పస



ఘులు రాలిపోతవి," అని జీవదత్తుడు వసుమతి కేసి తిరిగి, "వసుమతీ, నీ విరిగిన నడుమునుకూడా చికిత్స చేస్తాను. ఒక్క పావుగంటలో నీ మిట్టకోట భవనం మెట్లెక్క గలవు. అరవైనాలుగ్గంటల్లో తిరిగి వేటకు పోగలవు. విచారించకు," అన్నాడు.

ఆ తరవాత ఖడ్గ జీవదత్తులు ఓషధీ ఆకులనూ, వేళ్లనూ చేతులతో బాగా మర్దించి అప్పుడు వచ్చిన రసాన్ని వసుమతి నడుముకు పూసి, దాని మీద ఆకుల పిప్పిని వేసి, కట్టు కట్టారు.

ఇదంతా ముగిసిం తరవాత వసుమతి ఖడ్గ జీవదత్తుల సాయంతో లేచి నిలబడి, "నా బావమరిది మాటేమిటి? అలా మాటా పలుకూ లేకుండా పడి వున్నాడు. ప్రాణాపాయం ఏమీ లేదు గదా? వాడికేమైనా జరిగిందంటే, వాడి అక్క చేతులో నాకు గండం వున్నట్టే!" అన్నాడు.

"ప్రాణాపాయం ఏమీ లేదు. దెబ్బకు దిమ్మెరపోయి సుఖంగా నిద్రపోతున్నాడు. కొద్ది సేపట్లో అతనూ లేచి మన వెనకగా భవనానికి వస్తాడు. తోడుగా అక్కగారున్నది గదా! ముందు మనం భవనానికి పోదాం," అన్నాడు జీవదత్తుడు.

వసుమతి కొస్త కుంటుతూ నాలుగడుగులు వేసి ఆగి, "జీవదత్తా, మీ యిద్దరిలో నువ్వు నాయకుడివిలా కనిపిస్తున్నావు. అంత సేపూ ఖడ్గవర్మ మౌనం వహించాడేం? అతడికి నాలుకతో మాట్లాడటం కన్న కత్తితో మాట్లాడటంలో ఎక్కువ నేర్పున్నట్టున్నది." అన్నాడు.

"శత్రువుతో నేను మాట్లాడను. నా కత్తే మాట్లాడుతుంది. జీవదత్తుడిలో వున్న లౌక్యం, వ్యవహార జ్ఞానం నాకు అలవడ లేదు. ఏం చేసేది!" అన్నాడు ఖడ్గవర్మ కోపంగా.

"ఖడ్గా, అంత కటువుగా మాట్లాడకు. ఇప్పుడు వసుమతి మనకు శత్రువు కాదు. మిత్రుడు. యకుల ధాటికి తట్టుకోలేక అతని తలిదండ్రులు వింధ్యపర్వతాలు వదిలి యీ ప్రాంతాలకు వలస వచ్చారు.



మనం ఆ యక్షుల శక్తిసామర్థ్యాలు ఎలాంటివో చూసేందుకు అక్కడికి పోతున్నాం. అందువల్ల అతనూ మనమూ మిత్రులం," అన్నాడు జీవదత్తుడు.

ఈ మాటలు ఖడ్గవర్మనూ, వసుమతినీ కూడా ఆశ్చర్యపరిచినై. ఇద్దరూ కొంచెంసేపు ఆలోచిస్తూ వూరుకున్నారు. ఈ లోపల వాళ్ళు క్రమంగా భవనం మెట్లను సమీపించసాగారు. భవనం దిగువ మెట్టు దగ్గిర పడగానే వసుమతి దాని మీద ఒక కాలుంచి, తల తిప్పి జీవదత్తుడి కేసి గుచ్చి చూస్తూ, "జీవదత్తా! మీరు వింధ్యపర్వతాల కేసి పోతున్నారా? సరే, యక్షులంటున్నావేమిటి?" అని అడిగాడు.

"మేం యిద్దరం ఒక గొప్ప కార్యం సాధించి మహావీరులం అని రుజువు చేసుకునేందుకు వింధ్యపర్వతాలను దర్శించబోతున్నాం," అన్నాడు జీవదత్తుడు.

"జీవా, అది నిజమే! ఇందులో యక్షుల ప్రసక్తి ఏమున్నది? మనం కదిలించవలసింది రాతిరథం కాని, యక్షసంహారం కాదు గదా?" అన్నాడు ఖడ్గవర్మ.

రాతిరథం అన్న మాట వింటూనే వసుమతి పెద్దగా అదిరిపడి, "రాతిరథమా! వింధ్యపర్వతాల్లో వున్న రాతిరథాన్ని కదిలించేందుకు పోతున్నారా? ఆ సంగతి యిక్కడికి వస్తూనే నాతో అన్నట్టయితే, మన మధ్య యింత జగడమూ, అనవసర కాలయాపనా జరిగేది కాదు గదా?" అన్నాడు.

"అయిందేదో అయింది. ఇకనైనా కాలం వృథా కాకుండా చూద్దాం. త్వరగా మెట్లెక్కి నా విశ్రాంతి మందిరం చేరదాం. అక్కడ అంతా వివరంగా మాట్లాడుకోవచ్చు," అన్నాడు జీవదత్తుడు.

"అలా అయితే మనం పోవలసింది నా విశ్రాంతి మందిరానికి గాదు, ఆయుధాగారానికి. అది పేరుకు ఆయుధాగారం అయినా, అక్కడ నా పూర్వులు వదిలిపోయిన అపూర్వ వస్తువులనేకం వున్నవి." అన్నాడు వసుమతి.

ఆ తరవాత ఖడ్గ జీవదత్తుల సాయంతో అతడు మెల్లిగ్గా భవనంలోని ఒక పెద్ద గది ముందుకు పోయి ఆగాడు. ఆ గది తలుపులు గొళ్లెం పెట్టి వున్నాయి. వాటికి తాళం లాంటిది లేదు. తలుపుల మీద అనేక రకాల బొమ్మలు చెక్కబడి వున్నాయి. వసుమతి తలుపు గొళ్లెం తీసి, రెండు చేతులతో తలుపులను గట్టిగా పట్టుకుని వెనక్కు నెట్టాడు.

గదిలో కనిపించిన అపూర్వ వస్తుసంపద చూసి ఖడ్గ జీవదత్తులు అమితాశ్చర్యం చెందారు. గదిలో ఎక్కడ చూసినా మణి మాణిక్యాలు మిలమిలా మెరుస్తూ కనిపించాయి. గోడల పక్కగా అనేక రకాలైన ఆయుధాలు చేరవేయబడి వున్నాయి. గోడల కున్న కొయ్యమేకుల నుంచి వివిధ సంగీత వాయిద్యాలు వేలాడుతున్నాయి.

“ఇదంతా నా తండ్రి వదిలిపోయిన సంపద. తక్కిన లోకంతో సంబంధం లేకుండా, యీ కొండల మధ్య వేటాడి జీవించే వాళ్ళం. వీటితో అవసరం లేదు. సరే, అసలు సంగతి కొద్దాం. ఏదో రాతి రథం అన్నావే—దాని మాటేమిటి?” అని అడిగాడు వసుమతి.



“అదంతా పెద్ద కథ, అయినా నాలుగు మాటల్లో ముఖ్య విషయం చెప్పేస్తాను. కాస్త విశ్రాంతిగా కూర్చోవటం బావుంటుంది గదా? ఈ తల్పాల మీద కూర్చోవద్దా?” అంటూ జీవదత్తుడు నగిషీపనితో అందంగా వున్న తల్పాన్నొకదాన్ని చూపించాడు.

“హాయిగా కూర్చునే మాట్లాడుకుందాం. నేను చెప్పవలసింది వుంది. కూర్చోండి!” అంటూ వసుమతి, ఎదురుగా వున్న మరొక తల్పం మీద కూర్చున్నాడు.

జీవదత్తుడు తతిమ్మా సంఘటనలన్నీ వదిలి, పద్మపురరాజును తాము కలుసుకోవటం, ఆయన కుమార్తె పద్మావతి తమకు ఒక రాతిరథాన్ని చూపి, దాన్ని కదిలించినవాడే మహావీరుడనీ, అతన్నే తాను వివాహం ఆడతానని అన్న మాటలూ మాత్రం చెప్పాడు.



"అంటే ఆ రాతిరథాన్ని మీరు చూశారన్నమాట?" అన్నాడు వసుమతి ఎంతగానో ఆశ్చర్యపోతూ.

"అవును చూశాం: అది బొమ్మ రాతిరథం. వింధ్యపర్వతాల్లో ఎక్కడో వున్న రథానికి ప్రతికృతి అని చెప్పారు." అన్నాడు జీవదత్తుడు.

వసుమతి మారు మాటాడకుండా తల్పం మీంచి లేచి, గదిలో ఒక మూలగా వున్న ఒక పెద్ద కొయ్యపెట్టె మూత తెరిచి, అందులో నుంచి ఒక వస్తువును తీసుకుని ఖడ్గ జీవదత్తుల దగ్గిరకు వచ్చాడు. అది రాకుమారి పద్మావతి, ఖడ్గ జీవదత్తులకు చూపిన రాతిరథం లాగే వున్నది.

"ఇది నీ చేత ఎలా పడింది? కొద్ది వారాలకు ముందు దీన్ని మేం పద్మపుర రాజకుమార్తె దగ్గిర చూశాం గదా?" అన్నాడు జీవదత్తుడు ఆశ్చర్యంగా. ఖడ్గవర్మ రాతిరథం కేసీ, వసుమతి ముఖం కేసీ అనుమానంగా చూడసాగాడు.

"దీన్ని నేనా రాజకుమారి నుంచి మాత్రం తస్కరించలేదు. ఆ మధ్య ఒక వెన్నెల రాత్రి భవనం మీది ఆవరణలో నేను పడుకుని వుండగా, ఆకాశంలో మేఘంలా కదులుతున్న ఒక నల్లని ఆకారం దీన్ని నా పక్కన పడవేసింది. ఇందులో అబద్ధం లేదు," అన్నాడు వసుమతి.

ఖడ్గవర్మ, జీవదత్తుడి కేసి తల తిప్పి, "ఇది నమ్మదగిందేనా? అదే కథ—పిచ్చి కథ!" అన్నాడు.

"నేనూ యిదేదో కథగాని, భ్రమగాని అయి వుంటుందని, యీ రథానికట్టి వున్న చీటీ ఒక దాన్ని చదివి, ఆ పెట్టెలో పారవేశాను. నా భార్య యిదంతా ఆ రాత్రి నేను కొంచెం అతిగా సేవించిన మద్యపానం మహిమ కింద కొట్టిపారవేసింది. ఈ రథాన్ని నేనే తాగిన మత్తులో, ఈ గదిలో ఏ మూల నుంచో బయిటికి తెచ్చానని ఆవిడ అభిప్రాయం." అంటూ నవ్వసాగాడు వసుమతి.

"ఆ చీటీలో ఏముంది? అదెక్కడ?" అని అడిగాడు జీవదత్తుడు ఆదుర్దాగా.


"ఆ చీటీ ఎప్పుడో గాలికి ఎగిరిపోయి వుంటుంది. దానిలో వున్న సంగతేమంటే; యిద్దరు క్షత్రియ యువకులు నా మిట్ట కోటకు వచ్చే అవకాశం వుందనీ, వచ్చి నప్పుడు తగిన సహాయం చేయమనీ," అన్నాడు వసుమతి.

"ఆహా, మనం చాలా సంగతులు మాట్లాడు కున్నాం. ఆ రాతిరథం రహస్యం వెనక మరింత నిగూఢమైన రహస్యం ఏదో వున్నది. వసుమతీ! నీ జాతివాడే ఒకడు మమ్మల్ని ప్రోత్సహించి ఆ రథం కదిలించాలని చూస్తున్నాడు. కారణం ఏమై వుంటుంది?" అంటూ జీవదత్తుడు కొంచెం ఆగి, "వసుమతీ! ఇక మేం బయలు దేరతాం!" అంటూ తల్పం మీదినుంచి లేచాడు. ఖడ్గవర్మ కూడా లేచి నిలబడ్డాడు.

"భోజనం చేసి బయలుదేరండి. నా భార్య ఆ ఏర్పాట్లు చేస్తున్నదనే అను కుంటాను," అన్నాడు వసుమతి.

తరవాత ముగ్గురూ గది నుంచి బయటికి వచ్చి, మెట్లకింద వున్న గదుల కేసి చూసే సరికి, అక్కడ వసుమతి భార్యా, బావమరిదీ హడావిడిగా వంట పనులు చేస్తూండటం కనిపించింది.

"జరిగిన దానికి పిల్ల వరసు రాపున్న మమ్మల్ని క్షమిస్తాడని అనుకుంటాను!" అన్నాడు జీవదత్తుడు.



యువకుడు తల ఎత్తి చూసి నవ్వాడు. అతడి అక్క కూడా చిరునవ్వు నవ్వుతూ, "క్షమించటం ఏమిటి, నాయనా? ఆ దెబ్బతో వాడేదో పూర్వజన్మ జ్ఞానం కలిగినట్టు మాట్లాడుతున్నాడు. మీరు వాడికి మేన మామలట! చూశారా చిత్రం!" అన్నది.

"ఇందులో చిత్రం ఏమీ లేదు. నిజమే అయివుంటుంది! మేనల్లుణ్ణి ఖడ్గవర్మ అంత గట్టిగా కొట్టవలసింది కాదు!" అన్నాడు జీవదత్తుడు.

ఆ తరవాత అర గంటకు అందరూ భోజనాలు చేశారు. మిట్టకోట ప్రాంతాన్నుంచి బయటికి పోవాలంటే, అరణ్యంలో వున్న చెట్టుతొర్రలో వున్నదే మార్గమని వసుమతి.

ఖడ్గ జీవదత్తులకు చెప్పాడు. వారికి సహాయంగా తన బావమరిదిని వెళ్ళమన్నాడు.

ఖడ్గ జీవదత్తులు, వసుమతి దంపతులకు వీడ్కోలు చెప్పి బయలుదేరబోయే సమయంలో వసుమతి వాళ్ళకు తన ఆయుధాగారం నుంచి తెచ్చిన ఒక కంచుఢక్కను యిస్తూ, "ఇది చాలా ప్రభావం కలదని మా తండ్రి అంటూండేవాడు. కాని, ఉపయోగించవలసిన అవసరం నా కెన్నడూ కలగ లేదు. దీన్ని వాయిస్తే శత్రువులు గుండె బేజారై పారిపోతారు!" అన్నాడు.

"కంచుఢక్క ధ్వనికే గుండెలవిసి పారిపోయే శత్రువులు. ఏ పాటి శత్రువులు! ఇవ్వండి, అవసరం అయినప్పుడు ఉపయోగిస్తుందేమో చూస్తాం!" అని జీవదత్తుడు కంచుఢక్కను తీసుకున్నాడు.


తరవాత ఖడ్గ జీవదత్తులు, గండ్రగొడ్డలి యువకుల్ని వెంట బెట్టుకుని సారంగ మార్గాన పోతూ పోయి, అరణ్యంలోని చెట్టు తొర్రను సమీపించారు. వాళ్ళకు బయట ఎవరో పెద్దగా మాట్లాడుకుంటూ వుండటం వినిపించింది. ఖడ్గవర్మ నిశ్శబ్దంగా ముందుకు పాకిపోయి చెట్టు తొర్రలో నుంచి బయటికి చూశాడు. తనకు పాత శత్రువైన మహేంద్రనగరం సేనాని కొడుకు, ముప్పై నలభైమంది సైనికులను చెట్టు కింద చేర్చి, పెద్దగా ఆజ్ఞాపిస్తున్నాడు.

"చూశారా, చెట్టు చుట్టూ ఎవరో పహరా తిరిగినట్టు గుండ్రని దారి ఏర్పడింది. ఒక్క గడ్డిపోచ మొలవలేదు. హంతకులైన ఆ ఖడ్గవర్మ, జీవదత్తుడూ యీ ప్రాంతానికి వచ్చినట్టు గ్రామస్థులు చెప్పగా మనం విన్నాం కదా! ఈ మహావృక్షం పైనే వాళ్ళెక్కడో దాగి వుంటారు. మీలో యిద్దరు ముగ్గురు చెట్టెక్కి తొర్రలూ, కొమ్మలూ రెమ్మలూ— అన్నీ గాలించండి!" అన్నాడు సేనాని కొడుకు.

ఆ వెంటనే ఇద్దరు సైనికులు చెట్టు ఎక్కేందుకు బయలుదేరారు. ఖడ్గవర్మ వెనక్కు తిరిగి తన మిత్రులతో, "విన్నారు గదా!" అని కత్తి దూశాడు.

—(ఇంకా వుంది)





# రాకాసిలోయ

## 13

[జీవదత్తుడు ద్వంద్వయుద్ధంలో వనమాలిని ఓడించాడు. వనమాలి అతనికీ, ఖడ్గవర్మకూ తన భవనంలో ఆతిథ్యం ఇచ్చాడు. తరవాత వాళ్ళు గంధర్వగొత్తలి యువకుణ్ణి వెంటబెట్టుకుని చెట్టుతొర్రను చేరారు. చెట్టు కింద మహేంద్రనగరం సేనాని కొడుకు కాపువేసి వున్నాడు. అది చూసి ఖడ్గవర్మ కత్తి దూశాడు. తరవాత—]

మహేంద్రనగర సేనాని కొడుకు తన సైనికులకు ఇచ్చిన ఆజ్ఞ వింటూనే జీవదత్తుడు ఖడ్గవర్మను హెచ్చరించబోయాడు. కాని ఖడ్గవర్మ కత్తి దూసి తొర్రలోంచి బయటికి వెళ్ళాలన్న ప్రయత్నంలో చవ్వున ముందుకు దూకబోయాడు. జీవదత్తుడు అతడి కాలొకటి పట్టుకుని వెనక్కు గుంజి, "ఖడ్గా, ఆగు! ఉపాయంతో శత్రువులను జయించే అవకాశం వున్న చోట మనం తొందరపడి ముఖాముఖి యుద్ధానికి పూనుకోవటం ప్రమాద కారణం అవుతుంది. సేనాని కొడుకు వెంట మున్నై నలభై మంది సైనికులున్నట్టున్నది. ఈ తొర్రలోంచి మనం ఒకళ్ళ వెనక ఒకళ్ళం భూమి మీదికి దిగేలోపలే మన అంతు వాళ్ళు తేలుస్తారు!" అన్నాడు.

ఖడ్గవర్మ వెంటనే వెనక్కు తిరిగి చిన్న గొంతుతో, "నువ్వన్నది నిజమే కావచ్చు.



కాని, వాళ్లు ఎలాగూ చెట్టెక్కబోతున్నారు. ఈ తొర్రలో వున్న మనం తప్పక వాళ్ళ కంటబడి తీరుతాం!" అన్నారు.

"మనం వాళ్ళ కంటబడకుండానే, వాళ్ళను హడలెత్తించి పారదోలే ఉపాయం వున్నది. అది సాధ్యం కాకపోతే, అప్పుడు కిందికి దిగి శత్రువులను ఎదుర్కొందాం. ఏదీ నీ కత్తి ఇటివ్వు!" అన్నాడు జీవదత్తుడు చేయిచాచి.

ఖడ్గవర్మ కొంచెం ఆశ్చర్యపోయి కత్తిని జీవదత్తుడి కిచ్చాడు. జీవదత్తుడు తన పక్కనే వున్న వసుమతి బావమరిదిని గండ్రగొడ్డలి ఇవ్వమన్నాడు. అతడు మాట్లాడకుండా గొడ్డలిని ఇచ్చేశాడు. జీవదత్తుడు గొడ్డలిని, కత్తిని కలిపి కట్టి, దానికి వసుమతి తనకు బహూకరించిన కంచుడక్కను వేళ్లాడకట్టాడు.

"ఏమి టిదంతా?" అన్నాడు ఖడ్గవర్మ.

"ఈ చెట్టుతొర్రలో శిలాశక్తి మహాముని తపస్సు చేసుకుంటున్నాడు! తపోభంగం కలిగిస్తే, ఈ ఆయుధాలతో ఆయన శిష్యుడు శత్రువులను చిత్రవధ చేస్తాడు. సరే, నువ్వు వెనక్కు పోయి, గుహ ద్వారం పక్కన రాళ్ళు పగిలి ఏర్పడిన కంత వున్నదే— దాని నుంచి బయటికి వెళ్ళి, మరొక చెట్టు ఎక్కి నాలుగైదు నిమిషాల్లో, యీ సైనికుం మూక పారిపోకపోతే, యీ సంగతి హెచ్చరిస్తా. మొదటి బాణం మహేంద్రనగరం సేనాని కొడుక్కు తగిలేలా కొట్టు!" అన్నాడు జీవదత్తుడు.

ఖడ్గవర్మ చెట్టుతొర్ర వెంట వెనక్కు పాకిపోయాడు. జీవదత్తుడు తాను కలిపి కట్టిన ఆయుధాలతో తొర్ర ముఖద్వారం కేసి కదిలాడు. వసుమతి బావమరిది అతడి భుజం పట్టుకుని చిన్న గొంతుతో, "ఇంత పెద్ద ప్రయత్నం ఎందుకు? మా బావగా రిచ్చిన కంచుడక్క మోగిస్తే, ఆ సైనికు లంతా పారిపోతారు గదా?" అన్నాడు.

"ఆ సంగతి నాకు గుర్తుంది. కాని ఆ డక్కలో మీ బావగారు చెప్పిన మహత్తు లేకపోతే, ఎవడో బుడబుక్కలవాడు యిక్క

దున్నా డనుకుని, సేనాని కొడుకు మరింత ధైర్యంతో మన మీదికి వచ్చి పడతాడు. కంచుఢక్క మహత్తును పరీక్షించే సమయం యిది కాదు." అన్నాడు జీవదత్తుడు.

తరవాత జీవదత్తుడు తొర్ర ముందుకు పోయి, తల బయటికి పెట్టకుండా ఆయుధా లున్న చేతిని మాత్రం బయటికి చాచి, దాన్ని కిందికి పైకి రెండుమూడు సార్లు గట్టిగా ఊపాడు.

హఠాత్తుగా చెట్టు తొర్రలోంచి గండ్ర గొడ్డలి, కత్తి, కంచుఢక్కా పట్టుకున్న చేయి ఒకటి బయటికి రావటం చూసి, సేనాని కొడుకూ, అతడి సైనికులూ హడలిపోయారు.

"చెట్టుతొర్రలో ఎవడో రాక్షసు డున్నాడు! ప్రాణాలు దక్కించుకుని పారిపోదాం!" అంటూ అయిదారుగురు సైనికులు వెనక్కు తిరిగారు. వాళ్ళను చూసి తక్కిన సైనికులు కూడా పారిపోబోయారు.

సేనాని కొడుకు, "ఆగండి!" అంటూ పెద్దగా అరిచి, "అంత ధగధగ లాడుతున్న ఆ ఆయుధాలు రాక్షసుడివై వుండవు. రాక్షసు డంటే పచ్చిమాంసం తినేవాడు కదా? అలాంటివాడి ఆయుధాలు రక్తం ఓడుతూ, తుప్పుపట్టి వుంటవి!" అన్నాడు.

"అయ్యో, మీ రన్నదాంట్లో వున్న సత్యాసత్యాలు బయట పడేలోపలే మనం హతం అయిపోయే ప్రమాదం వున్నది. ఆ ద్రోహులు ఖడ్గవర్మా, జీవదత్తుడూ యిక్కడ లేరని రుజువై పోయింది గదా! పారిపోవటం క్షత్రియుల లక్షణం కాదు గనక, త్వరగా





వెనక్కు తిరిగి పోదాం రండి!" అన్నాడొక చిన్న దళనాయకుడు.

సేనాని కొడుకు ఒక క్షణకాలం తటపటాయించాడు. చెట్టుతొర్రలోంచి మాటా పలుకూ లేకుండా, హఠాత్తుగా అన్ని ఆయుధాలు కట్టకట్టుకుని మరీ బయటికి రావటం ఏమిటి? ఇందులో ఏమైనా మోసం వున్నదా? లేక నిజంగానే....

సేనాని కొడుకు యిలా ఆలోచిస్తూన్నంతలో దూరంగా వున్న ఒక మహావృక్షం కొమ్మల్లోంచి ఒక కంచుకంఠ ధ్వని యిలా వినిపించింది: "ఒరే, క్షుద్రమానవులారా! వెంటనే యిక్కణ్ణించి పారిపొండి! ఆ చెట్టుతొర్రలో శిలాశిఖి మహాముని తపస్సు చేసుకుంటున్నాడు. తపోభంగం కలిగిందా రో మిమ్మల్ని భస్మం చేసేస్తాడు!"

"అదెక్కడిదో విన్న గొంతుక!" అంటూ సేనాని కొడుకు, ఆ మాటలు వచ్చిన వైపుకు తల తిప్పాడు. మరుక్షణం ఒక బాణం రివ్వుమంటూ వచ్చి అతని డొక్కను రాచుకుంటూ పోయి నేలలో గుచ్చుకున్నది.

సేనాని కొడుకు ఎగిరి ఒక గంతు వేసి, "కాస్తలో తప్పింది! అందరూ నా వెనగ్గా పరిగెత్తి రండి!" అన్నాడు.

"మహాముని శిష్యు డెవడో మన నాయకుణ్ణి పగబట్టినట్టుంది. అందువల్ల ఆయన వెనగ్గా కాక, కాస్త దూరంగా పక్కన పడి పోవటం క్షేమం!" అంటూ ఒక సైనికుడు వెనక్కు తిరిగి పరుగుతీశాడు. అందరూ ఆతడి వెనకపడి పారిపోసాగారు.

నాలుగైదు నిమిషాల తర్వాత ఖడ్గవర్మ చెట్టు దిగి జీవదత్తు డున్న చోటుకు వచ్చాడు. గండ్రగొడ్డలి యువకుడు ఖడ్గవర్మను గొప్పగా మెచ్చుకుంటూ, "ఈ దెబ్బతో నరమానవుడైన వాడెవడూ యీ చెట్టుతొర్ర ప్రాంతానికి రాడు. ఆ సేనాని కొడుకును ఎందుకు పోనిచ్చావ్? బాణం గుండెలను తాకేట్టు కొట్టవలసింది," అన్నాడు.

"నా మాటల ధాటికే బెదిరి పారిపోయే వాడిని చంపటం ధర్మం అనిపించుకోదు. కావాలంటే యీ శిలాశిఖి మహామునిని

"అయుగు!" అన్నాడు ఖడ్గవర్మ నవ్వుతూ జీవదత్తుణ్ణి చూపించి.

జీవదత్తుడు కూడా ఆ మాటలకు నవ్వి, "ఇక మనం బయలుదేరుదాం. ఆ చవట వెధవలు పారిపోయింది పడమటి దిక్కు కేసి గనక, మనం నిశ్చింతగా ఉత్తర దిక్కు కేసి పోవచ్చు. మనం చేరవలసిన పర్వతాలు ఆ దిక్కునే వున్నవి కదా!" అన్నాడు.

తరవాత ఖడ్గ జీవదత్తులు చెట్టుతొర్ర నుంచి కిందికి దిగారు. గండ్రగొడ్డలి యువకుడు కూడా వాళ్ళ వెంట దిగబోయాడు కాని, జీవదత్తుడు అతణ్ణి వారించి, "ఇక ఏ నాడూ పనిపెట్టుకుని యీ చెట్టు చుట్టూ పహరా తిరక్కు. రహస్యం బయటపడి పోయిందంటే, మీ దొరగారి మిట్టకోట మీదికి ఏ రాత్రో దాడిచేయవచ్చు. అదంతా మీ దొరగారికి లేనిపోని శ్రమకూ, అనవసర రక్తపాతానికీ కారణం అవుతుంది!" అన్నాడు.

"సలహా బాగానే వుంది, మరి నాకు కాలక్షేపం జరిగేదెట్లా?" అన్నాడు యువకుడు.

"కాలక్షేపం కావలసివస్తే, నువ్వూ మరో గుట్టకోట కట్టుకుని, నచ్చిన పిల్ల నెవర్నయినా పెళ్ళాడి, హాయిగా కాలక్షేపం చెయ్యి. మేం వింధ్యపర్వతాల నుంచి తిరిగి పద్మపురం వెళ్ళేప్పుడు నిన్ను కలుసుకుంటాం. ప్రస్తుతానికి సెలవు!" అన్నాడు జీవదత్తుడు.



ఖడ్గ జీవదత్తులు అక్కణ్ణించి బయలుదేరి అరణ్యమార్గాల వెంట ప్రయాణిస్తూ, సూర్యాస్తమయానికి యింకా ఒక గంట కాలం వున్నదనగా, ఒక నీటివాగును చేరారు. ఇద్దరూ ఆ వాగులోని స్వచ్ఛమైన నీరు తాగి, కాళ్ళూ చేతులూ కడుక్కుని, ఒక చెట్టు కింద కొద్ది సేపు విశ్రాంతి తీసుకుని, సూర్యాస్తమయం లోపల ఎదురుగా వున్న చిన్న కొండ ప్రాంతాన్ని చేరాలన్న నిశ్చయంతో, వాగు దాటి ముందుకు నడిచారు.

ఖడ్గ జీవదత్తులు వాగు దగ్గిరకు వచ్చి నప్పటి నుంచి, వాళ్ళు చేసే ప్రతిపనినీ, ఆవతల వున్న చెట్ల మీది నుంచి ఇద్దరు సైనికులు జాగ్రత్తగా గమనిస్తున్నారు. వాళ్లు



ఆనందపురం రాజుగారి సైనికులు. ఆ రాజు ఒక ఇరవైమంది సైనికులను వెంట బెట్టుకుని, రథం ఎక్కి అరణ్యానికి వేటకు వచ్చాడు. ఆ అరణ్యం అతడి రాజ్యభాగం లోదే అయినా, ఒకానొక పూజారి నుంచి అతడికి నాలుగైదు నెలలుగా, ప్రమాదం రావచ్చునన్న భయం పట్టుకున్నది. అందుచేత అతడు తాను వేటాడే ప్రాంతాల చుట్టుపక్కల కొందరు వేగులవాళ్ళను చెట్ల పైన వుంచి, నీటివాగు పరిసరాలను కాపలా కాయిస్తున్నాడు.

ఈ ఆనందపురం రాజు పేరు నిత్యానందుడు. అతడి శత్రువైన పూజారి పేరు విఘ్నేశ్వరపూజారి. చాలా వింత పరిస్థితుల కారణంగా వాళ్ళిద్దరి మధ్య బద్ధవైరం ఏర్పడింది.

విఘ్నేశ్వరపూజారి ఆనందపురం వెలపల వున్న ఒక అతిప్రాచీన విఘ్నేశ్వరాలయంలో పూజారిగా వుంటూండేవాడు. ఇప్పటికి అయిదారు నెలల క్రితం, వినాయక చవితి పండగ మరోవారం రోజులు వున్నదనగా, అతడికి ఒక రాత్రివేళ ఒక కల వచ్చింది. ఆ కలలో రాజు వినాయకచవితి నాటి మిట్టమధ్యాహ్నం వేళ కాలినడకన ఆలయానికి వచ్చి, తన తల మీద వున్న కిరీటాన్ని తీసి స్వయంగా పూజారి నెత్తిన పెట్టి, "ఆనందపురాన్ని పాలించే అర్హత నీకు తప్ప మరెవరికీ లేదు. వెళ్ళి సింహాసనాన్ని అధిష్ఠించు! నేను అరణ్యాలకు పోయి, ఆకలములు తింటూ శేషజీవితాన్ని గడిపేస్తాను!" అన్నాడు.

పూజారికి వెంటనే మెలుకువ వచ్చింది. కిరీటం కోసం తలమీద తడివి చూసుకున్నాడు. అక్కడ కిరీటం లేదు. "ఓహో, వినాయకచవితి రోజున గదా, రాజు నా తల మీద కిరీటం పెట్టనున్నది! దానికి యింకా వారంరోజులు గడువుంది!" అనుకుని తృప్తిపడ్డాడు.

ఈ విఘ్నేశ్వరపూజారికి కొంచెం మూఢత్వంతో పాటు, అహంకారం కూడా వున్నది. ఆలయానికి వచ్చినప్పుడల్లా రాజు

తనకు తలవంచి నమస్కరించటం, తనలో ఏదో గొప్ప చూసి అని భ్రమపడుతూండే వాడు. దానికితోడు యీ వింత కల రావటంతో, అతడిలోని అహంకారం మరింతగా బలిసిపోయింది.

ఆ కన్న కల నిజం అయి తీరుతుందనుకున్న విఘ్నేశ్వర పూజారి ఆ మరసటి రోజునే కంసాలి చేత ఇత్తడి కిరీటం ఒకటి చేయించుకుని, దాన్ని తలమీద పెట్టుకుని తిరగసాగాడు. ఈ సంగతి రాజుకు ఎవరో చెప్పారు. రాజు మండిపడి అతణ్ణి సభకు పిలిపించి, నలుగురి మధ్యా గట్టిగా కొప్పడి, "ఈ పిచ్చి పనంతా ఏమిటి?" అని అడిగాడు.

"రాజా, మీ రెలాగా వినాయకచవితి రోజున విఘ్నేశ్వరాలయానికి వచ్చి, నా తల మీద బంగారు కిరీటం పెట్టి రాజ్యాధికారం అప్పగించనున్నారు కదా! అందుకని, యీ నాలుగు రోజులపాటూ యీ ఇత్తడి కిరీటం పెట్టుకుని — కిరీటధారణ అలవరుచుకుంటున్నాను. విఘ్నేశ్వరాలయంలో కన్న కల అబద్ధం అయే అవకాశం లేదు గదా!" అన్నాడు పూజారి.

రాజు ఆ మాటలతో మరింతగా మండిపడి అతణ్ణి భటుల చేత నాలుగు కొట్టించి, తన రాజ్యం నుంచి తరిమేశాడు. పూజారి, తన మిత్రుడైన కంసాలితో కలిసి ఆనంద పురరాజ్య సరిహద్దుల్లో వున్న ఒక వాగు దాటి, ఆ పరిసరాల్లోని కొండ ప్రాంతాలు చేరాడు. అతడక్కడ కొందరు ఆటవికుల్ని కూడ గట్టుకుని ఆనందపుర రాజ్య సరి



హద్దుల్లో చిన్న చిన్న దాడులు ప్రారంభించాడు. అందులో అతడికి ఒక రాకాసి ఏనుగు సహాయ పడుతున్నదని ప్రజలు చెప్పుకునేవారు.

ఆనందపుర రాజైన నిత్యానందుడికి, ఈ విఘ్నేశ్వరపూజారి పెద్ద గడ్డుసమస్య అయి కూర్చునాడు. రాజు పంపిన సైనికులను పూజారి వాహనమైన రాకాసిఏనుగు పాదల కొట్టేది. అతడి భృత్యులైన అటవికులు యమకింకరుల్లాగా వచ్చి మీదపడి వాళ్ళను చెల్లా చెదురు చేసేవారు.

నిత్యానందుడికి వేటపిచ్చి జాస్తి. ఆ కారణం వల్ల అతడు ఒక అరవైమంది సైనికులను వెంటబెట్టుకుని, వేగులవాళ్ళను కాపలా కోసం చెట్ల మీద అక్కడక్కడా వుంచి అరణ్యానికి వేటకు వచ్చాడు. అతడి వేగులవాళ్ళకు వాగు దగ్గర ఖడ్గ జీవదత్తులు కనిపించారు. వాళ్ళు పోయి తమ రాజుకు ఆ వార్త చెప్పారు.


" వాళ్ళు బహుశా ఆ విఘ్నేశ్వరపూజారి వేగులవాళ్ళయి వుంటారు. వాళ్ళను ప్రాణాలతో పట్టుకోండి. వాళ్ళ నుంచి ఆ పూజారి ద్రోహి ఏ కొండగుహలో వుంటున్నాడో తెలుసుకోవచ్చు. ఆ తరవాత ఆ గుహను చుట్టుముట్టి వాళ్లని నాశనం చేద్దాం. పీడ విరగడ అవుతుంది!" అన్నాడు రాజు.

ముందు సైనికులూ, కొంచెం వెనగ్గా రాజూ, ఖడ్గ జీవదత్తుల కేసి బయలుదేరారు. ఖడ్గ జీవదత్తులు యిదేమీ ఎరగరు. వాళ్లు హాయిగా మాట్లాడుకుంటూ, సూర్యాస్తమయం లోపల ఎదురుగా వున్న కొండలను చేరాలని నడుస్తున్నారు. హఠాత్తుగా వాళ్ళకు అన్ని వైపుల నుంచి, "ఆగండి! అడుగు ముందుకు వేశారో ప్రాణాలు దక్కవు!" అన్న హెచ్చరికలు వినిపించాయి.

ఖడ్గ జీవదత్తులు ఓ క్షణం పాటు నివ్వెరపోయి చుట్టూ కలయచూశారు. గుర్రాలెక్కి వున్న నలుగురైదుగురు సైనికులు ఒకవైపు నుంచి, కత్తి, కటారులు పట్టుకున్న పది పన్నెండుమంది సైనికులు మరొక వైపు నుంచి వచ్చి వాళ్ళను చుట్టుముట్టారు.

—(ఇంకా వుంది)





# రాతిరథం

## 14

[చెట్టు దగ్గిర కాపలా వేసి వున్న మహేంద్రనగరసేనాని కాదుకుడు, ఖడ్గజీవదత్తులు మొత్తగొట్టారు. అతడు సైనికులతో పాటు పారిపోయాడు. గంధర్వగోష్ఠి యువకుణ్ణి చెట్టు తొర్రలోనే వదిలి, ఖడ్గజీవదత్తులు ఉత్తరంగా ప్రయాణం చేసి, ఒక నీటివాగును చేరారు. ఆ వాగు అవతల కొందరు సైనికులు వాళ్ళను హఠాత్తుగా చుట్టుముట్టారు. తరవాత—]

ఖడ్గ జీవదత్తులు, అశ్వికసైనికుల కేసి వింతగా చూస్తూ నిలబడిపోయారు. వీళ్ళు మహేంద్రనగరం వాళ్ళేమో అన్న అనుమానం కలిగింది, జీవదత్తుడికి. అశ్వికుల్లో ఒకడు, ఈటెను పైకెత్తి, "మా వెంట రాజుగారి దగ్గిరకు రండి! ఊc, అలా చూస్తారేం, కదలండి!" అన్నాడు.

ఖడ్గవర్మ చప్పున కత్తి దూయబోయాడు. కాని, జీవదత్తుడు అతణ్ణి ఆగమని, అశ్వికుణ్ణి, "మీ రాజెవరు? మీరు మహేంద్ర నగరంవాళ్ళా?" అని అడిగాడు.

"ఎక్కడి మహేంద్రనగరం, ఎక్కడి మా ఆనందపుర రాజ్యం! మా రాజు నిత్యానందుడు. మీ విఘ్నేశ్వరపూజారి రోజులు దగ్గిర పడ్డాయి! ఇన్నాళ్ళూ తప్పించుకున్నాడు," అన్నాడు అశ్వికుడు.

"విఘ్నేశ్వరపూజారి ఎవరు? మీ రెవరో పొరబడుతున్నారు. మేం అతడి మనుషులం



కాదు. మా దారిన మమ్మల్ని వెళ్ళనియ్యండి!" అన్నాడు జీవదత్తుడు.

"ఈ కల్లబొల్లి మాటలు మా రాణీ నమ్మదు. నేను నమ్ముతానా? పదండి రాజుగారి దగ్గిరకి. ఊఁ," అన్నాడు అశ్వికుడు యీటెను ఝళిపిస్తూ.

"ఖడ్గా,- వీళ్ళు మనను గురించి పొరబడుతున్నారు. రక్తపాతం ఎందుకు? వీళ్ళ రాజుతో మనం ఎవరిమైందీ చెప్పి, మన దారిన మనం పోదాం!" అన్నాడు జీవదత్తుడు.

తరవాత ఖడ్గజీవదత్తులు, సైనికుల వెంట రాజు నిత్యానందుడి దగ్గిరకు వెళ్ళారు. నిత్యానందుడు వాళ్ళను నఖశిఖపర్యంతం ఓ సారి పరీక్షగా చూసి, "ద్రోహి విఘ్నేశ్వర పూజారి ఏ కొండగుహలో వుంటున్నాడు? వాడి కున్న అటవిక మూక ఎంత? రాకాసిఏనుగును వాడు ఎలా మచ్చిక చేయగలిగాడు?" అని అడిగాడు.

ఈ ప్రశ్నలు జీవదత్తుడికి ఎక్కడలేని కోపాన్ని తెప్పించినై. అయినా అతడు దాన్ని పైకి కనబరచకుండా శాంతస్వరంతో, "రాజా! తమ రడిగిన ప్రశ్నల్లో ఏ ఒక్క దానికీ మాకు జవాబు తెలియదు. మేం తీర్థయాత్రలకై పోతున్న క్షత్రియ యువకులం!" అన్నాడు.

"యువకులని తెలుస్తూనే వుంది! కాని క్షత్రియులం అనే మాటా, తీర్థయాత్రల మాటా నమ్మటం ఎట్లా?" అన్నాడు రాజు వెటకారంగా.

"ఇదిగో. ఇప్పుడు నీ చేత అదంతా నమ్మిస్తాం!" అంటూ ఖడ్గవర్మ కత్తి దూశాడు. అదే సమయంలో అల్లంత దూరంలో వున్న చెట్లచాటు నుంచి, రాళ్ళ చాటు నుంచి కొందరు ఆటవికులు వాళ్ళూ, కత్తులూ పట్టుకుని, "విఘ్నేశ్వర పూజారికీ, జై!" అంటూ రాజు వున్నచోటుకు పరిగెత్తి రాసాగారు.

నిత్యానంద రాజు రథం మీదనే వుండి, "నరకండి శత్రువులను! చంపండి శత్రువులను!" అంటూ అరిచాడు.



సైనికులు ఈటెలు ఎత్తి ఆటవికుల కేసి దూకబోయేంతలో, ఎదురుగా వున్న ఒక మిట్ట మీదికి ఒక రాకాసి ఏనుగు వచ్చి నిలబడింది. అది ప్రమాణంలో రెండు ఏనుగులంత వున్నది. దాని మీద విఘ్నేశ్వర పూజారి తల పైన కిరీటం పెట్టుకుని కూర్చుని వున్నాడు.

రాకాసిఏనుగును చూస్తూనే నిర్వ్యాసం దుడి సైనికులు గడగడ వణికిపోయి, చప్పున వెనుదిరిగి పారిపోసాగారు. ఆటవికులు వాళ్ళను తరుముతూ, రాజు వున్న రథాన్ని సమీపిస్తున్నారు. రాజు పెద్దగా గొంతెత్తి, "మహాశూరులైన ఆనందపుర సైనికులు తమ రాజునే రక్షించుకోలేరా? ఏమిటీ పిరికితనం! ఆటవికుల్ని ఎదిరించండి!" అంటూ అరవసాగాడు.

ఈ గలభాలో రథానికి కట్టివున్న గుర్రాల్లో ఒకటి బెదిరి, రథాన్ని పక్కకు లాగింది. రెండవ గుర్రం రథాన్ని సమీపిస్తున్న ఆటవికుల్లో ఒకళ్ళిద్దర్ని వెనకకాళ్ళతో గట్టిగా తన్నింది. తన సైనికులు తన రక్షణ సంగతి గాలికి వదిలి పారిపోతూండటం; తను విఘ్నేశ్వరపూజారి వేషాలవాళ్ళనుకున్న యువకులిద్దరూ కదలామెదలక నిలబడి వుండటం చూసి రాజు, "ఓ క్షత్రియ యువకులారా, మీరు పూజారి మనుములు కాదని తెలుసుకున్నాను. నన్ను వాడిచేత బడకుండా కాపాడారంటే, మీకు నా ఆస్థానంలో పెద్ద పెద్ద పదవులిస్తాను!" అన్నాడు.

రథం మీద భయంతో వణికిపోతున్న రాజునూ, అతన్ని పట్టుకునేందుకు ముందుకు వస్తున్న ఆటవికుల్నీ, దూరాన మిట్ట మీద నిలబడి వున్న రాకాసి ఏనుగునూ చూసి, జీవదత్తుడికి రాజు పైన జాలి కలిగింది. అతను క్షత్రవర్మను హెచ్చరిస్తూ, "క్షత్రా, సంగతి సందర్భాలేమిటో తరవాత తెలుసుకుందాం. ముందు మనం ఈ రాజును రక్షించాలి. ఆ రాకాసి ఏనుగు మీద కూర్చున్నవాణ్ణి చూస్తుంటే, నా కెందుకనో ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్టుంది!" అని చేత నున్న దండాన్ని



ముందుకు దాటి, ఆటవికుల్ని ఎడా పెడా కొడుతూ ముందుకురికాడు.

ఖడ్గవర్మ తన మిత్రుణ్ణుంచి యిలాంటి ప్రోత్సాహం ఎప్పుడు వస్తుందా అని కత్తి దూసి ఆటవికుల కేసి చూస్తూ నిలబడి వున్నాడు. జీవదత్తుడు తన దండంతో ఆటవికుల మీదికి దూకటం చూస్తూనే అతడు ఒక సింహనాదం చేసి, మెరుపులా పోయి ఆటవికుల మీద పడి, వాళ్ళను ఊచకోత కోయసాగాడు.

చచ్చినవాళ్ళనూ, గాయం పడినవాళ్ళనూ వదిలి మిగిలిన ఆటవికులు భీతితో అరుస్తూ, రాకాసి ఏనుగు వున్న దిక్కుకు వేగంగా పరిగెత్తసాగారు.

ఇది చూసి నిత్యానందరాజు సంతోషంతో ఉప్పొంగిపోయి, "ఆహా, ఏం క్షాత్రం! ఏం శౌర్యం! యిద్దరే యిద్దరు యువకులు, యమదూతల్లాంటి యింతమంది ఆటవికుల్ని ఎదుర్కొని తరిమికొట్టటమా! ఇలాంటిది నేను కథల్లో, వీరగాథల్లో చెప్పగా విన్నాను గాని, కంటితో యీనాటి వరకూ చూడలేదు," అన్నాడు.

"ఇప్పుడు చూశారు గనక, ఇక మీ దారిన మీరు, మీ నగరానికి వెళ్ళండి! వేటవ్యసనం కొద్దీ యీ అరణ్యాలకు వచ్చి మీరు చిక్కుల్లో పడి, మా బోటివాళ్ళను చిక్కుల్లో పెట్టకండి," అన్నాడు జీవదత్తుడు.

"మా నగరం వచ్చి, నేనిచ్చే బహుమానాలు స్వీకరించకుండానే వెళతారా? మీకు నా ఆస్థానంలో ఉన్నత పదవులు కూడా యిద్దామనుకున్నాను!" అన్నాడు రాజు.

"మాకు ఆ బహుమానాలూ, పదవులూ అవసరం లేదు. మేము తీర్థయాత్రలు చేస్తూ కాలం వెళ్ళబుచ్చ దలిచాం. ఇక సెలవు!" అంటూ జీవదత్తుడు, ఖడ్గవర్మ కేసి తల తిప్పి చూశాడు.

ఖడ్గవర్మ తన కత్తికి పట్టిన నెత్తురును వదిలించుకునేందుకు, దాన్ని ఒక పొద మీది ఆకులతో రుద్దుతూ, రాకాసి ఏనుగు కేసి కళ్ళార్పకుండా చూస్తున్నాడు. దావగా మిగిలిన ఆటవికులు ఆ ఏనుగు దగ్గిర చేరి,



దాని మీద కూర్చుని వున్న విశ్వేశ్వర పూజారితో ఏమో చెప్తున్నారు. పూజారి వాళ్ళతో మాట్లాడుతూ, మధ్య మధ్య తల తిప్పి ఖడ్గ జీవదత్తుల కేసి చూస్తున్నారు.

జీవదత్తుడు ఖడ్గవర్మను సమీపించి, "ఖడ్గా, నీ కత్తికి మళ్ళీ పని పడేలావుంది. ఆ ఏనుగు మీద వున్నవాడి వాలకం చూస్తూంటే, వాడు తిరిగి ఆటవికుల్ని మన మీదికి తోలేలా వున్నాడు." అన్నాడు.

జీవదత్తుడు మాట ముగించే లోపలే గుట్ట మీద వున్న రాకాసి ఏనుగు ఒక్కొక్క అడుగే వేస్తూ కిందికి దిగసాగింది. అది తన కాళ్ళను కదిలిస్తున్న తీరు చూసి ఖడ్గవర్మ ఆశ్చర్యపోతూ, "జీవా! ఇదే జాతి ఏనుగు? ప్రమాణంలో రెండు ఏనుగు లంత వున్నది. అది నడుస్తున్న తీరు చూశావా? అప్పుడే పుట్టిన ఏనుగుపిల్లలా కాళ్ళు అస్తవ్యస్తంగా వేస్తున్నది. దాని తొండం కదలటంలేదు. బిర్రబిగుసుకు పోయిన ట్టున్నది." అన్నాడు.

"ఇది అసలు ఏనుగేనా అన్న అను మానం నాకు కలుగుతున్నది, ఖడ్గా!" అంటూ జీవదత్తుడు, నిత్యానందుడి కేసి చూశాడు.

ఇప్పుడు నిత్యానందు డున్న రథం మీద గుర్రాలను అదిలిస్తూ ఒక సారథి కూర్చుని వున్నాడు. వాడు రథాన్ని వెనక్కు తిప్పే ప్రయత్నంలో వున్నాడు. సైనికులు చాలా మంది ఒక గుంపుగా అంత దూరంలో నిలబడి రాకాసిఏనుగు కేసి కళ్ళింత చేసుకుని చూస్తున్నారు. వాళ్ళు ఏ క్షణంలో అయినా అక్కణ్ణుంచి పారిపోయేందుకు తయారుగా వున్నారని జీవదత్తుడు గ్రహించాడు.

జీవదత్తుడు పెద్దగా గొంతెత్తి, నిత్యానందుడితో, "రాజా! నువ్వు త్వరగా రథాన్ని వెనక్కు తిప్పుకుని వెళ్ళిపోవటం మంచిది. అదుగో, నీ సైనికులు మరొకసారి నిన్నొదిలి పారిపోయేందుకు సిద్ధంగా వున్నారు," అన్నాడు అవహేళన చేస్తున్నట్టు.

నిత్యానందుడు తన సైనికుల కేసి తిరిగి, "మన కొచ్చిన భయం ఏమీ లేదు.



"ఈ మహావీరులైన యువకులు యిక్కడ వుండగా, ఆ రాకాసి ఏనుగు మనను ఏమీ చేయలేదు." అని చెప్పి, ఖడ్గ జీవదత్తులతో, "మీ శౌర్యసాహసాలు అపూర్వమైనవి. విఘ్నేశ్వర పూజారి వాహనం అయిన ఆ రాకాసి ఏనుగును ఎలా అయినా సంహరించారంటే, మీరు నన్నూ, నా రాజ్య ప్రజలనూ రక్షించినట్లే," అన్నాడు.

"ఆ ఏనుగును చూసి అంత భయపడతారేం? ఒక్క కత్తి దెబ్బతో దాని తొండాన్నో, కాలునో నరికి దాన్ని నేలకూల్చవచ్చునే!" అన్నాడు ఖడ్గవర్మ.

"కూడదు! అది ఐరావతంజాతి ఏనుగు. దాని శరీరం పైది చర్మం కాదు. ఉక్కు కవచం. మనం దాని కేసి బాణం కొడితే, అది దాని శరీరాన్ని తాకుతూనే ఖంగుమంటూ శబ్దం చేసి, ఎగిరి అంత దూరాన పడుతుంది. ఆ రాకాసి ఏనుగును చంపేందుకు అన్ని రకాల ప్రయత్నాలూ చేసి విఫలులమయ్యాకనే అటంటే, నేనూ, నా ప్రజలూ ఇంతగా భయపడుతున్నాము," అన్నాడు నిత్యానందుడు.

ఈ ఉక్కు కవచం అన్న మాట ఖడ్గవర్మకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అతడు జీవదత్తుడితో, "ఇది ఐరావతంజాతి ఏనుగా? దాని శరీరం మీద ఉక్కు కవచం ఉన్నదా? అలా అయితే పరీక్షించి చూద్దాం." అంటూ విల్లు పైకెత్తి ఏనుగు పొట్టకు తగిలేలా గురి చూసి బాణం వదిలాడు.

బాణం గురిగా పోయి ఏనుగు పొట్టను తాకింది. మరుక్షణం ఖంగుమంటూ పెద్ద శబ్దమైంది. ఖడ్గవర్మ విల్లు ఎత్తటం, బాణం వదలటం—అంతా జాగ్రత్తగా చూస్తున్న విఘ్నేశ్వరపూజారి, బాణం ఎగిరి దూరంగా పడగానే పెద్దగా నవ్వాడు.

"ఆ పూజారి ధైర్యం మెచ్చుకోదగింది. కాని అంతపెద్ద ఏనుగు ఏమిటి? దానికి ఉక్కు కవచం ఏమిటి? ఈ సంగతి తేల్చుకుని గాని, యిక్కణ్ణించి పోరాదు," అన్నాడు ఖడ్గవర్మ.



"అవును, ఖడ్గా! యిందులో ఏదో మోసం వుంది. పూజారి పెట్టిన కిరీటం ఏమిటి? వీడికి రాజుతో విరోధం ఎందుకు? గుడిపూజ మాని సింహాసనం ఎక్కి రాజ్యం పాలిందా అనుకుంటున్నాడా? జాగ్రత్తగా పద. యీ ఏనుగు సంగతేమిటో తెలుద్దాం." అన్నాడు జీవదత్తుడు.

ఖడ్గజీవదత్తులు తమ వద్దకు అతి నెమ్మదిగా నడిచివస్తున్న రాకాసి ఏనుగు కేసి బయలుదేరారు. ఇది చూసిన నిత్యానంద రాజూ, అతడి సైనికులూ నివ్వెరపోయారు. వాళ్ళకు ఇది దుస్సాహసంగా కనిపించింది. రాకాసి ఏనుగు ఏ క్షణాన అయినా వాళ్ళిద్దర్నీ తొండంతో పట్టుకుని గుంజి, కాళ్ళతో మట్టగించి చంపవచ్చునన్న భయం కలిగింది.

విశ్వేశ్వర పూజారి మాత్రం రాకాసి ఏనుగు మీద తొణుక్కుండా కూర్చుని దాని వెనకా, పక్కలనా వస్తున్న ఆటవికులకు ఏమో చెప్పి, ఖడ్గ జీవదత్తులతో, "మహావీరులారా! రండి, రండి. మీరు నా భృత్యుల్ని చంపారన్న కోపం నా కేమీ లేదు. నా తపశ్శక్తితో వాళ్ళను కావాలంటే యీ నిమిషానే బతికించగలను. కాని, యీ అరణ్యంలో ఆటవిక జనానికి ఏమీ లోటు లేదు గనక, ఆ పని చేయను. మీరు నా పక్షం వహించి, ఆ మాటతప్పిన రాజును తుదముట్టించేందుకు సహాయపడతారా? అలా చేశారంటే, మిమ్మల్ని ధనకనక వస్తు వాహనాలతో సత్కరించగలను!" అన్నాడు.

పూజారి మాటలు ఖడ్గ జీవదత్తులకు నవ్వు తెప్పించినై. వాళ్ళు రాకాసి ఏనుగుకు ఒక ఇరవై అడుగుల దూరంలో ఆగి, "పూజారీ! నువ్వు ఏనుగును అక్కడే ఆపు. మనం మాట్లాడవలసింది కొంత వున్నది." అన్నారు.

పూజారి ఏనుగు కుంభస్థలం మీద పిడికిటతో కొట్టాడు. ఏనుగు వున్న చోటునే నిలబడిపోయింది. జీవదత్తుడు ఏనుగు కేసి పరీక్షగా ఒకసారి చూసి, "పూజారీ! రాజు మాట తప్పాడన్నావు. ఏమిటది?" అని అడిగాడు.

విఘ్నేశ్వర పూజారి, ఖడ్గ జీవదత్తులకు తాను విఘ్నేశ్వరాలయంలో కన్న కల గురించీ, ఆ తరవాత రాజు తనను సభలో అవమానించి, దేశ బహిష్కారం చేసిన సంగతీ చెప్పి, "ఇప్పుడు నేను అధిరోహించి వున్న ఈ ఏనుగు, ఇంద్రుడి వాహనమైన ఐరావతానికి చాలా దగ్గిర బంధువు. దీని వయసు వెయ్యేళ్ళ పైనే వుంటుంది. దీని సాయంతో ఆనందపురాన్ని జయించబోతున్నాను. మీరు అనవసరంగా రాజు నిత్యానందుడికి సాయం చెయ్యబోయి చిక్కుల్లో పడకండి. ఇష్టమైతే నా పక్షానికి రండి. కోరినంత ధనం ఇస్తాను," అన్నాడు.


పూజారి మాటలు ఖడ్గజీవదత్తులకు ఆశ్చర్యంతో పాటు, అనుమానం కూడా కలిగించినై. ఖడ్గవర్మ, రాకాని ఏనుగు కేసి నడుస్తూ, "ఇది ఐరావతం జాతిదా? వెయ్యేళ్ళ వయసా? నడకతీరు చూస్తుంటే, ఇంకా తల్లిపాలు వదిలినట్టే లేదు!" అన్నాడు.

ఖడ్గవర్మ వెంట జీవదత్తుడు కూడా ఏనుగు దగ్గిరకు పోయాడు. వాళ్ళు దాని తొండం పట్టుకుని పరీక్షగా చూడసాగారు. ఆ సమయంలో విఘ్నేశ్వర పూజారి రాకాని ఏనుగు కుంభస్థలం మీద పిడికిలితో గట్టిగా పొడిచాడు. మరుక్షణంలో ఏనుగు తొండాన్ని గిర్రున తిప్పి, ఖడ్గ జీవదత్తుల శరీరాలను మెలివేసింది. అదే నిమిషంలో ఆటవికులు గుంపుగా వచ్చి వాళ్ళను పడిన పట్టుకున్నారు.

ఖడ్గ జీవదత్తులకు కాలూ చేయీ కదిపేందుక్కూడా అవకాశం లేకపోయింది. విఘ్నేశ్వర పూజారి అది చూసి పెద్దగా నవ్వుతూ, "ఈ ఇద్దర్నీ నేను గుహాలయానికి తీసుకుపోతాను. మీరు రాజు నిత్యానందుణ్ణి పట్టి కట్టి తీసుకురండి!" అని ఆటవికులను ఆజ్ఞాపించాడు.

ఆటవికులు పెడబొబ్బలు పెడుతూ, చెట్ల కింద వుండి యిదంతా చూస్తున్న రాజు నిత్యానందుడి కేసి పరిగెత్తారు. సారథి రథాన్ని వెనక్కు తిప్పాడు. నిత్యానందుడు తన సైనికులను, ఆటవికుల్ని ఎదుర్కోమని ఆజ్ఞాపించాడు. —(ఇంకా వుంది)





# రాతి రథం

## 15

[ముక్త జీవదత్తులు, రాజు నిర్యానందుడితో మాట్లాడుతూ ఉండగా, పూజారి రాకాసి ఏనుగుతో వచ్చి, ముక్త జీవదత్తులను దగ్గరకు పిలిచాడు. వాళ్ళిద్దరూ ఏనుగును సమీపించగానే, అది వాళ్ళను తొండంతో పవిచి పట్టుకున్నది. ఆటవికులు వాళ్ళను బంధించారు. నిర్యానందుడు తన సైనికులను, ఆటవికుల్ని ఎదుర్కోమని ఆజ్ఞాపించాడు. తరవాత—]

ఆటవికులు పెడబొబ్బలు పెడుతూ, ఈటెలూ, కత్తులూ పైకెత్తి తమకేసి రావటం చూస్తూనే, నిర్యానందుడి సైనికులు వెనుదిరిగి పారిపోసాగారు. రాజు చేసిన హెచ్చరికలేమీ వాళ్ళకు ధైర్యం కలిగించలేదు. రాజు ఎక్కి వున్న రథాన్ని అంతకు ముందే వెనక్కు తిప్పి వుంచిన సారథి, తన ప్రభువు ఆజ్ఞ యివ్వకముందే, గుర్రాలను అదిలించి పట్టణం కేసి పరిగెత్తించసాగాడు.

"సారథీ, మనం పిరికిపందల్లా యుద్ధరంగం నుంచి పారిపోయి వస్తున్నాం. ఇది విఘ్నేశ్వర పూజారికి మరింత ధైర్యాన్నిస్తుంది. వాడు మన నగరం మీదికే దాడి వచ్చినా రావచ్చు," అన్నాడు నిర్యానందుడు.

సారథి ఒక క్షణకాలం మౌనంగా వూరుకుని, "మహారాజా! ఆ పూజారి దృష్టిలో మనం ఏనాడో చులకన అయిపోయాం. మనం పారిపోయిరాక అక్కడే నిలబడి



సాధించేదేమిటి? ప్రాణాలు పోగొట్టుకోవటమో, లేక వాడికి బందీలుగా చిక్కి పోవటమో జరిగి వుండేది. దుస్సాహసం చేసిన ఆ ఇద్దరు క్షత్రియ యువకులూ ఏమయారో చూశారు గదా?" అన్నాడు.

"అవును, పాపం! వాళ్ళు మన కోసం తెగించి పోరాడారు. ఎలాంటి వీరత్వం వాళ్ళది! అలాంటివాళ్ళు మన సైనికుల్లో ఒక్కడు కూడా లేడు. విఘ్నేశ్వర పూజారి బహుశా వాళ్ళను ప్రాణాలతో వదలడు," అంటూ నిత్యానందుడు తల తిప్పి చూశాడు.

ఆ సమయంలో ఆటవికులు, విఘ్నేశ్వర పూజారి ఎక్కి వున్న రాకాసి ఏనుగు మీద ఖడ్గ జీవదత్తులను తాళ్ళతో కాళ్ళూ చేతులూ బంధించి, వాళ్ళ ముఖాలకు నల్లని గుడ్డలు చుడుతున్నారు.

రాజు రథం మీద వుండి తన కేసి చూస్తున్న సమయంలోనే, విఘ్నేశ్వర పూజారి కూడా తల ఎత్తి అతడి కేసి చూశాడు. అతడి మనస్సు క్రోధంతో నిండి పోయింది. కళ్ళు నిప్పులు చెరిగాయి. ఈ రోజుతో తను రాజును పట్టుకుని చంపి, ఆనందపుర నగరం చేరి సింహాసనం ఎక్కగల ననుకున్నాడు విఘ్నేశ్వర పూజారి. కాని, ఆ ప్రయత్నం విఫలమైపోయింది.

"ఈ ఇద్దరు యువకులూ ఆఖరి నిమిషంలో మన పాలిటి సైంధవుల్లా వచ్చి అడ్డపడి, ఆ నిత్యానందుడు మన చేతబడకుండా చేశారు. అయినా వీళ్ళను చంపకుండా, మన పక్షం చేసుకునే ఉపాయం ఆలోచించాలి. ఇద్దరూ మైకంలో వున్నారా, లేక ప్రాణాలు వదిలారా? కాస్త పరీక్షించి చూడండి!" అన్నాడు విఘ్నేశ్వర పూజారి.

అతడు అలా అనగానే ఆటవికుల్లో కొంచెం వైద్యం అదీ నేర్చిన వాడొకడు, ఏనుగు మీదికి ఎక్కి, ముందు ఖడ్గ జీవదత్తుల ముక్కుల దగ్గర వేళ్ళు పెట్టి చూసి, లాభం లేదన్నట్టుగా తలాడించి, తరవాత వాళ్ళ చేతులు పట్టుకుని నాడి పరీక్షించాడు. వాళ్ళింకా మరణించలేదన్న సూచనగా నాడి చాలా తగ్గుస్థాయిలో ఆడుతున్నది.



"పూజారిప్రభూ! వీళ్ళింకా చావలేదు. నాడి ఆడుతున్నది. మన చేత తిన్న దెబ్బలలో ప్రాణాలు కడబట్టి. స్పృహ మాత్రం కోల్పోయారు," అన్నాడు ఆటవికవైద్యుడు.

"అలా అయితే త్వరత్వరగా రండి. గుహాలయానికి చేరగానే, వీళ్ళ తిండీ తిప్పల సంగతి చూద్దాం. వీళ్ళు బతికుంటే మన పక్షం అయితే, ఆనందపురంతోపాటు మరి కొన్ని రాజ్యాలను కూడా జయించవచ్చు. ఈ ఐరావతం జాతి ఏనుగు రహస్యం మరి ఆట్టే కాలం దాగటం కష్టం!" అన్నాడు విఘ్నేశ్వరపూజారి.

ఖడ్గజీవదత్తులు నిజంగానే కొంత స్పృహ లేని స్థితిలో వున్నారు. వాళ్ళను బంధించి వున్న తాళ్ళు, శరీరానికి చాలా బాధ కలిగిస్తున్నవి. అంతేకాక ముఖం మీద కప్పి, గట్టిగా ముడివేసిన నల్లని వస్త్రంలో మంచి గాలి పీల్చుకోవటం. వాళ్ళకు ఎంతో ఆయాసం కలిగిస్తున్నది. అయినా వాళ్ళకు విఘ్నేశ్వరపూజారి అనే మాటలు కొంత అస్పష్టంగానే అయినా, వినిపిస్తూనే వున్నవి.

ఒక అరగంట కాలంపాటు పూజారి ఎక్కి వున్న ఏనుగు, బాగా మిట్టపల్లాలుగా వున్న ప్రాంతాలకుండా నడిచి ఒక చోట ఆగింది. పూజారి ఏనుగు మీది నుంచి దిగి, ఆటవికులతో. "వీళ్ళద్దర్నీ జాగ్రత్తగా దించి, గుహాలయంలో ఈశాన్యదిశగా వున్న గదిలోకి తీసుకుపోయి, కట్లన్నీ విప్పియండి. వీళ్ళకు నాలుగైదు రోజులకు సరిపడా ఆహారం, పానీయాలూ ఆ గదిలో వుంచండి. ఈ లోపల మనం సాధించవలసిన ఒక మహాకార్యం వున్నది!" అన్నాడు.

ఆటవికులు ఖడ్గజీవదత్తులను ఏనుగు మీది నుంచి దించి, డోలీలాంటి దాని మీద పడుకోబెట్టి తీసుకుపోయి, పూజారి చెప్పిన గుహాలయంలోని గదిలో దించారు. తరవాత వాళ్లు, ఖడ్గజీవదత్తుల ముఖాలకు కట్టిన వస్త్రాలు మాత్రం విప్పక, వాళ్ళ కట్లు మాత్రం విప్పి, ఆహారపదార్థాలు గదిలో ఒక మూలగా వుంచి బయటికి వెళ్ళిపోయారు. అప్పటివరకూ ఏ మాత్రం



స్పృహలేని వాళ్ళలా నటించిన ఖడ్గ జీవదత్తులు, ఆటవికుల అలికిడి పోగానే, తమ తమ ముఖాల మీద వున్న నల్లని వస్త్రాలను గబగబా విప్పి, అవతల పారేసి, లేచి కూర్చున్నారు.

గదిలో అంతగా వెలుగు లేదు. గదికి ఎక్కడా కిటికీలు గాని, తలుపుగాని వున్న సూచనలు లేవు. అయినా ఎక్కడి నుంచో సన్నగా గాలి వస్తున్నది. జీవదత్తుడు గది అంతా ఓమారు కలయ చూసి, ఆశ్చర్యంగా తన కత్తి, విల్లుల కేసి చూసుకుంటున్న ఖడ్గవర్మతో, "ఖడ్గా, అంత ఆశ్చర్య మెందుకు? పూజారి మన ఆయుధాలేవీ అపహరించలేదు. కారణం తెలుసు గదా? మనసు మంచి చేసుకుని, తన అనుచరులుగా అట్టే పెట్టుకోవాలన్నది, అతడి ప్రయత్నం!" అన్నాడు.

ఖడ్గవర్మ కోపంగా కత్తి పైకెత్తి, "ఆ దుష్టుడి ప్రయత్నం ఏదైతే నాకేం! నేను మాత్రం వాణ్ణి దొరికితే ప్రాణాలతో వదలను. వింధ్యపర్వతాల కేసి మన మానాన మనం పోతూంటే, అనవసరంగా అడ్డపడి, మనకు లేనిపోని శ్రమా, శరీర బాధా కలిగించాడు వాడు!" అన్నాడు.

"ఉష్! అంత పెద్దగా మాట్లాడకు. చీకటికి కళ్ళూ, గోడలకి చెవులూ వుండొచ్చు అంటారు పెద్దలు. ఈ గది వైశాల్య మెంతో, ఎక్కడైనా తలుపులూ, దర్వాజాల్లాంటివి వున్నవేమో ముందు నన్ను చూడనీ." అంటూ జీవదత్తుడు లేచి, రాతి గోడను తడువుతూ చుట్టూ ఓసారి కలయ తిరిగాడు. అతడి కెక్కడా గోడలో తలుపులు వున్నట్టు కనిపించలేదు. కాని, రాళ్ళల్లో వున్న సందుల నుంచి గాలి మాత్రం లోపలికి వస్తున్నది. అంటే, యీ గుహాలయంలోని యీ భాగాన్ని ఎవరో కేవలం రాతి మీద రాతిని పేర్చి, గోడలుగా పైకి లేపేశారు.

జీవదత్తుడు, ఖడ్గవర్మ దగ్గిరకు తిరిగి వచ్చి, యీ సంగతే చెప్పి, "ఖడ్గా, మనకు ప్రస్తుతానికి పూజారివల్ల ప్రాణాపాయం లేదు. మనం ఏనుగు మీద వుండగా అతడు అటవి

కులతో అన్న మాటలు రెండు నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తున్నవి!" అన్నాడు.

"వాడు తన బంట్లతో చాలా వాగాడు. నీ కాశ్చర్యం కలిగించే మాట లేమిటి?" అని ప్రశ్నించాడు ఖడ్గవర్మ.

"వాడు అన్న మాటల్లో, ఈ ఐరావతం జాతి ఏనుగు రహస్యం మరి ఆట్టేకాలం దాగటం కష్టం, అన్నదొకటి; తాను రెండు మూడు రోజుల్లో ఏదో ఒక మహా కార్యాన్ని సాధించవలసి వున్నదనటం, రెండవది!" అన్నాడు జీవదత్తుడు.

"అయితే ఆ ఏనుగు ఐరావతం జాతిదై వుండాలి, లేకపోతే అసలది ఏనుగే కాదు! పోతే, వాడు సాధించబోయే మహా కార్యం ఏముంటుంది, ఆనందపుర సింహాసనం ఆక్రమించుకోవటం తప్ప!" అన్నాడు ఖడ్గవర్మ.


"ఖడ్గా, సరిగ్గా నీ కొచ్చిన అనుమానాలే నాకూ వచ్చినై. ఇవాల్టికి హాయిగా యిక్కడ విశ్రాంతి తీసుకుని రేపు సూర్యోదయంతోనే, మనం బయటపడి, యీ విఘ్నేశ్వరపూజారి అంతు తేలుద్దాం," అన్నాడు జీవదత్తుడు.

"అలాగే చేద్దాం. నాలుగైదు రోజులకు సరిపడా ఆహారం, పళ్ళూ, పానీయాలూ మనకు అమర్చాడు గదా, పూజారి. ఆహా, వాడెంత పుణ్యాత్ముడు!" అంటూ పెద్దగా నవ్వాడు ఖడ్గవర్మ.



ఆ పగలు గడిచిపోయింది. సూర్యాస్తమయమై పోయిందన్న సూచనగా ఖడ్గ జీవదత్తులున్న గది మరింత గాఢాంధకారమై పోయింది. వాళ్ళు పూజారి నొకళ్లు పెట్టి పోయిన ప్రమిదదీపాలను వెలిగించి, ఆ వెలుగులో భోజనాలు ముగించి, హాయిగా పడుకుని నిద్రపోయారు.

మర్నాటి ఉదయం గది బయట రేగిన పెద్ద అలికిడికి వాళ్ళిద్దరూ హఠాత్తుగా మేలుకున్నారు. ఆటవికులు వందల సంఖ్యలో ఒక చోట గుమిగూడి ఏదో మాట్లాడుకుంటున్నట్టుగా వాళ్ళున్న గదిలోకి ధ్వనులు రాసాగినై. ఖడ్గ జీవదత్తులు చెవులు రిక్కించి, వాళ్ళు మాట్లాడుకుంటున్న



దేమిటో వినాలని ప్రయత్నించారు. కాని, సాధ్యం కాలేదు.

"జీవా, విఘ్నేశ్వరపూజారి ఆటవిక మూకతో మళ్ళీ ఎక్కడికో దాడి బయలుదేరుతున్నట్టున్నది!" అన్నాడు ఖడ్గవర్మ.

"ఆ దాడి ఎక్కడికో అయి వుండదు. బహుశా వాడు నిత్యానందరాజును హతం చేసి సింహాసనం ఆక్రమించుకునేందుకు ఆనందపురం మీదికే బయలుదేరుతూండి వుంటాడు!" అన్నాడు జీవదత్తుడు.

"అలా అయితే మనం ఆ దుర్మార్గుడి బందీలుగా యిక్కడ చేతులు ముడుచుకుని కూర్చుండవలసిందేనా?" అన్నాడు ఖడ్గవర్మ.

"అలా ఎందుకూర్చుంటాం! ఆ ఆటవిక మూకతో వాడు బయలుదేరి పోగానే, మనం గది నుంచి బయటపడతాం. ఆ తరవాత పరిస్థితినిబట్టి ఏం చేయాలో ఆలోచిస్తాం," అన్నాడు జీవదత్తుడు.

"ఈ చీకటి కొట్టు నుంచి బయిటికి పోవటం అంత తేలికా ఏం?" అన్నాడు ఖడ్గవర్మ ఆశ్చర్యంగా.


"ఎందుకు కాదు? చూస్తూ వుండు!" అంటూ జీవదత్తుడు గోడ దగ్గిరకు పోయి రాళ్ళ మధ్య వున్న సన్నని సందుల గుండా బయిటికి చూశాడు. అతడి కంటికి అయిదారు అడుగుల దూరంలో అలాంటిదే మరొక గోడ అడ్డుగా వుండటం కనిపించింది.

"రాళ్ళ మీద రాళ్ళు, గోడల పక్కన గోడలు—అది యీ గుహాలయం తీరు! అయినా ఫరవా లేదు. బయట ఆటవికుల హడావిడి తగ్గని, అప్పుడు చూద్దాం," అన్నాడు జీవదత్తుడు.

ఒక అరగంట తరవాత ఆ ప్రదేశమంతా తిరిగి నిశ్శబ్దమైపోయింది. జీవదత్తుడు మరి కొంచెం సేపు, ఏదైనా అలికిడి అవుతుందేమో అని చూసి, అలాంటిదేమీ లేక పోవటంతో ఖడ్గవర్మ కేసి తిరిగి, "ఖడ్గా, యీ గదిలోంచి బయిటికి పోయేందుకు మార్గం ఎక్కడున్నదో కనుక్కునేందుకు మనం అనవసరంగా శ్రమ పడటం

ఎందుకు? నిన్న సాయంకాలం మనను యిక్కడ వదిలిపోయిన వాళ్ళు, ఏ రహస్య మార్గాన వచ్చారో, వాళ్ళచేతే ఆ మార్గాన్ని తెరిపిద్దాం. నువ్వు మాత్రం ఆ వచ్చిన వాళ్ళను తప్పని సరైతే తప్ప లేకపోతే చంపకు!" అని చెప్పాడు.

ఆ తరవాత జీవదత్తుడు గది అన్ని మూలలనూ కలయ తిరుగుతూ, పెద్దగా గొంతెత్తి, "విఘ్నేశ్వర పూజారీ! విఘ్నేశ్వర పూజారీ!" అని కేకలు ప్రారంభించాడు. ఖడ్గవర్మ కూడా తన మిత్రుడితోపాటు మరింత బిగ్గరగా అరవసాగాడు.



ఒకటి రెండు నిమిషాల్లో గది గోడల్లో ఒక మూలగా వున్న నలుచదరపు రాయి ఒకటి పెద్దగా శబ్దం చేస్తూ పక్కకు జరిగింది. ఆ వెంటనే ఒక ఆటవికుడు గదిలోకి తొంగి చూస్తూ, "ఎందుకలా గోడలు అదిరేలా కేకలు వేస్తున్నారు?" అని కోపంగా ఖడ్గ జీవదత్తులను ప్రశ్నించాడు.

జీవదత్తుడు ఎంతో ఆశ్చర్యపడుతున్న వాడిలా ఆటవికుడి కేసి ఓ క్షణకాలం చూసి, చప్పున మెరుపులా ఒక్క దూకున పోయి వాడి గొంతు పట్టుకుని, "పెనుగులాడావో గొంతు పిసికి చంపుతాను, జాగ్రత్త! ప్రాణం మీద ఆశ వుంటే నేనడిగే ప్రశ్నలకు చిన్నగా జవాబు లివ్వు. ముందు నువ్వు లోపలికి రా!" అంటూ వాణ్ణి మెడ పట్టుకుని బరబరా లోపలికి యీడ్చి, గోడవాలున కూర్చొబెట్టాడు.

ఆటవికుడు ప్రాణభయంతో గడగడ వణికి పోసాగాడు. జీవదత్తుడు భయపడ వద్దన్న సూచనగా అతడి భుజం తట్టి, "ఇంకా యీ గదికి కాపలా వాళ్ళెంత మంది వున్నారు?" అని అడిగాడు.

"నేను కాక యింకొక్కడే! మిగతా వాళ్ళంతా పూజారి ప్రభువుతో కలిసి ఆనంద పురం మీదికి దాడి చేయబోయారు," అన్నాడు ఆటవికుడు.

"అలాగా! అయితే నువ్వు ఆ కంత దగ్గరకు పోయి, ఆ రెండోవాణ్ణి కూడా భయం లేదని చెప్పి, లోపలికి పిలువు.

వాడికేమైనా హెచ్చరిక యిచ్చావే, నీ వెన్నులో ఉంటా నా మిత్రుడు కత్తి గుచ్చుతాడు!" అన్నాడు జీవదత్తుడు.

ఆటవికుడు రాయి తొలగించిన చోటుకు పోయి, బయటికి తలపెట్టి, వాడి తోటికాపలా వాణ్ణి లోపలికి రమ్మని పిలిచాడు. ఈ సమయంలో ఖడ్గవర్మ తన కత్తిని ఆటవికుడి వీపుకు ఆనించి వుంచాడు. ఒక నిమిషం జరిగి జరక్కముందే రెండవ కాపలావాడు కంతలోంచి గదిలోకి వచ్చాడు. అప్పటిగ్గాని వాడికి తన తోటివాడు బందీలిద్దరి చేతుల్లో బందీగా వున్నాడని తెలియలేదు. వాడు చప్పున వెనుదిరిగి పారిపోబోయాడు. కాని ఖడ్గవర్మ వాడి భుజం పట్టుకుని గది మధ్యకు విసిరివేశాడు.


"ఇప్పుడు నిజం చెప్పండి. లేకపోతే మీ ఇద్దరి తలలూ యీ క్షణానే నరికేస్తాం. ఆ పూజారి వెంట మీ ఆటవికులంతా వెళ్ళారా, లేక కొంత మంది యీ గుహల్నీ, గుట్టల్నీ కాపలా కాస్తూ వున్నారా?" అని అడిగాడు జీవదత్తుడు.

ఖడ్గవర్మ కత్తి పైకెత్తి ఆటవికుల తలలకు గురి చేసి నిలబడ్డాడు. ఆటవికులు గడగడ వణికిపోతూ, "బాబూ, మమ్మల్ని చంపకండి. మా వాళ్ళంతా పూజారిప్రభువు వెంట ఆనందపురం కేసి వెళ్ళారు. మమ్మల్నిద్దర్నీ మాత్రం మీకు కాపలాగా వదిలిపోయారు, నిజం!" అన్నారు వాళ్ళు.

"అయితే, మీ ఇద్దరూ ఒక గంట కాలం యీ గదిలోనే వుండండి. మేము ఆ లోపలే తిరిగి వచ్చి, మిమ్మల్ని క్షేమంగా బయటికి పంపుతాం," అన్నాడు జీవదత్తుడు.

ఆటవికులు బతుకుజీవుడా అనుకుని ఖడ్గ జీవదత్తులకు చేతులు జోడించి నమస్కరించారు. తరవాత జీవదత్తుడూ, ఖడ్గవర్మా గది నుంచి బయటికి పోయి, కంతకు ఎప్పటిలా రాయిని అడ్డం పెట్టారు. వాళ్ళు—దిగువనున్న మెట్ల మీదుగా కొంత దూరం నడిచి ఒక గుహలోకి పోయి, అక్కడ సోపానంలా వున్న మెట్లెక్కి కొండ పై భాగాన్ని చేరారు.

—(ఇంకా వుంది)





## 16

[విఘ్నేశ్వరపూజారి తనకు చిక్కిన ఖడ్గ జీవదత్తులను ఒక గుహాలయంలో బంధించాడు. ఆటవికుల దాడికి తట్టుకోలేక నిత్యానందరాజు తన నగరానికి పారిపోయాడు. ఖడ్గ జీవదత్తులు తమకు కావలా వున్న వాళ్ళను గుహాలయంలోని చీకటి గదిలోకి దాగి, గదిద్వారాన్ని రాతితో మూసి, గుహలో వున్న మెట్లెక్కి కొండ మీదికి చేరారు. తరవాత—]

కొండ మీద వున్న ఖడ్గ జీవదత్తులకు ఆనందపురం కేసి పోతున్న విఘ్నేశ్వర పూజారి ఎక్కిన రాకాసి ఏనుగూ, దానికి కొంచెం వెనగ్గా నడుస్తున్న ఆటవికులూ కనిపించారు.

"జీవా! మనం యీ దుర్మార్గుడైన పూజారిని హతం చేసి, నిత్యానందరాజును కాపాడాలి. బయలుదేరుదామా?" అన్నాడు ఖడ్గవర్మ.

ఆ మాటకు జీవదత్తుడు నవ్వి, "ఆ నిత్యానందరాజు పట్టి పిరికిప్రాణి! ఆలాంటి రాజును మనం యివ్వాళ యీ విఘ్నేశ్వర పూజారి నుంచి కాపాడినా, రేపు ఏ మహేశ్వర పింజారో వచ్చి పదభ్రష్టుణ్ణి చేయక మానడు. పైగా, యీ గొడవంతా మనకు సంబంధించనిది!" అన్నాడు.

"మనకు సంబంధించనిదెలా అవుతుంది? మన దానికి అడ్డం వచ్చి,



మోసంతో ఆ దొంగ పూజారి మనను బంధించాడు. దానికి పగ తీర్చుకోవలసిందే!" అన్నాడు ఖడ్గవర్మ.

"అయితే పద, ఆలస్యమెందుకు!" అంటూ జీవదత్తుడు మరొకసారి నగరం కేసి పోతున్న విఘ్నేశ్వరపూజారి గుంపు కేసి చూసి, కొండ దిగసాగాడు. ఖడ్గవర్మ అతణ్ణి అనుసరించాడు.

"మనం యీ గుంపు కంట బడకుండా కొంచెం ముందుగా ఆనందపురాన్ని చేరటం బావుంటుంది. అప్పుడు రాజును హెచ్చరించి, విఘ్నేశ్వరపూజారిని ఎదిరించేందుకు తగిన ప్రయత్నాలు చెయువచ్చు." అన్నాడు ఖడ్గవర్మ.

"నాకు ఆ రాజు ధైర్యసాహసాల్లో ఏ మాత్రం విశ్వాసం లేదు. ఈ పూజారి రాకాసి ఏనుగు మీద రావటం చూస్తూనే, అతడు కోట గోడను మరో వైపు నుంచి దూకి పారిపోయినా పోవచ్చు. ముందు మనం యీ ఏనుగును హతమార్చేందుకు తగిన పథకం ఆలోచించాలి." అన్నాడు జీవదత్తుడు.

"అదేదో మర ఏనుగులా నాకు తోస్తున్నది! నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు ఖడ్గవర్మ.

"అది మర ఏనుగే కావచ్చు! కాని దాన్ని నాశనం చేస్తే తప్ప రాజుకూ, అతడి సైనికులకూ ఆత్మవిశ్వాసం కలగదు. లేకపోతే వాళ్ళు అటవికులకు నగరాన్ని ఒప్పచెప్పి, తాము అడవుల్లోకి పారిపోతారు." అన్నాడు జీవదత్తుడు.

ఇద్దరూ ఇలా మాట్లాడుకుంటూ విఘ్నేశ్వరపూజారి ముఠా వెనకగా ఆనందపురం కేసి కొంతదూరం నడిచారు. క్రమంగా పూజారి ఎక్కి వున్న ఏనుగు నగర ప్రాకారాన్ని సమీపించింది. దాని రాక చూస్తూనే నగర ద్వారప్రాంతాల వున్న ప్రజలు హాహాకారాలు చేస్తూ, తెరచి వున్న ద్వారం గుండా నగరంలోకి పారిపోసాగారు.

"ఖడ్గా! పూజారి కంట బడకుండా నగరంలోకి పోవటానికి యిదే మంచి అవకాశం.

మనం యీ దారి వదిలి, ఆ కనిపించే చెట్ల వెనగ్గా పోయి పారిపోతున్న ప్రజల వెంట నగరం ప్రవేశిద్దాం." అన్నారు జీవదత్తుడు.

ఆ వెంటనే ఇద్దరూ నగర ప్రాకార ప్రాంతాల వున్న చెట్ల కేసి పరిగెత్తి, అక్కడ వున్న జనంతో కలిసి, నగరద్వారం దాటి లోపల ప్రవేశించారు. అంతలో రాకాసి ఏనుగు ద్వారాన్ని సమీపించింది. ద్వారాన్ని కాపాడుతున్న భటుల్లో కొందరు పారిపోగా, మిగిలిన వాళ్ళు ద్వారాన్ని చప్పున మూసేశారు.

నగరంలో పెద్ద సంచలనం బయలు దేరింది. "రాకాసి ఏనుగు! విఘ్నేశ్వర పూజారి!" అంటూ కొందరు వీధుల వెంట పరిగెత్తసాగారు. ఆ గందరగోళానికి రాజు నిత్యానందుడు తన గది నుంచి బయిటికి వచ్చారు. ఆతడికి వీధుల వెంట పరిగెత్తు తున్న ప్రజలూ, మూసి వున్న నగరద్వారం వెనక నిలబడి, ఏమి చేయుటమా అని ఆలోచిస్తున్న ద్వారరక్షక భటులూ కని పించారు.

రాజు నిత్యానందుడు భవన ప్రాంగ ణంలో వున్న సేవకుల్లో ఒకణ్ణి కేక వేసి పిలి చారు. వాడు పరిగెత్తుకుంటూ వచ్చి రాజుకు పరిస్థితి అంతా గబగబా చెప్పేశాడు. అంతా విన్న రాజుకు ముచ్చెమటలు పోశాయి. ఏ ఆయుధానికీ లొంగని ఆ రాకాసి ఏను



గుతో విఘ్నేశ్వర పూజారి తన నగరంలోనే ప్రవేశించబోతున్నాడన్నమాట!

"ఒరే, నువ్వు వెంటనే పోయి సేనా నాయకుడితో సైనికులందరినీ నగరద్వారం దగ్గిర సమాయత్త పరచమన్నానని చెప్పు. నేనూ వస్తున్నాను. ఏనుగు ద్వారాన్ని పగల కొట్టకముందే సైనికులందరూ అక్కడికి చేరాలి!" అని చెప్పాడు నిత్యానందుడు సేవకుడితో.

"చిత్తం, ప్రభూ!" అని సేవకుడు అక్కణ్ణించి కదిలే లోపలే నగరద్వార ప్రాంతం నుంచి ధఢీధఢీ మంటూ పెద్ద ధ్వనులు ప్రారంభమయినై. విఘ్నేశ్వర పూజారి ఏనుగు తన తలతో ద్వారాన్ని పడ



కొట్టేందుకు ఢీ కొంటున్నది. దాని పక్కన ఆటవికులు పెద్దగా అరుస్తూ, ద్వారాన్ని బద్దలు కొట్టేందుకు రాళ్ళతో బాదుతున్నారు.

జనంతోపాటు రాజభవనం పక్కన వున్న వీధికి చేరిన ఖడ్గ జీవదత్తులు, భవనం మీద తన సేవకుడితో మాట్లాడుతున్న రాజు నిర్వ్యానందుణ్ణి చూశారు. వాళ్ళు రాజు దగ్గిరకు పోయి నగర రక్షణకు ఏదైనా ఉపాయం చెప్పదామనుకునేంతలో, నగరద్వారం వైపు నుంచి భయంకరమైన ధ్వనులు రాసాగినై.

"ఖడ్గా! ఈ సమయంలో రాజును కలుసుకోవటం సాధ్యమయ్యే పని కాదు. ఒక పావు గంటలో పూజారి ద్వారాన్ని బద్దలు కొట్టి నగరంలో ప్రవేశించవచ్చు. కనక మనమే ఏదైనా ఉపాయం ఆలోచించి వాణ్ణి, ఆ రాకాసి ఏనుగునూ నాశనం చేయాలి." అన్నాడు జీవదత్తుడు.

"నా ఆలోచన కూడా అదే! రాజు ఏమైతే మనకేం? ఆ పూజారి దుర్మార్గుణ్ణి హతం చేసి మన దారిన మనం పోదాం!" అన్నాడు ఖడ్గవర్మ.

"వాణ్ణి ఆ ఏనుగుతోపాటు చంపటానికి మనకు ధైర్యం గలవాళ్ళు కొందరు సాయం చేయాలి. మనం ఆ ప్రయత్నంలో వుండగా వాడి ఆటవికమూక నగరాన్ని దోచి, అమాయకుల్ని చంపకుండా చూడాలి. ఈ పని పూనుకున్న తరవాత ప్రజల ప్రాణరక్షణ మన బాధ్యత అవుతుంది గదా! అదుగో, సైనికులు వస్తున్నారు! ఆ వెనక వచ్చే రథంలో వున్నది నిర్వ్యానంద రాజేనా?" అన్నాడు జీవదత్తుడు.

"అవును. ఆ రథంలో వున్నది ఆ పిరికి వెధవే! వాడు రాజేమిటి — తరాజు!" అన్నాడు ఖడ్గవర్మ చిదరించుకుంటున్నట్టు.

అంతలో సేనానాయకుడు సైనికులతో పట్టణ ద్వారాన్ని సమీపించాడు. ఆ సరికి ద్వారంలో రాకాసి ఏనుగు దెబ్బల తాకిడికి కొన్ని చిల్లులు ఏర్పడినై. ఆటవికులు వాటిలో నుంచి లోపలికి బాణాలూ, ఈటెలూ విసురుతున్నారు. సేనానాయకుడు తన సైనికులను ద్వారానికి కొంచెం ఎడంగా నిలిపి,

ఏనుగు లోపలికి రాగానే దాన్ని ఎలా ఎదుర్కోవాలో చెప్తున్నాడు.

రాజా నిత్యానందుడు రథంమీద వేగంగా వచ్చి తన సైనికుల వెనగ్గా దాన్ని ఆపిం దాడు. అతణ్ణి చూస్తుంటే ఖడ్గ జీవదత్తులకు ఎంతో జాలికలిగింది. రాజా ముఖంలో భయకంపితుడైన వాడి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతడి పక్కన మరొక వ్యక్తి కూర్చుని వున్నాడు. అతడి దుస్తుల తీరుచూసి మంత్రి అయివుంటాడనుకున్నారు ఖడ్గజీవదత్తులు.

"ఖడ్గా, నే నొక ఉపాయం ఆలోచిం చాను. రాజుతో మాట్లాడేందుకు యిదే మంచి సమయం, రా!" అంటూ జీవదత్తుడు రథాన్ని సమీపించి, "మహారాజా!" అంటూ గట్టిగా పిలిచాడు.

నిత్యానందుడు ఆ పిలుపు వింటూనే ఖడ్గ జీవదత్తుల కేసి చూసి అదిరి పడి, "మీరా? ఆ దుర్మార్గుడి వలలో చిక్కి ఎలా బయట పడగలిగారు?" అన్నాడు.

"మహారాజా, అదంతా యిప్పుడు కాదు. తరవాత చెప్తాం. పూజారి ఏనుగు ఒకసారి నగరంలో ప్రవేశించిందంటే, మీ సైనికులంతా చెల్లాచెదరుగా పారిపోతారు. అప్పుడు ఆట వికులు నగరాన్ని తప్పక కొల్లగొట్టి తీరుతారు. కనక ఉపాయంతో ఆ దుర్మార్గుణ్ణి జయిం చాలి," అన్నాడు జీవదత్తుడు.



"మహాయోధుడా, నువ్వన్నది నిజం! ఆ ఏనుగును చూస్తే మాకు యముణ్ణి చూసిన దానికంటె అధికంగా భయం కలుగుతున్నది. ఏమిటా ఉపాయం?" అని అడిగాడు నిత్యానందుడు.

"అది మీతో రహస్యంగా చెప్పవలసిన సంగతి. నన్ను రథం మీదికి రమ్మన్నారా?" అన్నాడు జీవదత్తుడు.

"నిరభ్యంతరంగా రావచ్చు. వీరు మా మహామంత్రి!" అంటూ నిత్యానందుడు తన పక్కన వున్న వ్యక్తిని చూపించాడు.

"అందరూ మహా మహా గాళ్ళే! పట్టి మహా మహా పిరికి వెధవలు!" అను కున్నాడు ఖడ్గవర్మ తన మనసులో.



జీవదత్తుడు రథం మీదికి పోయి, "మహారాజా! ఈ రథం మీద వెంటనే మీ ఉద్యానవనానికిపోయి, అక్కడ వున్న ఏదైనా లతా గృహంలో దాక్కొండి. మీరు అక్కడ వున్నట్టు పూజారి నమ్మేందుకు వీలుగా రథాన్ని, ఉద్యానవన మార్గంలో ఎక్కడైనా వదలండి! ఆ దుర్మార్గుణ్ణి తుదముట్టించే పని మహా మంత్రికీ, మాకూ వదలండి!" అన్నాడు.

నిత్యానందుడు నీ అభిప్రాయం ఏమిటన్నట్టు మంత్రి కేసి చూశాడు. మంత్రి ఒకసారి తలాడించి, "మహారాజా! ఈ యిద్దరు క్షత్రియ యువకుల బల పరాక్రమాల సంగతి నేను లోగడే విన్నాను. ఒక తెలివితేటల సంగతంటారా? అంత కపటి యైన విష్ణ్వేశ్వర పూజారికి చిక్కకుండా తప్పించుకు రాగలిగారంటేనే తెలుస్తున్నది!" అన్నాడు.

"మహారాజా, మీరు ఉద్యానవనానికి వెళ్ళి వుండండి. ఒక ఎత్తు వేసి మేము పూజారిని ఏనుగుతోపాటు అటుకేసి నడిపి, దారిలోనే హతం చేస్తాం. మీకేలాంటి భయమూ లేదు." అన్నాడు జీవదత్తుడు.

మంత్రీ, జీవదత్తుడూ రథంనుంచి దిగారు. నిత్యానందరాజు రథాన్ని ఉద్యానవనం కేసి తోలమని సారథిని ఆజ్ఞాపించాడు. జీవదత్తుడు, మంత్రితో రహస్యంగా కొద్దిసేపు మాట్లాడి, ఖడ్గవర్మ కూడా వెంటరాగా, అందరూ కలిసి నగర ద్వారం దగ్గిరకు వెళ్ళారు. అక్కడ మంత్రి సేనానాయకుణ్ణి పిలిచి, ఖడ్గ జీవదత్తులను అతడికి చూపి, "ఈ క్షత్రియ యువకులు అడిగిన సహాయం అల్లా నువ్వు చెయ్యాలి. పూజారిని తుదముట్టించేందుకు వీళ్ళిద్దరూ మంచి పథకం వేశారు. నేను మాత్రం యిక్కడే వుంటా. పూజారిని ఉద్యానం వైపుకు వెళ్ళేలా ప్రోత్సహిస్తాను." అన్నాడు.

ఖడ్గ జీవదత్తులు, సేనానాయకుణ్ణి కొంచెం పక్కకు తీసుకుపోయి తమ ఎత్తుగడ అంతా అతడికి వివరించారు. వెంటనే అతడు ఒక ఇరవై మంది సైనికులను వెంట

పెట్టుకుని. వీధిలో నూనె మొదలైనవి అమ్మే దుకాణాల కేసి పోయారు. ఖడ్గజీవ దత్తులు కూడా వాళ్ళ వెనగ్గా నడిచారు.

మంత్రి ద్వారాన్ని సమీపించి అక్కడ కావలా వున్న భటులతో తలుపు తెరవమన్నారు. ద్వార రక్షకులు కొంచెం ఆశ్చర్య పోయి, అయినా మంత్రిగారి ఆజ్ఞ గనక మరికొందరి సహాయం తీసుకుని ద్వారాన్ని బార్లా తెరిచారు. వాళ్ళకు ఎదురుగా రాకాని ఏనుగు మీద విఘ్నేశ్వరపూజారి కని పించాడు.

పూజారి వున్న ఏనుగు ద్వారం దాటి లోపలికి రాగానే మంత్రి దాన్ని సమీపించి, పూజారితో. "విఘ్నేశ్వర పూజారి! ఎలాంటి రక్తపాతం లేకుండా నువ్వు ఈ ఆనంద పురానికి రాజువు కాబోతున్నావు. మా రాజు గారికి రాత్రి కలలో విఘ్నేశ్వరస్వామి కని పించి, స్వయంగా అయన్ని నీ తల మీద కిరీటం పెట్టమన్నారట! రాజుగారిప్పుడు ఉద్యానవనంలో ఒంటరిగా వున్నారు. నీవు నిరాటంకంగా అక్కడికిపోవచ్చు!" అన్నాడు.

"ఇందులో మోసం ఏమీ లేదుగదా?" అన్నాడు పూజారి అమితాశ్చర్యంతో.

"మోసం చేయదలిస్తే, నీకు నగర ద్వారం తెరిచి లోపలికి ఎందుకు రానిచ్చే వాళ్ళం? ఒకసారి నీ ఆటవిక భృత్యులతో నగరం ప్రవేశించిన తరవాత, నిన్నెవరూ యిక్కడ అడ్డుకోలేరన్న సంగతి నీకు తెలి యంది కాదు గదా? పోతే, నీ ఆటవికు లందర్నీ రాజభవనం ఆవరణలో కూర్చొని



విశ్రాంతి తీసుకోమని చెప్పు. లేకపోతే వాళ్ళు నగరాన్ని కొల్లగొట్టే ప్రమాదం వున్నది. ఇప్పుడు యీ మహానగరం నీది గదా?" అన్నాడు మంత్రి.

మంత్రి మాటల్లో విఘ్నేశ్వర పూజారికి పూర్తి నమ్మకం కలిగింది. అతడు ఏనుగు తలమీద ఎడికాలితో గట్టిగా కొట్టి, "ఉద్యానవనం కేసి నడు!" అన్నాడు.

రాకాసి ఏనుగు కదలబోయేంతలో మంత్రి చేతులెత్తి పెద్ద గొంతుతో, "విఘ్నేశ్వర పూజారీ, కొంచెం ఆగు! ముందు నీ ఆటవికులందర్నీ ఆ కనబడే భవన ప్రాంగణంలోకి పొమ్మని ఆజ్ఞాపించు. అక్కడ వాళ్ళకు కావలసిన ఆహారం, సారా సమృద్ధిగా భవన సేవకులు తెచ్చి యిస్తారు," అన్నాడు.


పూజారి ఆ మాట ఆటవికులకు చెప్పాడు. వాళ్ళు ఎక్కడలేని ఉత్సాహంతో కేకలు వేస్తూ, భవనం ముందున్న విశాల ప్రదేశంలోకి పరిగెత్తి పోయారు. ఆ ప్రదేశానికి చుట్టూ చాలా ఎత్తయిన గోడ ఒకటి వున్నది. ఆ గోడ పైభాగం పది పన్నెండడుగుల వెడల్పు కలిగి, కాపలావాళ్ళు తిరిగేందుకు వీలుగా వుంటుంది.

ఆటవికులందరూ ప్రాంగణంలోకి పోగానే మంత్రి, పూజారితో, "విఘ్నేశ్వరపూజారీ! నువ్వు లేని సమయంలో నీ భృత్యులు నగరం దోచుకునేందుకు ప్రయత్నించవచ్చు. అందుకని వాళ్ళున్న ప్రాంగణ ద్వారం తలుపులు మూయించి, బయట నీ వాళ్ళను కాపలాపెట్టు," అన్నాడు.

కిరీటం ఎప్పుడు నెత్తికెక్కుతుందా, అని ఉవ్విళ్ళూరుతున్న పూజారి, మంత్రి చెప్పినట్టే చేశాడు. తరవాత రాకాసి ఏనుగు తల మీద గట్టిగా కొట్టి, "ఉద్యానవనానికి, ఊఁ!" అంటూ అదిలించాడు.

"ఇదేదో మానవభాష నేర్చిన ఏనుగులా వున్నది!" అనుకున్నాడు మంత్రి. అతనికి ఖడ్గజీవదత్తులు చెప్పిన పల విషయమంతా అయేలాగే కనిపించింది. ఆశాపాశకుడైన విఘ్నేశ్వరపూజారి తను చెప్పిన దానికల్లా తల వూపటం అతనికి అంతగా ఆశ్చర్యం కలిగించలేదు. —(ఇంకా వుంది)






## 17

[రాజు విత్యానందుడు తన నగరానికి పారిపోగానే, విఘ్నేశ్వరపూజారి ఆటవికమూకను వెంటబెట్టుకుని నగరం మీదికి వచ్చాడు. నగరద్వారాన్ని అతను బద్దలుకొట్టే సమయంలో, అగ్నిదేవదత్తులు రాజూ, అతని మంత్రికి ఒక సలహా యిచ్చారు. మంత్రి నగరద్వారాన్ని తెరిపించాడు. పూజారి ఉద్యానవనం కేసి బయలుదేరాడు. తరవాత—]

ఉద్యానవనమార్గానికి రెండు వైపులా ఎత్తయిన వృక్షాలున్నవి. వాటి కొమ్మలు ఒకదానికొకటి పెనవేసుకుపోయివున్నై. పూజారి ఆ దారి వెంట కొంతదూరం వెళ్ళేసరికి చెట్ల మీది నుంచి ఎవరో, "విఘ్నేశ్వర పూజారి పైన పన్నీరు వర్షం కురిపించండి!" అని కేకపెట్టాడు.

ఆ వెంటనే చెట్ల మీది నుంచి పూజారి పైన కర్పూరతైలం జల్లులా పడింది.

పూజారి ఉగ్రుడైపోయి, "ఎవర్రా చెట్టు కొమ్మల్లో? ఈ అవమానానికి మిమ్మల్ని చిత్రవధ చేయిస్తాను!" అంటూ అరిచాడు.

"స్నానం పూర్తయినట్టుంది! మండుతున్న గుడ్డముక్కలు మీదికి విసరండి!" అంటూ, యీసారి మరొక కంఠం కేక పెట్టింది.

మరుక్షణంలో చెట్లకొమ్మల్లో నుంచి భగ భగ మండుతున్న గుడ్డముక్కలు విఘ్నే



శ్వర పూజారి ఎక్కి వున్న రాకాసి ఏనుగు మీద పడసాగినై. చూస్తూండగానే తైలంలో బాగా తడిసి వున్న ఏనుగు మీద అక్కడక్కడా పెద్ద మంటలు లేచినై. పూజారి తలమీద కూడా చిన్న మంటలేచింది.

"ఇది మోసం! కామన్న రాజుకు ద్రోహం!" అంటూ పూజారి ఏనుగు మీద నిలబడి తల మీద మండుతున్న కిరీటాన్ని తీసి దూరంగా పారవేశాడు. అదే సమయంలో ఏనుగు శరీరం లోంచి చాలా కంఠాలు గందరగోళంగా అరవసాగినై. దాని నాలుగు కాళ్ళూ నాలుగు వైపులకు పరిగెత్తే ప్రయత్నం చేస్తున్నట్టు, అది అడ్డదిడ్డంగా అడుగులు వేయసాగింది.

పై నుంచి యింకా దాని మీద మండుతున్న గుడ్డముక్కలు వచ్చి పడుతూనే వున్నాయి.

"ఇప్పా. మనం ఊహించినట్టే యిది నిజమైన ఏనుగు కాదు! ఎవడో తెలివైన దొంగవెధవ, ఏనుగు ఆకారాన్ని తయారు చేసి, అందులో తన మనుషుల్ని పెట్టి నడిపిస్తూ, రాజు నిత్యానందుణ్ణి హడల కొట్టాడు," అన్నాడు జీవదత్తుడు.

"అదుగో, ఒక్కొక్క ఆటవికుడూ ఏనుగు పొట్టలోంచి, కాళ్ళల్లోంచి బయటికి వస్తున్నారు. ఏనుగు పక్కకు కూలి పోతున్నది! మంటల్లో చిక్కుకుని పూజారి గాడు చావకముందే, వాణ్ణి పైకి లాగాలి!" అంటూ ఖడ్గవర్మ చెట్టు కొమ్మల్లోంచి ఒక ఉచ్చుతాడు విసిరి, పూజారి నడుముకు బిగించి, పైకి గుంజాడు. పూజారి గాలిలో కాళ్ళూ, చేతులూ అల్లల్లాడిస్తూ, "అయ్యో, రక్షించండి! నా శరీరం కాలిపోతున్నది!" అంటూ అరవసాగాడు.

ఈ లోపల పెద్దగా మండుతూ ఏనుగు కింద పడిపోయింది. దాని శరీరం లోంచి అనేకమంది ఆటవికులు గగ్గోలుగా అరుస్తూ బయిటికి రాసాగారు. అలా వచ్చిన వాళ్ళందరినీ, సమయానికి అక్కడికి వచ్చిన సేనా నాయకుడు తన సైనికుల చేత ఒక చోట మంద వేయించసాగాడు. ఖడ్గవర్మ పూజారిని చెట్టు పై నుంచి కిందికి జార్చాడు.



పూజారి తన శరీరాన్ని చుట్టుముట్టిన మంటల్ని ఆర్పుకునేందుకు నేల మీద అటూ యిటూ దొర్లటం ప్రారంభించాడు.

చెట్టు దిగి వచ్చిన ఖడ్గ జీవదత్తులు, పూజారి మీద ఇంత దుమ్ముకొట్టి మంటలు ఆర్పి, ఆతన్ని మెడ పట్టుకుని లేపి నిలబెట్టారు. ఖడ్గవర్మ కసిగా పళ్ళు కొరికి కత్తి దూసి, పూజారి కంఠానికి గురి చేసి, "దుర్మార్గుడా! మా దారికి అడ్డు తగిలి, మమ్మల్ని మోసంతో బంధించినందుకు యిదుగో, నీ తల యిప్పుడే నరకబోతున్నాను," అన్నాడు.

విఘ్నేశ్వరపూజారి వణికిపోతూ, "మహాప్రభో, నా తల నరక్కు! నేను నమ్మిన స్వామే నాకు కలలో కనిపించి, నాలో రాజ్యకాంక్ష రేపాడు. కాని, ఈ మాయ ఏనుగు తంత్రం పన్నిన వాణ్ణి నేను కాదు. అదంతా స్వర్ణదారిది!" అన్నాడు.


జీవదత్తుడు, ఖడ్గవర్మ చేయి పట్టుకుని ఆపి, పూజారిని, "ఆ స్వర్ణదారి ఎక్కడ?" అని ప్రశ్నించాడు.

పూజారి బాధతో పెద్దగా మూలిగి, "వాడు మాయ ఏనుగు కుంభస్థలంలో వుంటాడు. అక్కడ వుండి ఏనుగులో వాడు అమర్చిన మరల్ని, గిలకల్ని అటవికుల చేత తిప్పిస్తుంటాడు. వాడింకా బయిటికి రాలేదా?" అన్నాడు కాలిపోతున్న ఏనుగు కేసి చూస్తూ.

పూజారి యిలా అనగానే జీవదత్తుడు గబగబా పోయి, కాలుతున్న ఏనుగు తల మీద సైనికుల చేత నీళ్ళు పోయించి, మంటలు తగ్గిపోగానే, దాని తొండం పట్టుకుని పైకి ఎత్తించాడు. వెంటనే లోపలి నుంచి ఒక మనిషి రాయిలా దభీమంటూ కింద పడ్డాడు. వాడిలో స్పృహ లేదు.

"వాడే స్వర్ణదారి! విఘ్నేశ్వరస్వామి, వీడూ కలిసి నా ప్రాణం మీదికి తెచ్చారు!" అన్నాడు పూజారి.

"నీ దురాశే నిన్ను యిన్ని చిక్కుల్లో పెట్టింది; ఇతరుల్ని నిందించకు!" అని జీవదత్తుడు పూజారిని గట్టిగా కోప్పడి, స్వర్ణదారి ముఖాన నీళ్ళు చల్లించాడు.



కొద్ది సేపటికల్లా స్వర్ణాచారి కళ్ళు తెరిచి చుట్టూ కలయ చూస్తూ, "నే నెక్కడు న్నాను? పూజారి రాజయ్యాడా?" అని అడిగాడు.

"వాడు రాజూ కాలేదు, నువ్వు మంత్రివీ కాలేదు. మీ ఇద్దరూ ఒళ్ళు కాల్చుకుని అఘోరిస్తున్నారు. కొద్ది సేపట్లో నిత్యానంద రాజు యిక్కడికి వచ్చి మిమ్మల్ని చిత్రవధ చేయిస్తాడు!" అన్నాడు ఖడ్గవర్మ కసిగా.

ఖడ్గవర్మ మాటలు వింటూనే స్వర్ణాచారి లేచి కూర్చుని, తల తిప్పి దూరంగా నిలబడి వున్న విఘ్నేశ్వర పూజారిని చూసి, "ఐరావతాన్ని నగరంలోకి తీసుకు పోవద్దు, రహస్యం బయట పడిపోతుందని నెత్తీ నోరూ కొట్టుకుని చెప్పినా, నువ్వు నా మాట విన్నావు కావు. ఇప్పుడు మనిద్దరికీ చావు తప్పదు!" అన్నాడు ఏడ్పుముఖం పెట్టి.

"ఒట్టి చావు కాదు; చిత్రవధ చేయించి మరీ మిమ్మల్ని చంపిస్తాను!" అంటూ రాజు నిత్యానందుడు ఒక పొదరింటి చాటు నుంచి బయటికి వచ్చి, ఖడ్గ జీవదత్తులతో, "మ హా శూ రు లా రా! మీ శక్తి సామర్థ్యాలతో నన్నూ, నా రాజ్యాన్నీ, యీ దుర్మార్గుల నుంచి కాపాడారు. మీకేం కావాలో కోరండి, యిస్తాను!" అన్నాడు.

"మీ నుంచి మేము ఎలాంటి బహూకృతీ ఆశించటం లేదు. పెద్ద ఆపద తప్పింది కనక, యిక సుఖంగా రాజ్యం ఏలుకోండి. వీళ్ళిద్దర్నీ, వీళ్ళ అనుచరులైన ఆటవికుల్నీ తీసుకుని మా దారిన మేం పోతాం," అన్నాడు జీవదత్తుడు.

"వీళ్ళనూ, ఆటవికుల్నీ ప్రాణాలతో వదలటమా? ఆటవికుల్ని ఆ వ ర ణ లో బంధించి, పైనున్న గోతుల నుంచి వాళ్ళ మీద కర్పూరతైలం పోయించి, వాళ్ళు బాగా తడిసిన తరవాత, అందరి మీదా మండుతున్న గుడ్డలు వేయించి నిలువునా దహించబోతున్నాను. మీరు యీ మాయ ఏనుగు మీద ప్రయోగించిన అస్త్రాన్నే, నేను వాళ్ళ మీద ప్రయోగిస్తాను," అన్నాడు నిత్యానందుడు.



"మహారాజా! ఎంతటి శత్రువునైనా అంత క్రూరంగా చంపటం న్యాయం అని ఎంచుకోదు. జరిగిందేదో జరిగిపోయింది— ఇప్పుడు యీ పూజారిని, స్వర్ణాదారిని, అటవికుల్ని మీ రాజ్యసరిహద్దులు దాటించి, ముందు ముందు మీ కెలాంటి ప్రమాదం రాకుండా చేస్తాం," అంటూ జీవదత్తుడు స్వర్ణాధారిని రెండు చేతులూ పట్టుకుని నిలబెట్టి, పూజారితో, "విఘ్నేశ్వరపూజారీ, అలా గజగజ వణికిపోకు! మా వెంటరా. ముందు నీ అనుచరులైన అటవికుల్ని కాపాడాలి," అంటూ బయలుదేరాడు.


"మహాశూరుడా! మా ఆజ్ఞ..." అంటూ నిత్యానందుడు ఏమో చెప్పబోయేంతలో ఖడ్గవర్మ చర్రున కత్తి దూసి, "శూరుడూ, వీరుడూ అంటూ వెకిలిగా మాట్లాడకు! ఇక్కడ ఆజ్ఞ లిచ్చేది నువ్వు కాదు, జీవదత్తుడు! తెలిసిందా?" అన్నారు.

రాజు కోపంతో నిలువెల్లా కంపించిపోయాడు. అతడు పెద్దగా గొంతెత్తి, "నా రాజ్యంలో....నా భవన ప్రాంగణంలో ....నా ఎదుట,..." అంటూ ప్రారంభించేసరికి, మంత్రి అతణ్ణి సమీపించి చిన్నగా ఏదో చెప్పాడు. రాజు కొంచెం శాంతపడి, అక్కళ్ళించి వెళ్ళిపోతున్న ఖడ్గ జీవదత్తుల్ని, తన బద్ధశత్రువుల్ని చూస్తూ పళ్ళు కొరకసాగాడు.

ఖడ్గ జీవదత్తులు, అటవికులు బంధింపబడి వున్న ప్రదేశం చేరేసరికి, కొందరు సైనికులు గోడల పై భాగాన చేరి, దిగువనున్న అటవికుల మీద కుండలతో కర్పూర తైలం గుమ్మరిస్తున్నారు. అది చూస్తూనే ఖడ్గ జీవదత్తులు, "ఆగండి! ఆగండి!" అంటూ కేకలు పెట్టారు.

"ఈ అడివి మనుషుల్ని సజీవంగా కాల్చి చంపమని సేనాని ఆజ్ఞ!" అంటూ సైనికులు జవాబిచ్చారు.

ఖడ్గ జీవదత్తులు పరుగు పరుగున గోడను సమీపించి అక్కడ వున్న మెట్ల మీదుగా పైకి పోయారు. సైనికులు కేరింతలు కొడుతూ అటవికుల మీద కర్పూరతైలం




పోస్తున్నారు. ఆటవికులు భయకంపితులై పోయి హహాకారాలు చేస్తూ, మూసి వున్న ద్వారాన్ని పగల కొట్టేందుకు వ్యర్థప్రయత్నాలు చేస్తున్నారు.

"మా ఆజ్ఞ ఏమిటో మీరు విన్నట్టు లేదు!" అంటూ ఖడ్గ జీవదత్తులు సైనికులలో అందిన వాళ్ళను అందినట్టుగా కాళ్ళతో తన్ని, చేతులతో ఎత్తి, గోడల మీంచి కింద అగాధంలో వున్న ఆటవికుల మధ్యకు నెట్టసాగారు. తమ మీద వచ్చి పడుతున్న సైనికులనూ, వాళ్ళను తన్ని పడదోస్తున్న ఖడ్గ జీవదత్తులనూ చూడగానే, ఆటవికులకు పోయిన ప్రాణాలు తిరిగి వచ్చినట్టయింది.

"అయ్యా, మమ్మల్ని యీ రాజభటుల నుంచి రక్షించి, తలుపులు తెరిపించండి! మా దారిన మేము అరణ్యానికి పోతాం. బతికి వుండగా తిరిగి యిటు కేసి చూడనైనా చూడం!" అంటూ ఆటవికులు చేతులెత్తి ఖడ్గ జీవదత్తులకు దణ్ణాలు పెట్టసాగారు.

కొద్దిసేపటికల్లా సైనికుల్లో ఆటవికుల మధ్య పడినవాళ్ళు పడగా, మిగతావాళ్ళు అక్కణ్ణించి పారిపోయారు. ఖడ్గ జీవదత్తులు పై నుంచి దిగి, ఆవరణ ద్వారం దగ్గరకు వచ్చారు. ద్వారాన్ని కాపలా కాస్తున్న ఇద్దరు సైనికులు వాళ్ళను చూస్తూనే, "సేనాని ఆజ్ఞ..." అంటూ ఏమో చెప్పబోతుండగా, జీవదత్తుడు దండంతో ఆయిద్దర్నీ గట్టిగా మోదాడు. సైనికులు భయకంపితులైపోయి పక్కకు తప్పుకున్నారు. ఖడ్గవర్మ కత్తితో తలుపులను బంధించి వున్న తాళ్ళను నరికి, తలుపులను బార్లా తెరిచాడు. బిలబిలమంటూ ఆటవికులు బయటికి వచ్చారు. వాళ్ళల్లో కొందరు ఖడ్గ జీవదత్తులకు సాష్టాంగపడ్డారు.

"మీ కొచ్చిన ప్రాణభయం ఏమీ లేదు. మీరు హాయిగా తిరిగి మీ అరణ్యప్రాంతాలకు వెళ్ళండి. కాని యికె ఎన్నడూ, ఏకామ్రేశ్వరపూజారి లాంటి దుర్మార్గుల వలలో పడి చిక్కుల పాలవకండి," అని హితం చెప్పాడు జీవదత్తుడు.


CHITRA

"అయ్యా, ఆ పూజారి, ఆదారి ఎక్కడ? వాళ్ళు నమ్మబలికి మాకు చాలా ద్రోహం చేశారు. వాళ్ళను మా కాళీమాతకు బలి యిస్తాం!" అన్నాడొక ఆటవికుడు.

ఖడ్గ జీవదత్తులు, పూజారి ఎక్కడున్నాడా అని చుట్టూ కలియచూశారు. వాళ్ళకు పూజారీ, స్వర్ణాదారీ దూరంగా ఒక చెట్టు కింద నిలబడి మాట్లాడుకుంటూ కనిపించారు. వాళ్ళకు కొంచెం ఎడంగా నిత్యానందరాజూ, మంత్రీ, సేనానాయకుడూ మరొక చెట్టు కింద నిలబడి, ఏవో మంతనాలాడుతున్నారు. వాళ్ళకు వెనగ్గా సైనికులు బారులు తీరి నిలబడి వున్నారు.

"ఖడ్గా! ఈ రాజు వాలకం చూస్తుంటే, ఆటవికుల్ని, పూజారి, స్వర్ణాదార్లను యిక్కడే చంపించే పథకం ఏదో ఆలోచిస్తున్నాడని అనుమానం కలుగుతున్నది." అన్నాడు జీవదత్తుడు.

"ఆ దుర్మార్గు లిద్దరి సంగతేమోగాని, ఆటవికుల్ని మాత్రం క్షేమంగా వాళ్ళ అరణ్యప్రాంతం చేర్చే బాధ్యత మనమీద వున్నది. వాళ్ళను తమ కపటనాటకంలో కీలుబొమ్మల్లా పూజారీ, స్వర్ణాదారీ వాడుకున్నారు." అన్నాడు ఖడ్గవర్మ.

జీవదత్తుడు ఏదో జవాబివ్వబోయేంతలో రాజు నిత్యానందుడు హడావిడిగా సైనికుల దగ్గరకు వెళ్ళాడు. సేనాని రాజు వెనగ్గా పోయి చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు. మంత్రి మాత్రం వున్నచోటునే నిలబడి, సైనికుల కేసి, ఖడ్గ జీవదత్తుల కేసి మాటి మాటికి తల తిప్పి చూస్తున్నాడు.

"ఖడ్గా, ప్రమాదం! రాజు తన సైనికులను ఆటవికుల మీదికి ఉసికొల్పుతున్నాడు; అందులో సందేహం లేదు!" అని జీవదత్తుడు ఆటవికులతో, "మీరందరూ ఆయుధాలతో సిద్ధంగా వుండండి. మీ నాయకుడెవరు?" అని అడిగాడు.

ఆటవికుల్లో నుంచి ఒక ఆజానుబాహుడైన వ్యక్తి ముందుకు వచ్చి, ఖడ్గ జీవదత్తులకు తలవంచి నమస్కరించి. "అయ్యా, నేనే వీళ్ళ నాయకుణ్ణి!" అన్నాడు.

—(ఇంకావుంది)





## 18

[ఉద్యానవనానికి వెళ్ళే దారిలో విఘ్నేశ్వరపూజారి ఎక్కిన రాజావారి ఏనుగు మీద నూనె పోసి, ఖడ్గ జీవదత్తులు దానికి నిప్పుపెట్టారు. రాజా విద్యానందుడు తన సైనికులను ఆటవికుల మీదికి ఉసికొల్ప చూశాడు. ఆటవికుల్లో నుంచి ఒక అజానుబాహుడు ముందుకు వచ్చి తాను ఆటవికుల నాయకుణ్ణని జీవదత్తుడితో చెప్పాడు. తరవాత—]

జీవదత్తుడు ఆటవికనాయకుణ్ణి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు. వాడి తీక్ష్ణమైన చూపూ, ధీమాగా నిలుచున్న తీరూ చూసి జీవదత్తుడికి, వాడి శక్తి సామర్థ్యాలలో గట్టి నమ్మకం కుదిరింది.

"మంచిది! నీ వాళ్ళందర్నీ అవసరం అయితే సైనికులను ఎదుర్కొనేందుకు సిద్ధంచెయ్యి. మీరై మీరు మాత్రం వాళ్ళను కవ్వించకండి!" అని జీవదత్తుడు, నాయకుడికి చెప్పి, పూజారి, స్వర్ణాదార్లను పిలిచి, "మీరు మా పక్కనే వుండండి. లేకపోతే చిక్కుల్లో పడతారు." అన్నాడు.

"అటు రాజూ, యిటు యీ ఆటవికులూ మమ్మల్ని చంపాలని చూస్తున్నారు. మాకేది దారి?" అంటూ విఘ్నేశ్వరపూజారి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

"నగరద్వారం దాటిన తర్వాత ఆ దారి సంగతి ఆలోచిస్తాం. మా దగ్గర వున్నంత



వరకూ మీకు అటవికుల నుంచి ప్రమాదం రాదు. రాజు సంగతి మేం చూస్తాం.'' అన్నాడు జీవదత్తుడు.

అంతలో రాజు నిత్యానందుడు పెద్దగా గొంతెత్తి, ''మహావీరులారా! ఆ అటవిక మృగాలను మీరే నిరాయుధుల్ని చేసినా సరే, లేకపోతే మీరు దారి తొలగినట్టయితే ఆ పని మా సైనికులు చేస్తారు.'' అన్నాడు.

''మాకు తెలుసు, మహారాజా! ముందు అటవికుల్ని మంచి మాటలతో నిరాయుధుల్ని చేసి, ఆ తరవాత వాళ్ళను చిత్రవధ చేయించాలని మీరు ఆలోచిస్తున్నారు. అది కుదరదు! మీరూ, వాళ్ళూ నగరం బయట బలిపెట్టుకుని పోరాడండి. మేము ప్రేక్షకులుగా వుంది ఫలితం ఎలా వుంటుందో చూస్తాం.'' అన్నాడు జీవదత్తుడు.

''నా రాజ్యంలో .. నా నగరంలో వుండి ... నన్నే అజ్ఞాపించటం ...'' అంటూ నిత్యానందుడు మాట్లాడ సాగేసరికి, ఖడ్గవర్మ చర్రున కత్తిదూసి, ''ఆపాత చచ్చు పుచ్చు కబుర్లన్నీ కట్టిపెట్టు! వినూ, నీ కిరీటాన్ని రక్షించింది మేము! ఇక్కడ మేము ప్రభువులం!'' అని అటవికులతో, ''అందరూ నగరద్వారం బయటికి పద వండి,'' అన్నాడు.

అటవికులు ద్వారం కేసి కదిలారు. జీవదత్తుడు, పూజారినీ, ఆచారినీ వాళ్ళవెనగ్గా నడవమని చెప్పి, రాజుతో, ''మహారాజా! నగరద్వారం వెలపల అటవికులతో మీరు పోరాడవచ్చు. విజయం ఎవరిదవుతుందో చూసి, మా దారిన మేంపోతాం.'' అన్నాడు.

రాజు ఉగ్రుడైపోయి తన సైనికులను నగరద్వారం కేసి నడవమని ఆజ్ఞాపించాడు. కొద్దిసేపటికల్లా అటవికులూ, సైనికులూ ద్వారందాటి, దాని ముందున్న మైదానంలో, ఒకరికెదురుగా ఒకరు ఆయుధాలతో యుద్ధ సన్నద్ధులై నిలబడ్డారు. ఖడ్గ జీవదత్తులు పూజారి, ఆచార్లతో రెండు పక్షాల మధ్యా వున్న ఖాళీస్థలంలో నిలబడ్డారు.

నిత్యానందరాజు, పక్కన వున్న మంత్రి, సేనానాయకుల కేసి ఓ మారు తలాడించి,

ఖడ్గ జీవదత్తులతో, "మహాశూరులారా! ఇక మీరు పక్కకు తప్పుకోండి. ఆటవిక పశువులను చెండాడమని నా సైనికులకు ఉత్తరువివ్వబోతున్నాను." అన్నాడు.

జీవదత్తుడు ఆటవిక నాయకుడితో, "విన్నావా? మీ అందరికీ కొద్ది క్షణాల్లో చావో బతుకో తేలబోతున్నది." అని చెప్పి, రాజుతో, "మహారాజా! మరోసారి ఆలోచించుకోండి! ఆటవికులు ఓడితే చచ్చిన వాళ్ళు చావగా మిగిలిన వాళ్ళు అరణ్యంలోకి పారిపోయి హాయిగా బతుకుతారు. కాని, మీరు ఓడారో, మీ సింహాసనం పోతుంది! మీరు ప్రాణాలతో పారిపోగలిగితే, అరణ్యాలలో ఆకలములు తింటూ శేషజీవితం గడపవలసి వస్తుంది!" అన్నారు.

ఆ మాటలు వింటూనే రాజు ముఖం వెల వెల పోయింది. మంత్రి అది గమనించి అందరూ వినేలా పెద్ద గొంతుతో, "మహారాజా! లోగడ మీకు చెప్పనే లేదే! మీ తండ్రిగారు మరణించే ముందు తమ కోర్కెగా ఒక సంగతి నాతో చెప్పారు. ఏ పరిస్థితుల్లోనూ నగరద్వారం వెలపల రక్తపాతం జరగరాదనీ, అలా జరిగితే తన ఆత్మకు శాంతి వుండదని అన్నారు." అని చెప్పాడు.

"అవును, ఆ సంగతి మర్చిపోయాను. మహా మంత్రీ, సమయానికి గుర్తు చేశావు.



లేకపోతే తండ్రిగారి తుది కోర్కెకు భంగం కలిగించి, వారి ఆత్మకు శాంతి లేకుండా చేసి వుండేవాడిని! సరే, సైనికులంతా నగరంలోకి పదండి!" అంటూ నిత్యానంద రాజు నగరద్వారం తెరిచి దారి తీశాడు.

"పిరికి వెధవకు సమయానికి మంత్రి మంచి సాకు చూపాడు!" అంటూ ఖడ్గవర్మ పెద్దగా నవ్వాడు.

ఆటవికుల నాయకుడు ముందుకు వచ్చి జీవదత్తుడితో, "అయ్యా, మాకు అనుమతివ్వండి! దుర్భాషలాడే ఈ రాజునూ, అతడి సైనికులనూ ఈటెలకు గుచ్చి నగరద్వారం ముందు నిలబెడతాం." అన్నాడు.



"యువ క్షత్రియసింహమా! అనుమతించు. ఈ రాజు చావుకు మహా విఘ్నేశ్వరుడు కూడా చాలా సంతోషిస్తాడు!" అన్నాడు పూజారి ఉత్సాహంగా.

"నేడు ముయ్యా! నీ చావుకన్నా ఆ మహావిఘ్నేశ్వరుడు, తప్పక సంతోషిస్తాడు!" అని ఖడ్గవర్మ, పూజారిని మందలించి నగరద్వారం కేసి చూశాడు.

రాజు నిత్యానందుడు తన సైనికులతో ద్వారం వెనక నిలబడి, ఖడ్గ జీవదత్తుల కేసి నిప్పులు చెరిగే కళ్ళతో చూస్తున్నాడు. ఏ క్షణంలో అయినా సైనికులు తమ మీదికి దూకవచ్చునన్న అనుమానం ఖడ్గ జీవదత్తులకు కలిగింది.

"ఖడ్గా, ఈ రాజులో పిరికితనం పాలూ, మొండితనం పాలూ సరిసమానంగా వున్నట్టు కనబడుతున్నది. అనవసర రక్తపాతం తప్పేలా లేదు." అన్నాడు జీవదత్తుడు.

"సమ ఉజ్జీలైన శత్రు పక్షాల మధ్య జరిగే పోరాటం అనవసర రక్తపాతం ఎలా అవుతుంది? అది అవసరం అయిన రక్తపాతమే! ఇక్కడ రాజుకి అహంకారం వున్నట్టు కనబడటం లేదు. బలవంతుడూ, ధైర్యవంతుడూ, పోరాటంలో చాకచక్యం వున్నవాడూ జయిస్తాడు. అనవసర కాలయాపన ఎందుకు? యుద్ధమో, శాంతో యిప్పుడే తెలుస్తాను." అంటూ ఖడ్గవర్మ ఒక అటవికుడి నుంచి ఈటె ఒకటి తీసుకుని రాజు కేసి ముందుకు పోయి, "నిత్యానందరాజా! నీకు అటవికులతో యుద్ధం చేయాలన్న చేతి దురద యింకా వదిలినట్టు లేదు. ఇదుగో, నేను ఈటె ఎత్తి ఒకటి, రెండు, మూడు అనే లోపల మీరు నగరద్వారం మూయించినా సరే, లేకపోతే నగరద్వారం దాటి మైదానంలోకి వచ్చినా సరే!" అని ఒకటి, రెండు, మూడు అన్నాడు.

ఖడ్గవర్మ మూడు అనే లోపలే నగర ద్వారం చటుక్కున మూసుకుపోయింది. అటవికులు విజయ సూచకంగా కేకలు పెట్టారు. ఖడ్గవర్మ తన చేతిలో వున్న ఈటెను బలంగా మూసి వున్న ద్వారాని కేసి

గట్టిగా విసిరాడు. అది వేగంగా పోయి ద్వారానికి తపీమంటూ గుచ్చుకున్నది.

"రాజుకు జ్ఞానోదయం అయినట్టున్నది. యిక మన దారిన మనం పోదాం," అన్నాడు జీవదత్తుడు.



అందరూ కదిలి ఒక గంట కాలం గడిచే సరికల్లా అరణ్యప్రాంతం చేరారు. అక్కడ ఆటవికులు ఖడ్గ, జీవదత్తులకు గొప్ప విందు చేశారు. స్త్రీలూ, పురుషులూ కలిసి ఆట పాటలతో వాళ్ళను వినోదపరిచారు. సూర్యాస్తమయానికి యింకా ఒకటి రెండు గంటల కాలముండగా, ఖడ్గ జీవదత్తులు ఆటవికులకు వీడ్కోలు చెప్పి, తిరిగి ప్రయాణం ఆయారు.


అంతవరకూ వాళ్ళ వెంట వుండి ఆటవికుల నుంచి ఎలాంటి ప్రాణభయం లేకుండా కాలం గడిపిన, విఘ్నేశ్వరపూజారి, స్వర్ణాచారి, ఖడ్గ జీవదత్తులు బయలు దేరగానే, వాళ్ళ వెంట పడి, "అయ్యా, మమ్మల్ని యిక్కడే వదిలేసి పోతున్నారా? సూర్యాస్తమయం లోపల యీ ఆటవికులు మమ్మల్ని చిత్రవధ చేస్తారు!" అంటూ గోలెత్తారు.

"వీళ్ళద్దర్ని ఏం చేద్దామంటావ్, ఖడ్గా?" అని అడిగాడు జీవదత్తుడు.

"ఏం చేయటమనేది, యీ ఆటవికులు వింటుండగా చెప్పి లాభం లేదు. మన వెంట ఆ కనబడే కొండల వరకూ తీసుకుపోయి, అక్కడ ఏమి చేయటమో ఆలోచిద్దాం. వింధ్యపర్వతాల వరకూ యీ జంగుపిల్లుల్ని వెంట తీసుకుపోలేం గదా?" అన్నాడు ఖడ్గవర్మ.

"జంగుపిల్లులమైనా, యీ అరణ్యంలో ఏ కుందేలునో, అడవి కోడినో పట్టుకు తిని సుఖంగా బతికేవాళ్ళం. మనుషులం అవటం వల్లే యిన్ని చిక్కులొచ్చాయి. ఆ మహా విఘ్నేశ్వరుడు కలలో కనపడి నన్ను నట్టేట ముంచాడు!" అంటూ విఘ్నేశ్వరపూజారి లబలబలాడాడు.

"ఇప్పటికైనా మించి పోయింది లేదు. తెలివైన వాళ్ళు కనక, ఆ జంగుపిల్లుల్లాగే యీ అరణ్యంలో బతకండి. లేదూ, మరో



మాయ రాకాసి ఏనుగును తయారు చేసి, మరేదైనా రాజ్యం మీదికి పంపిస్తుంది." అన్నాడు ఖడ్గవర్మ పెద్దగా నవ్వుతూ.

"సరే, ప్రస్తుతానికి మా వెంట వుండండి. ఏం చేయాలో ఆలోచిద్దాం." అన్నాడు జీవదత్తుడు.

తరవాత నలుగురూ ఉత్తర దిక్కుగా బయలుదేరి సూర్యాస్తమయ వేళకు అరణ్యంలోని కొండప్రదేశాన్ని చేరారు. ఆ రాత్రికి అక్కడ వంట చేసుకుతిని, చెట్ల మీద పడుకున్నారు. మర్నాటి ఉదయం తిరిగి ఖడ్గ జీవదత్తులు ప్రయాణం అవుతూండగా పూజారి, స్వర్ణాచారి కూడా వాళ్ళ వెంట వస్తామన్నారు.

"మా వెంట ఎంతదూరం రాగలరు? మేం వింధ్యపర్వతాలకు పోతున్నాం. మార్గంలో తారసిల్లే భయంకర ప్రమాదాల నుంచి మాకు మేము ఆత్మరక్షణ చేసుకోవటమే కష్టం. మీ బాధ్యత కూడా మా తల మీద ఎలా ఎత్తుకోగలం!" అన్నాడు జీవదత్తుడు.

"అయ్యా, మీ వెంట వస్తూ, దారిలో ఏదైనా పల్లెగాని, పట్నంగాని తగిలితే అక్కడ మేం వుండిపోతాం. ఈ అరణ్య మధ్యంలో మమ్మల్ని వదిలారో, ఆటవికులు మమ్మల్ని వేటాడేస్తారు." అన్నాడు విష్ణుశ్వర పూజారి.

వాళ్ళ ప్రాణభయం చూసి, ఖడ్గ జీవదత్తులకు వాళ్ళిద్దరి మీదా ఎంతో జాలి కలిగింది. ఆ తరవాత రెండు రోజుల పాటు ఎలాంటి చిక్కులూ, ప్రమాదాలూ లేకుండా వాళ్ళు అరణ్యంలో ప్రయాణం చేశారు. మూడవనాటి సూర్యోదయం వేళ చెట్లమీద పడుకుని వున్న ఖడ్గ జీవదత్తులకు కొంచెం దూరం నుంచి ఒక మనిషి వేస్తున్న కేకలూ, దూరంగా పులి గాండ్రిస్తూండటం వినబడింది.

ఆ గండ్రగోళం వింటూనే ఖడ్గ జీవదత్తులు చెట్టుకొమ్మల మీద లేచి కూర్చున్నారు. పూజారి, ఆచారి చెట్ల కొమ్మల్ని గట్టిగా కావిలించుకుని భయంతో వణికిపోసాగారు.


"జీవా, ఏమిటి వింత? ఆ మనిషికే మన్నా మతి పోయిందా? చూడబోతే నిరాయుధుడు. పులిపిల్లల్ని చంకన బెట్టుకుని అలా కేకలు పెడతాడేం? వాడి కేకలు పులి విన్నట్టుంది. దాని గాండ్రింపు విన్నావా?" అన్నాడు ఖడ్గవర్మ.

జీవదత్తుడు అల్లంతదూరంలో వున్న చెట్టు కేసి చూశాడు. పేలికలూ వాలికలూ అయిన దుస్తుల్లో వున్న యువకు డొకడు రెండు పులిపిల్లల్ని ఎత్తుకుని గంతుతూ, "పులీ! వ్యాఘ్రమా! రా, రా!" అంటూ కేకలు పెడుతున్నాడు.

"ఖడ్గా, ముందు మనం ఆ యువకుణ్ణి రక్షించాలి! తరవాత సంగతేమిటో తెలుసుకోవచ్చు." అంటూ జీవదత్తుడు చెట్టు మీది నుంచి కిందికి దిగసాగాడు. అంతలో పులి గాండ్రింపు యువకుడున్న చెట్టు పొదల వెనక వినబడింది.

"వాడెవడో చచ్చిన వాడి కింద లెక్క. తల్లి పులి వచ్చి యువకుడి మీద పడుతున్నది!" అంటూ కత్తి దూసి ఖడ్గవర్మ చెట్టుమీది నుంచి కిందికి దూకి యువకుడి కేసి పరిగెత్తాడు.

"పిల్లల తల్లి! సాధ్యమైనంత వరకూ దాన్ని చంపకు!" అంటూ జీవదత్తుడు ఖడ్గవర్మను హెచ్చరించి, చెట్టు దిగి యువకుడి కేసి పరిగెత్తసాగాడు.



ఖడ్గ జీవదత్తులు ఆ ప్రదేశానికి వెళ్ళేలోపలే పులి, యువకుడున్న చెట్టు దగ్గరకు పెద్దగా గాండ్రిస్తూ దూకుతూ వచ్చింది. యువకుడు దాన్ని చూస్తూనే, "రా, వచ్చావా? కంఠం ఒక్కసారి కొరికి చంపు!" అంటూ దాని కేసి ఉరికాడు.

పులికూడా నిరాయుధుడైన మనిషి తన కేసి దూకటం వింతా, భయం కలిగించి వుంటుంది. అది యువకుడి మీదికి దూకటమా, మానటమా అన్న సంశయంలో ఒక్క త్రుటికాలం వున్నచోటునే ఆగిపోయింది. అంతలో జీవదత్తుడు అక్కడికి చేరాడు. యువకుడి చేతిలో వున్న పులిపిల్లలు రెండూ ఒక్కసారిగా బుసలు



# రాతిరథం

## 19

[ఖడ్గ జీవదత్తులు పూజారిని, అదారిని వెంటబెట్టుకుని అరణ్యంలోకి పోయారు. అక్కడ ఒక చెట్టు కింద పులిపిల్లలను పట్టుకుని కేకలు పెడుతున్న యువకుడొకడు వాళ్ళకు కనిపించాడు. ఖడ్గ జీవదత్తులు అతణ్ణి సమీపించేంతలో, ఖడ్గమృగం మీద సవారీ అయిన వాడొకడు ముందుకు వచ్చి, వాళ్ళను చుట్టుముట్టి పట్టుకోమని అరిచాడు. తరవాత—]

ఖడ్గమృగం మీద ఎక్కి వచ్చినవాడు తన అనుచరులకు చేసిన హెచ్చరిక వింటూనే ఖడ్గ జీవదత్తులు తమకు ప్రమాదం రాబోతున్నదని గ్రహించారు. ఆ మరుక్షణం జీవదత్తుడు దండంతో ఖడ్గమృగం మీద వున్న వాడి తల మీద కొట్టాడు. వాడు, "అరణ్యమాతా!" అంటూ కిందబడిపోయాడు.

"ఒరే, అరణ్యమాత పుత్రుల్లారా! మీమీ ఆయుధాలు కింద పడవేసి లొంగిపొండి. లేకపోతే మీకు చావు తప్పదు. మీ నాయకుడికి పట్టిన అవస్థ చూశారుగదా?" అంటూ గట్టిగా కేక పెట్టాడు జీవదత్తుడు.

"పెంపుడు పులిని మీదికి వదలమంటారా, చెట్ల చాటు నుంచి బయటికి వస్తారా?" అన్నాడు ఖడ్గవర్మ.

నలుగురు అటవికులు చేతులు పైకెత్తి చెట్లచాటు నుంచి ముందుకు వచ్చారు. వాళ్ళ దగ్గిర వున్నవి రాతి ఆయుధాలు.



"మీ మీ ఆయుధాలు యిక్కడ కింద పడవేయండి," అంటూ జీవదత్తుడు ఆటవికులను హెచ్చరించి, ఖడ్గవర్మతో, "వీళ్ళు ఆటవికుల్లో కూడా బాగా వెనకబడిన జాతి వాళ్ళలా వున్నారు. సరే, ఈ పులి నోట తల పెట్టాలని వచ్చిన యువకుడు వింధ్య పర్వతాల కేసి వెళ్ళే మనకు మరొక కొత్త సమస్య తెచ్చి పెట్టాడు." అన్నాడు.

జీవదత్తుడు యిలా అనగానే యువకుడు, "అయ్యా, నన్ను కూడా మీ వెంట తీసుకుపోండి. పులి నుంచి కాపాడి నన్ను అరణ్యపురం గణాచారికి ఒప్పచెప్పకండి. వారు నన్ను చిత్రహింసలకు గురి చేస్తారు." అన్నాడు ఏడ్పుగొంతుతో.

జీవదత్తుడు ఏదో జవాబివ్వబోయేంతలో, పూజారి, స్వర్ణాచారి అక్కడికి వచ్చారు.

"మీ ఇద్దరూ యింకా బతికే వున్నారా? యిప్పటివరకూ ఎక్కడున్నారు?" అని అడిగాడు ఖడ్గవర్మ యీసడిస్తున్నట్టు.

"మహాశూరుల్లారా! మేము వృక్ష శాఖల్లో వుండి, మీ శౌర్య పరాక్రమాలను అబ్బురపాటుతో తిలకిస్తున్నాం!" అన్నాడు విఘ్నేశ్వరపూజారి.

"అక్కడే వుండి తిలకించక మరి దిగారెందుకు? జీవా! ఇక మనం యీ చచ్చు పుచ్చు వెధవ లందర్నీ యిక్కడొదిలి మన దారిన మనం పోదాం. వాళ్ళ గతవేదో వాళ్ళు పడతారు." అన్నాడు ఖడ్గవర్మ.

"ఖడ్గా, తొందరపడకు. వీళ్ళను అంత తేలిగ్గా వదలటం సాధ్యమయేది కాదు." అని జీవదత్తుడు ఖడ్గవర్మను మందలించి యువకుడికేసి, "నీ పేరేమిటి? ప్రమాదం తప్పింది గనక, ఆ అరణ్యపురం గణాచారికి అందకుండా మరెక్కడికైనా పోయి బతకలేవా?" అని అడిగాడు.

"నా పేరు అరణ్యమల్లు. గణాచారి కంట బడకుండా, యీ అరణ్యంలో బతగ్గలగటం ఎవరి తరమూ కాదు. నన్ను కూడా మీ వెంట తీసుకుపోండి. వారు మోసంతో నా సింహాసనాన్ని ఆక్రమించారు." అన్నాడు యువకుడు.

"సరే, పనిలో పనిగా నీ సమస్య కూడా పరిష్కరించి పోతాం. ఆ గణాచారి ఎలాంటి మోసంతో నిన్ను అధికారంనుంచి తొలగించాడు?" అని అడిగాడు జీవదత్తుడు.



అరణ్యమల్లు జరిగినదంతా క్లుప్తంగా చెప్పాడు. అరణ్యపురానికి అరణ్యమల్లు తండ్రి రాజు. అతడు మూడు నెలల క్రితం మరణించాడు. ఆ నాటి నుంచీ గణాచారి అరణ్యమల్లును సింహాసనం నుంచి తొలగించేందుకు చాలా యుక్తులు పన్నాడు. అవేవీ పారలేదు. చివరకు వారం రోజుల క్రితం గణాచారి అరణ్యమాత ఆలయంలో కుల పెద్దలందరినీ పోగు చేసి, రాజ్యపాలనకు అరణ్యమల్లు పనికిరాడని అరణ్యమాతే స్వయంగా తనకు చెప్పిందనీ, కావాలంటే మరో మారు ఆ మాత నోటి నుంచే ఆ సంగతి అందరూ వినవచ్చునీ అన్నాడు.

ఆ తరవాత అరణ్యమాత విగ్రహానికి ధూపం వేసి, "మాతా! ఈ రాజ్యసింహాసనానికి అరణ్యమల్లు అర్హుడా? లేక మరెవరైనా అందుకు తగిన వాళ్ళు వున్నారా?" అని అడిగాడు గణాచారి.

ఆ వెంటనే విగ్రహం నోటిలో నుంచి, "మల్లు అనాచారి! రాజ్యపాలనకు అనర్హుడు. నా గణాచారివైన నువ్వే సింహాసనం ఎక్కితే, రాజ్యం అంతా సుభిక్షంగా వుంటుంది." అన్న మాటలు వెలువడ్డాయి.

"వినండి! వినండి! కుల పెద్దలారా!" అంటూ గణాచారి గంతులు వేయసాగాడు. అరణ్యమల్లు మాత్రం ఎక్కడలేని కోపంతో దిగ్గున పోయి, ఒక రాతి గదతో అరణ్యమాత విగ్రహాన్ని బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు విగ్రహం చేయొకటి విరిగిపోయింది.

"అపచారిని పట్టుకోండి! చిత్రవధ చేసి చంపండి!" అంటూ గణాచారి కేకలు వేశాడు.

అక్కడ చేరిన వాళ్ళల్లో కొందరు లేచి అరణ్యమల్లును పట్టుకోవాలని చూశారు. కాని, అరణ్యమల్లు ఎలాగో వారి బారి నుంచి తప్పించుకుని, అరణ్యం చేరాడు.



అయినా గణాదారి అనుచరులు అతడి కోసం అరణ్యం అంతా గాలిస్తూనే వున్నారు. ఇక తను తప్పించుకు పోగలగటం అసంభవం అనుకుని అతడు పులి నోట పడేందుకు ప్రయత్నించాడు.

"రాతివిగ్రహాల చేత మాటలు పలికించే ఆ గణాదారి ఎలా వుంటాడో చూడాలని వుంది. మీ అరణ్యపురానికి దారి తియ్యి, మల్లా!" అన్నాడు జీవదత్తుడు.

అరణ్యమల్లు కొంచెంగా వణుకుతూ, "సరాసరి అరణ్యపురానికి బయలుదేరి పోవటమా? వాడికి చాలామంది అనుచరులు వున్నారు. వాళ్ళందరికీ వాడి మహత్తులో పెద్ద నమ్మకం కూడా వుంది," అన్నాడు.

ఖడ్గవర్మ చిన్నగా నవ్వి, ఖడ్గమృగ నాయకుణ్ణి, "మా వెంట అరణ్య పురానికి వచ్చి, మాకు సాయంగా వుంటావా? లేక యిప్పుడే నా పెంపుడు పులికి ఆహారం అయిపోతావా?" అని అడిగాడు.

ఖడ్గమృగ నాయకుడు నిలువెల్లా వణికి పోతూ, "అయ్యో, మమ్మల్ని కరుణించండి. ఈ అరణ్యమల్లు అనాదారి అని అరణ్యమాత చెప్పింది. అటాంటి వాడికి మేమెలా సహాయపడగలం!" అన్నాడు.

జీవదత్తుడు, ఖడ్గమృగ నాయకుడితో, "ఆ విజానిజాలు నిలకడ మీద గాని తెలవు. ముందుండి మీ అరణ్యపురానికి దారి తియ్యండి." అన్నాడు.

అందరూ అరణ్యపురం కేసి బయలుదేరారు. ఖడ్గవర్మ పులిపిల్లలను భుజం మీద పెట్టుకుని, అడవి తీగ మెడకు కట్టి వున్న తల్లి పులిని వెంట వేసుకుని బయలుదేరారు. అరణ్యమార్గాల వెంట చాలా దూరం ప్రయాణించి సూర్యాస్తమయ సమయంలో వాళ్ళు అరణ్యపురాన్ని చేరారు. వాళ్ళను చూసి గణాదారి అతడి అనుచరులూ భయకంపితులై పోయారు.

జీవదత్తుడు దండం పైకెత్తి పెద్ద గొంతుతో, "అరణ్యపురం గణాదారీ, చెప్పేది శ్రద్ధగా విను! మీ అరణ్యపురం అంటే ఏదో నగరంలా వుంటుందనుకున్నాను. గుహలూ, రాళ్ళూ



రప్పలూ చేర్చి కట్టిన విచిత్రకగూళ్ళలా వున్నది మీ పురం. సరే. దీన్ని యీ క్షణం లోనే నా మంత్ర శక్తితో భస్మం చేయగలను. కాని, మీ అరణ్యమాత మహత్తు గురించిన నిజానిజాలు తెలుసుకున్న తరవాత ఆలోచిస్తానని వదిలేస్తున్నాను. నేను వచ్చిన పనేమిటో, నీ ఖడ్గమృగ నాయకుడు చెప్తాడు, విను!" అన్నాడు.

ఖడ్గమృగ నాయకుడు, గణాచారికి అరణ్యంలో జరిగినదంతా చెప్పాడు.

గణాచారి యిదంతా విని మరింతగా భయపడిపోయి, ఖడ్గ జీవదత్తుల దగ్గిరకు వచ్చి వంగి నమస్కారం చేసి, "అయ్యలారా! మీ వెంట వున్న అరణ్యమల్లు మాతకు చాలా అపచారం చేశాడు. మాత స్వయంగా తన నోటితో సింహాసనం ఎక్కేందుకు నేను తగిన వాణ్ణని చెప్పింది. మాత మాటలు విన దలిస్తే, ఈ రాత్రి పది గంటల వేళకు మీరు ఆమె మందిరానికి రావచ్చు," అన్నాడు.

"తప్పక వస్తాం. అరణ్యమాత వాక్కులు మా చెవులారా విని, యీ అరణ్యమల్లును మా పెంపుడు పులికి మీ ఎదటనే ఆహారంగా వేసి, మా దారిన మేం పోతాం," అన్నాడు జీవదత్తుడు.

"మహామాంత్రికుల్లారా! ధన్యోస్మి. మీ విశ్రాంతికీ, భోజనాలకూ ఏర్పాట్లు యిప్పుడే చేస్తాను," అన్నాడు అరణ్యపురం గణాచారి.

అతడి అనుచరులు ఖడ్గ జీవదత్తుల్ని, వాళ్ళ వెంట వున్న వాళ్ళనూ ఒక శిథిల భవనానికి తీసుకుపోయి అందులో విడిది ఏర్పాటు చేశారు.

అది పౌర్ణమి రాత్రి. చంద్రకాంతిలో అరణ్యపురం, ఆ పరిసరాలనున్న కొండలూ, అరణ్యాలూ వెలిగిపోతున్నవి. సరిగా పది గంటల వేళ గణాచారి అనుచరు లొకడు వచ్చి ఖడ్గ జీవదత్తులను అరణ్యమాత మందిరానికి రావలసిందిగా ఆహ్వానించాడు. విఘ్నేశ్వరపూజారినీ, స్వర్ణాచారినీ వెంటబెట్టుకుని వాళ్ళు మందిరానికి వెళ్ళారు. అక్కడ ఆ సరికే గణాచారి అతడి జాతివాళ్ళూ కూర్చుని వున్నారు.



ఖడ్గ జీవదత్తులు అరణ్యమాత విగ్రహం దగ్గిరకు పోయి, విగ్రహాన్ని పరీక్షగా చూశారు. విగ్రహం నిలువెత్తున వున్నది. ఒక చేయి విరిగి పోయి వున్నది. దాని రెండవ చేతిలో ఒక పెద్ద రాతి గద వున్నది. విగ్రహం పెద్దగా నోరు తెరిచి వున్నట్టు చెక్కబడింది.

గణాచారి విగ్రహం ముందున్న పళ్ళాలలో కణకణలాడుతున్న బొగ్గుల మీద సాంబ్రాణి వేసి, గుప్పుమంటూ పొగ లేవగానే ఏవో మంత్రాలు చదువుతూ కొంచెం సేపు అటూ ఇటూ గంతులు వేసి, తన అనుచరుడొకడు తెచ్చియిచ్చిన పళ్ళూ ఫలాలున్న పాత్రతో విగ్రహం ముందుకుపోయి, ఒకటి రెండు అరటిపళ్ళను తెరిచి వున్న విగ్రహం నోట్లో వేసి, "మాతా! మరొకసారి పలుకు. ఈ రాజ్యాన్ని పాలించేందుకు అర్హుణ్ణి నేనా లేక అరణ్యమల్లుడా?" అన్నాడు.

వెంటనే విగ్రహం నోటిలోంచి, "అరణ్యమల్లు అనాచారి. నా చేయి విరగ్గొట్టాడు. గణాచారీ! రాజ్యాన్ని నువ్వే పాలించు. ఆ మల్లును నాకు బలి యివ్వు!" అన్న మాటలు వినిపించినై.

"వినండి! వినండి! మాత పలికింది!" అంటూ గణాచారి గెంతసాగాడు.

జీవదత్తుడు చిన్నగా నవ్వి ఖడ్గవర్మ చెవిలో ఏదో చెప్పాడు. వెంటనే ఖడ్గవర్మ పులి దగ్గిరకు పోయి కత్తిదూసి నిలబడ్డాడు. జీవదత్తుడు, గణాచారి కేసి ఓ మారు చూసి విగ్రహం ముందు ఎర్రగా కాలి సాంబ్రాణి పొగలు విరజిమ్ముతున్న బొగ్గుల పళ్ళాన్ని రెండు చేతులతో ఎత్తి, ఆ కాలే బొగ్గులను తెరిచి వున్న అరణ్యమాత నోటిలో పోశాడు. మరుక్షణం విగ్రహం పొట్టలో నుంచి దావుకేక ఒకటి వినిపించింది. అందరూ ఆశ్చర్యపడి చూసేంతలో, విగ్రహం వెనక వున్న ఒక కొయ్య భోషాణం తలుపు తెరుచుకుని, కాలుతున్న గుడ్డలతో ఒక ఆటవికుడు బయటికి వచ్చి పడ్డాడు.

ఇదంతా క్షణాల మీద జరిగిపోయింది. భోషాణం లోంచి తన ఆటవిక శిష్యుడు కేకలు వేస్తూ బయటికి రావటం చూస్తూనే



గణాచారి కూడా ఒక చావు కేక పెట్టి మందిరంలో నుంచి బయటికి పరిగెత్త సాగాడు. వాయు మందిర ద్వారం దాటుతూండగా ఖడ్గవర్మ తన కత్తితో పులికి కట్టివున్న అడవి తీగను నరికి వేశాడు. పులి పారిపోతున్న గణాచారి వెంటబడి మీదికి దూకి వాడి గొంతు పట్టుకున్నది. ఆ సమయానికి పులి పిల్లలు రెండూ తల్లి దగ్గిరకు పరిగెత్తినై.

వెన్నెల కాంతిలో ఈ భయంకర దృశ్యాన్ని చూసి అటవికులందరూ భయ కంపితులైపోయారు. జీవదత్తుడు వాళ్ళతో, "గణాచారి మోసం తెలుసుకున్నారు గదా! ఇప్పుడు మీకు రాజు కాదగిన వాడెవడో నిర్ణయించుకోండి!" అన్నాడు.

అటవికులందరూ ఏక కంఠంతో, "మా రాజు అరణ్యమల్లు!" అని అరిచారు.

"సరే, అరణ్యమల్లు ఇక్కడే వున్నాడు. మేం మిద్దె మీదికి పోయి వెన్నెల్లో విశ్రమిస్తాం!" అంటూ జీవదత్తుడు తన అనుచరులతో మిద్దె మీదికి వెళ్ళాడు.

ఆ వెంటనే పెనుగాలి లేచి చుట్టుపక్కల వున్న చెట్టుచేమలు వూగిపోయినై. ఆకాశంలో ఉరుములాంటి చిన్న ధ్వని అయింది. జీవదత్తుడితో పాటు అందరూ తలలు పైకెత్తి చూశారు. దూరం నుంచి నల్లని మేఘం లాంటి దొకటి వారికేసి వస్తున్నది. ఆశ్చర్య భయాలతో వాళ్ళు దానికేసి చూస్తున్నంతలో అది వాళ్ళ తలల మీదికి వచ్చి ఆకాశంలో ఆగిపోయింది. అది మేఘం కాదు. లోగడ పద్మపుర రాజకుమారి పద్మావతి, ఖడ్గ జీవదత్తుల కిచ్చిన బొమ్మ రాతిరథాన్ని పోలి వున్నదా రథం.

రథంలో యక్షుడొకడున్నాడు. అతడి పక్కన రాజకుమారి పద్మావతి కూర్చుని వున్నది. యక్షుడు మేఘగర్జనలాంటి కంఠస్వరంతో, "ఖడ్గ జీవదత్తులారా! ఇక మీరు వింధ్యపర్వతాలకు పోయి రాతిరథాన్ని కదిలించ నవసరంలేదు. ఇదుగో, ఆ రథాన్ని నేను కదిలించి ఆకాశమార్గాన పద్మపురం పోయి, రాజకుమారి పద్మావతిని వివాహం ఆడి, నా పురానికి పోతున్నాను," అన్నాడు.

"ఇది రాజకుమారి అపహరణ కాదుగదా! రాకుమారి. యక్షుడు చెప్పినది నిజమా?" అంటూ జీవదత్తుడు పెద్దగా కేకపెట్టాడు.

జీవదత్తుడి ప్రశ్నకు జవాబుగా యక్షుడు బిగ్గరగా నవ్వాడు. రాతిరథం జుయ్‌మంటూ వేగంగా కదిలి చూస్తూండగానే ఆకాశంలో అంతర్ధానమైపోయింది.

"జీవా! మనం పడిన శ్రమ అంతా వృధా!" అన్నాడు ఖడ్గవర్మ నిరాశగా.

"మన శ్రమ ఏమీ వృధా కాలేదు. మనం మహా వీరులం అని రుజువు చేసేందుకు వింధ్యపర్వతాలకు బయలుదేరాం. దారిలో ఎదురైన అన్ని ప్రమాదాలనూ మన బాహుబలంతో జయించి మహా వీరులం అనిపించుకున్నాం. ఎందుకు విచారం?" అన్నాడు జీవదత్తుడు.

"నువ్వన్నది నిజం! మనం యీ అరణ్యపురంలోనే కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకుని, యీ చుట్టుపక్కల ఏదైనా ఒక రాజ్యాన్ని స్థాపించటం ఎలా వుంటుంది?" అన్నాడు ఖడ్గవర్మ.

"మహా దివ్యంగా వుంటుంది. మన నివాసం ప్రస్తుతానికి యీ అరణ్యపురమే! రాజ్యస్థాపన విషయం నిదానంగా ఆలోచిద్దాం." అన్నాడు జీవదత్తుడు.

"మహా శూరులారా! ఆ స్థాపించబోయే రాజ్య ప్రధాననగర నిర్మాణం నాకు వదలండి. వాస్తుశాస్త్రంలో నేను మయుడంతటి వాణ్ణి." అన్నాడు స్వర్ణాచారి.

"నిజం మహాశూరులారా! మీరు కత్తితో జయించలేనిదాన్ని, నేను మాయోపాయంతో సాధించగలను. నేను ఆ విద్యలో శకునికి సాటివాణ్ణి." అన్నాడు విఘ్నేశ్వరపూజారి.

"మీ శక్తిసామర్థ్యాల్లో నాకు గట్టి విశ్వాసమే వున్నది. అట్టా. రాత్రి చాలా పొద్దుపోయినట్టుంది. ఈ వెన్నెల్లో హాయిగా నిద్రిద్దాం." అంటూ జీవదత్తుడు, చదునుగా వున్న ఒక చోటు చూసుకుని పడుకున్నాడు.

అతడితో పాటు ఖడ్గవర్మా, విఘ్నేశ్వర పూజారి, స్వర్ణాచారి కూడా చదునైన చోట్లు చూసుకుని పడుకుని, సుఖంగా నిద్రపోయారు. —(అయిపోయింది)

